www.truepointnews.com
ESTD 2024
PointNewsDaily
pointnewsdaily
ARN No: T/TG/2024/1040
Vol.I ISSUE 273
*Air Surcharge Extra Applicable

# పాయింట్

**Published From :** Vijaywada - Hyderabad - Delhi - Bengaluru
గురువారం 03, జూలై, 2025 | పేజీలు :12



# రాయలసీమ హార్టికల్చర్ హబ్‌గా కుప్పం : సీఎం చంద్రబాబు

## దేశంలోనే కుప్పాన్ని ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతా

## కుప్పంలో సీఎం చంద్రబాబు పర్యటన

### స్వర్ణ కుప్పం ప్రాజెక్టు కింద రూ. 1292 కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం

### యజ్ఞం చేయాలి.. రాక్షసులపై పోరాడాలన్న చంద్రబాబు

**టీపీఎన్, కుప్పం:**

దేశంలోనే కుప్పం నియోజకవర్గాన్ని ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చారు ముఖ్యమంత్రి చంద్రబాబు. బుధవారం కుప్పం నియోజకవర్గంల పర్యటించారు. స్వర్ణ కుప్పం ప్రాజెక్టులో భాగంగా పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. అనంతరం తుమ్మిశిలో నిర్వహించిన 'ప్రజావేదిక' సభలో చంద్రబాబు మాట్లాడారు. కుప్పం నియోజకవర్గ ప్రజల చిరకాల స్వప్నమైన హంద్రీనీవా నీళ్లను ఈ ఏడాదిలోనే అందిస్తామని ముఖ్యమంత్రి భరోసా ఇచ్చారు. కుప్పం రూపులేఖలు మార్చబోతున్నామన్నారు. రాయలసీమ హార్టికల్చర్ హబ్‌గా నియోజకవర్గం నిలవబోతోందని చెప్పారు. స్వర్ణ కుప్పం ప్రాజెక్టు కింద నియోజకవర్గంలో మొత్తం రూ. 1292 కోట్ల విలువైన అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు చంద్రబాబు వెల్లడించారు. ఇప్పటికే రూ. 125 కోట్ల విలువైన పనులు పూర్తయ్యాయని తెలిపారు. రూ. 3,890 కోట్ల వ్యయంతో హంద్రీనీవా పనులను పూర్తి చేసి, నియోజకవర్గంలోని చివరి ఆయకట్టు వరకు సాగునీరు పారిస్తామని తెలిపారు చంద్రబాబు. విధ్వంసానికి గురైన రాష్ట్రాన్ని తిరిగి వికాసం వైపు నడిపిస్తున్నామని స్పష్టం చేశారు. అభివృద్ధి చేసే వారికే సంక్షేమం గురించి మాట్లాడే హక్కు ఉంటుందన్నారు. అప్పులు తెచ్చి సంక్షేమం చేస్తామనడం సరైన పరిపాలన కాదన్నారు. అభివృద్ధి ద్వారా ఆదాయాన్ని సృష్టించి, దానిని సంక్షేమ పథకాలకు ఖర్చు చేయడమే సరైన ఆర్థిక విధానమని స్పష్టం చేశారు. తమ ప్రభుత్వం గత ఏడాదిగా ఇదే పాలసీని అనుసరిస్తోందని వివరించారు.

ఈ సందర్భంగా రైతులకు గుడ్ న్యూస్ చెప్పారు సీఎం చంద్రబాబు. రైతుల పంపుసెట్లకు ఉచితంగా సౌర విద్యుత్ అందిస్తామని తెలిపారు. శాశ్వతంగా విద్యుత్ ఛార్జీలు చెల్లించే పనిలేకుండా ప్రతి ఇంట్లో సౌర విద్యుత్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. పీఎం సూర్యఘర్ కింద మూడు కిలో వాట్ల విద్యుత్ ఉత్పత్తికి బీసీలకు రూ.98 వేల రాయితీ ఇస్తామన్నారు. కుప్పం ప్రాంతానికి విమానాశ్రయం వస్తుంది.. కుప్పంహోసూరుకు సమాంతరంగా మరో రోడ్డు నిర్మాణం జరుగుతోందన్నారు. నియోజకవర్గానికి పెద్ద ఎత్తున పరిశ్రమలు రానున్నాయని చెప్పారు. కుప్పం విమానాశ్రయానికి భూములు ఇచ్చిన వారికి మెరుగైన ప్యాకేజీ ఇస్తాం. రూ.వెయ్యి కోట్లతో పలమనేరుకృష్ణగిరి మధ్య 4 వరుసల రోడ్డు నిర్మాణం చేపడతామని చంద్రబాబు తెలిపారు. 10 లక్షల లీటర్ల పాల ఉత్పత్తి నియోజకవర్గంగా కుప్పం నిలిచేలా చర్యలు చేపడతామన్నారు.

స్వర్ణ కుప్పం ప్రాజెక్టులో భాగంగా నియోజకవర్గంలోని రహదారులన్నింటినీ సీసీ, బీటీ రోడ్లుగా మార్చనున్నామని, రాష్ట్రవ్యాప్తంగా గుంతలు లేని రహదారులను నిర్మించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. ప్రజల ఆశీస్సులతోనే ఏడాదిగా సుపరిపాలన అందిస్తున్నామని పేర్కొన్నారు. గతంలో తాము ప్రవేశపెట్టిన 'దీపం' పథకం ద్వారా గ్యాస్ కనెక్షన్లు అందిస్తే, ఇప్పుడు 'దీపం 2.0' ద్వారా అర్హులైన మహిళలందరికీ ఉచితంగా గ్యాస్ సిలిండర్లు అందిస్తున్నామని చెప్పారు. దీనివల్ల కుప్పం నియోజకవర్గంలోని ప్రతి ఇంటిలోనూ వంట గ్యాస్ అందుబాటులోకి వచ్చిందని చంద్రబాబు సంతోషం వ్యక్తం చేశారు. కుప్పం ప్రజలు తొమ్మిదిసార్లు తనను ఎమ్మెల్యేగా ఆశీర్వదించారని చెప్పారు. సుపరిపాలనలో భాగంగానే ప్రజల ముందుకు వచ్చానని, ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకుంటానని ఆయన స్పష్టం చేశారు. వైసీపీ పాలనతో రాష్ట్రంలో విధ్వంసం జరిగింది. అది తలచుకుంటే భయమేస్తోందన్నారు సీఎం చంద్రబాబు. తాను హత్యా రాజకీయాలు, శవ రాజకీయాలు చేయనని చెప్పారు. యజ్ఞంలా అభివృద్ధి చేస్తుంటే రాక్షసుల్లా ఫలితాలు రాకుండా చేస్తున్నారని మండిపడ్డారు. ధర్మాన్ని కాపాడతా.. అభివృద్ధికి అడ్డం వస్తే తొక్కుకుంటూ పోతామన్నారు. యజ్ఞం చేయాలి.. రాక్షసులపై పోరాడాలన్నారు. ఫలితాలను ప్రజలకు అందించాలని చెప్పారు సీఎం చంద్రబాబు.



# ఏపీలో లక్ష ఫామ్ పాండ్స్ నిర్మాణం పూర్తి!

## రైతుల సహకారంతోనే ఇది సాధ్యమయిందని పవన్ ప్రశంస

## కేంద్రం నుంచి సంపూర్ణ సహకారం : డిప్యూటీ సీఎం

## రైతులకు, కేంద్రానికి, సీఎం చంద్రబాబుకు పవన్ కృతజ్ఞతలు

**టీపీఎన్, అమరావతి :**

రాష్ట్రంలో గ్రామీణాభివృద్ధికి తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తెలిపారు. ఈ క్రమంలో రాష్ట్రవ్యాప్తంగా లక్ష వ్యవసాయ కుంటల (ఫామ్ పాండ్స్) నిర్మాణాన్ని పూర్తి చేసి రైతులకు అందుబాటులోకి తెచ్చామని ఆయన ఎక్స్ వేదిక ద్వారా వెల్లడించారు.

**వ్యవసాయ కుంటల ప్రాముఖ్యత**

పవన్ కల్యాణ్ మాట్లాడుతూ.. ఈ వ్యవసాయ కుంటలు కరవు సమయంలోనూ రైతులకు ఆసరాగా నిలుస్తాయని చెప్పారు. ఈ కుంటల ద్వారా నిస్సారమైన భూములకు జీవం పోసే అవకాశం ఉందని, భూగర్భ జలాల స్థాయి పెరగడంలో ఇవి కీలక పాత్ర పోషిస్తాయని వివరించారు. ఈ నిర్మాణాల వల్ల ఇప్పటివరకు సుమారు 1 టీఎంసీ నీటిని నిల్వ చేసే సామర్థ్యం సమకూరిందని, అదే సమయంలో గ్రామీణ ఉపాధి హామీ కూలీలకు ఉపాధి కల్పించినట్టు అయిందని ఆయన తెలిపారు.

**రైతుల సహకారం**

ఈ భారీ కార్యక్రమం రైతుల సహకారం వల్లనే సాధ్యమైందని **మిగతా 2వ పేజీలో..**



**ఎట్టకేలకు వల్లభనేని వంశీకి బెయిల్!** 02

**జిన్ పింగ్ శకం ముగిసినట్టేనా?** 09





**త్వరలో మిడిల్ క్లాస్‌కు కేంద్రం గుడ్‌న్యూస్!** 10

**బనకచర్లపై హరీశ్‌రావుది రాజకీయ డ్రామా : మంత్రి పయ్యావుల**



04

# సింగయ్య కుటుంబానికి జగన్ పరామర్శ!

**టీపీఎన్, తాడేపల్లి :**

పల్నాడు జిల్లా రెంటపాళ్ల పర్యటనలో మృతి చెందిన చీలి సింగయ్య, పాపసాని వెంకట జయవర్ధన్ రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించారు వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్. బుధవారం తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయానికి ఆ రెండు కుటుంబాలను పిలిపించి ఓదార్చారు. తొలుత చీలి సింగయ్య భార్య లూర్ధు మేరి, పిల్లలు, ఇతర కుటుంబ సభ్యులు జగన్‌ను కలిశారు. ఈ తరుణంలో సింగయ్య కుటుంబ సభ్యులను ఓదార్చిన వైఎస్ జగన్.. పార్టీ అన్ని విధాల అండగా ఉంటుందని, ఆదుకుంటామని తెలిపారు. ఇప్పటికే సింగయ్య కుటుంబానికి వైసీపీ అండగా నిలిచింది. రూ.10 లక్షల ఆర్థిక సాయం కూడా అందజేసింది. మరోవైపు సత్తెనపల్లికి చెందిన పాపసాని వెంకట జయవర్ధన్‌రెడ్డి కుటుంబానికి కూడా వైఎస్సార్‌సీపీ అండగా నిలిచింది. తక్షణమే పార్టీ తరపున రూ.10 లక్షల సాయం అందజేశారు. జయవర్ధన్ తల్లిదండ్రులు సావిత్రి, భాస్కర్ రెడ్డి, సోదరుడు మణికంఠ రెడ్డి, ఇతర కుటుంబ సభ్యులు జగన్‌ను కలిశారు. జయవర్ధన్ కుటుంబాన్ని వైసీపీ అన్నివిధాల ఆదుకుంటుందని ఈ సందర్భంగా వైఎస్ జగన్ భరోసా ఇచ్చారు. వైసీపీ ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి, ప్రత్తిపాడు నియోజకవర్గ సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్ సింగయ్య కుటుంబాన్ని తీసుకొచ్చి జగన్‌తో కలిపించారు.

**జయవర్ధన్ రెడ్డి కుటుంబానికి భరోసా**

అలాగే రెంటపాళ్లలో జగన్ పర్యటన సందర్భంగా సత్తెనపల్లిలో పాపసాని జయవర్ధన్ రెడ్డి అనే వ్యక్తి గుండెపోటుకు గురై ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో బుధవారం పాపసాని వెంకట జయవర్ధన్ రెడ్డి తల్లిదండ్రులు సావిత్రి, భాస్కర్ రెడ్డి, సోదరుడు మణికంఠ రెడ్డి తాడేపల్లిలోని వైసీపీ కేంద్ర కార్యాలయంలో వైఎస్ జగన్‌ను కలిశారు. జయవర్ధన్ కుటుంబానికి వైసీపీ అండగా ఉంటుందని జగన్ భరోసా ఇచ్చారు. బాధిత కుటుంబానికి పార్టీ తరపున ఇప్పటికే రూ. 10 లక్షల ఆర్థిక సాయం కూడా అందజేశారు. జగన్‌ను కలిసిన వారిలో వైసీపీ సత్తెనపల్లి నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ్ రెడ్డి ఉన్నారు.





# మామిడికి మద్దతు కరువు.. రైతన్న గుండె బరువు

- సీఎం సొంత జిల్లాలో రోడ్డెక్కిన రైతన్న
- మామిడి పంటకు మద్దతు ధర లేక తీవ్ర నష్టాలు
- టోకెన్ సిస్టంతో రైతన్న అవస్థలు
- ఫ్యాక్టరీలు కుమ్మక్కై రైతులను మోసం చేస్తున్నాయంటూ ఆరోపణ

**చిత్తూరు జిల్లా:**

రాష్ట్రంలో పండించిన పంటకు మద్దతు ధర లేక రైతన్న రోడ్డెక్కుతున్న పరిస్థితి కనిపిస్తోంది. ప్రకాశం జిల్లాలో పొగాకు రైతులు.. గుంటూరు జిల్లాలో మిర్చి రైతులు, తూర్పు, గోదావరి జిల్లాలో ఆక్వా అన్నదాతలు.. ఇప్పుడు చిత్తూరు జిల్లాలో మామిడి రైతులు. అందరిది ఇదే పరిస్థితి పండిన పంటకు గిట్టుబాటు ధర లేక.. పెట్టిన పెట్టుబడులు ఎల్లక తీవ్ర నష్టాలపాలవుతున్నారు. చేసేందేం లేక ప్రభుత్వం ఆదుకోవాలంటూ రోడ్డెక్కి నిరసన తెలుపుతున్నారు. ఇదే క్రమంలో చిత్తూరు జిల్లాలో తోతాపూరి మామిడి బాగా పండుతోంది. ఈఏడాది చేతికొచ్చిన పంట అమ్ముకోలేక, ప్రభుత్వం ప్రకటించిన గిట్టుబాటు ధర లభించక అన్నదాతకు గుండెకోత మిగులుతోంది.మామిడి రైతుల పంటను కొనడంలో పల్ప్ ఫ్యాక్టరీలు సిండికేట్ అయ్యాయంటూ ఆందోళన చేస్తున్నారు రైతులు. మొదట కిలోకి రూ.12, ఆపై రూ.6 ప్రకటించి.. క్షేత్రస్థాయిలో మాత్రం కిలో రూ.3 కూడా దక్కడం లేదంటూ అన్నదాత ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దానికి ఒప్పుకున్నా.. కాయ కొనడానికి ఫ్యాక్టరీలు ముందుకు రాకపోవడంతో అరచేతిలో ప్రాణాలు పెట్టుకుని పంట అమ్మడానికి అగచాట్లు పడుతున్నారు. నిద్రాహారాల్లేక ఫ్యాక్టరీల ఎదుట పడిగాపులు కాస్తున్నారు.

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో మామిడి రైతుల పరిస్థితి దయనీయంగా ఉంది. కాణిపాకం నుంచి గుడిపాల సరిహద్దులో ఉన్న ఫ్యాక్టరీకి కాయలు తెస్తే అన్‌లోడింగ్ అయ్యేందుకు ఐదు రోజులు పడుతోందని వాపోతున్నారు రైతులు. రూ.5వేలు బాడపెట్టుకొని వస్తే.. ఒక్కరోజు అయినా.. రెండు రోజులు..మూడు రోజులు అయినా అదే రేటు ఇస్తున్నారని.. వచ్చిన డబ్బులు కనీసం బాడుగకు కూడా సరిపోవడం లేదంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తిండీనీళ్లు లేకుండా రోడ్లపై అవస్థలు పడుతున్నామని చెప్తున్నారు రైతులు. రోజుల కొద్ది అలాగే వాహనాల్లో ఉండడం వల్ల సరుకు సగం వరకూ పాడవుతోందని అంటున్నారు రైతులు. రాత్రి సమయాల్లో అధికారులు ఫ్యాక్టరీ యాజమాన్యాలు కుమ్మకై దొడ్డి దారిన టోకెన్లు అమ్ముకుని డైరెక్టుగా 10, 20 వాహనాలు లోపలకు పంపించేస్తున్నారని మండిపడ్డారు రైతులు. అదేంటని ప్రశ్నిస్తే మీకు దిక్కున్న చోట చెప్పుకోండి అంటూ దౌర్జన్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాము రోజుల కొద్ది నిద్రాహారాలు లేకుండా అవస్థలు పడుతుంటే కొందరు మాత్రం దర్జాగా సొమ్ము చేసుకుంటున్నారని ఆరోపించారు రైతులు. ఈసమయంలో రైతుల పట్ల అధికారులు ఫ్యాక్టరీ యాజమాన్యాలు ప్రత్యేక చొరవ చూపించాలని వేడుకుంటున్నారు. మరోవైపు కిలో మామిడికి రూ.12 గిట్టుబాటు ధర కల్పిస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. అయితే కిలోకు రూ.4 మించి ఇవ్వలేమని ఫ్యాక్టరీలు చెప్పడంతో, కిలోకు రూ.8 ఫ్యాక్టరీలు చెల్లించాలని, మిగిలిన రూ.4 ప్రభుత్వమే భరిస్తుందని.. ఆ మొత్తాన్ని రైతుల ఖాతాలో జమచేస్తామని వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు ప్రకటించారు. కానీ ఫ్యాక్టరీలు కూడా ఈ ధరలు పాటించలేదు. కిలోకు రూ.4 మించి ఇవ్వలేమని ఖరాకండిగా చెప్పేస్తున్నాయి. కొన్ని చోట్ల కిలో రూ.3 సైతం చెల్లిస్తున్నారని రైతులు చెప్తున్నారు.

చిత్తూరు జిల్లాలో తోతాపూరి మామిడికి పెట్టింది పేరు. ప్రతీ ఏటా దాదాపు 40 వేల హెక్టార్లలో తోతాపురి మామిడి రకాన్ని రైతాంగం సాగుచేస్తోంది. ఈఏడాది మామిడి పంట రైతులు ఆశించిన దానికంటే అధిక స్థాయిలో దిగుబడినిచ్చింది. తోతాపురి మామిడి నుంచి పల్ప్ జ్యూస్‌ను తయారుచేసి దేశ, విదేశాలకు ఎగుమతి చేస్తారు. చేతికొచ్చిన పంటను అమ్ముకోవడానికి ఫ్యాక్టరీల బయట రోజుల తరబడి ఎదురుచూస్తున్నారు. రెండు రోజుల క్రితం కిలోకు రూ.6 చెల్లించాలని కలెక్టర్ ఆదేశించినా పట్టించుకునే దిక్కులేదు. ఫ్యాక్టరీల దగ్గర టోకెన్ సిస్టంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. టోకెన్ల కోసం రైతులు గంటల తరబడి క్యూలో నిల్చోవడం, తోపులాటలు, పోలీసులు-ఫ్యాక్టరీ నిర్వాహకులతో వాగ్వాదాలు.. ఇవన్నీ ఓ మినీ యుద్ధాన్ని తలపిస్తున్నాయి. ఉమ్మడి జిల్లాలో 47 గుజ్జు పరిశ్రమలు ఉంటే ఇప్పటి వరకు 30 వరకు ఫ్యాక్టరీలు మాత్రమే తెరుచుకున్నాయి. ఇంకో పదిరోజుల్లో మామిడిపంట ముగుస్తున్న నేపథ్యంలో పూర్తిస్థాయిలో ఫ్యాక్టరీలు తెరిపించి.. గిట్టుబాటు ధర, అలాగే టోకెన్ సిస్టం లేకుండా కొనాలని మామిడి రైతులు డిమాండ్ చేస్తున్నారు.



# ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య : లోకేష్

**టీపీఎన్, ఉండవల్లి :**

ప్రభుత్వ విద్య బలోపేతం కోసం ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు మంత్రి నారా లోకేష్. కర్నూలు జిల్లా, పత్తికొండ మండలం, జేఎం తండాలోని ప్రభుత్వ ఏకోపాధ్యాయ ప్రాథమిక పాఠశాలలో అద్భుత ఫలితాలు సాధించడానికి కృషి చేస్తున్న ఉపాధ్యాయురాలు ఎం.కల్యాణి కుమారిని షైనింగ్ టీచర్ పేరుతో మంత్రి లోకేష్ ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ.. విద్యాశాఖలో మొదటి ఏడాది సంస్కరణలు పూర్తయ్యాయని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలనే ఏకైక లక్ష్యంతో పని చేస్తున్నామన్నారు. ఇకపై విద్యార్థులు మంచి ఫలితాలు సాధించే విధంగా దృష్టి పెడతామన్నారు. పట్టుదలతో స్కూల్‌ను అద్భుతంగా తీర్చిదిద్దారని ఉపాధ్యాయురాలిని అభినందించారు. సింగిల్ టీచర్‌గా ఉండి పెద్ద సంఖ్యలో అడ్మిషన్లు తీసుకురావడం చరిత్ర అని ప్రశంసించారు. ప్రస్తుతం రాష్ట్రంలో 9,600 పాఠశాలలకు తరగతికో ఉపాధ్యాయుడు ఉన్నారన్నారు. డిజిటల్ విద్యకు ప్రాధాన్యత ఇస్తామని చెప్పారు. ఇప్పటికే మెగా పీటీఎం నిర్వహణతో పాటు మధ్యాహ్న భోజనంలో సన్న బియ్యం అందిస్తున్నామని తెలిపారు. ప్రైవేటు పాఠశాలల కంటే ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య లభిస్తుందన్నారు. ఇక్కడే క్వాలిఫైడ్ టీచర్లు ఉంటారన్నారు. వర్క్ బుక్స్, రాజ్యాంగంపై విద్యార్థులకు చిన్న వయసులోనే అవగాహన కలిగించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకం కలిగేలా సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రులు దృష్టి సారిస్తున్నారని చెప్పారు. డీఎస్సీపై 30 కేసులు వేశారని, అన్నింటినీ దాటుకుని ముందుకు వెళ్తున్నామని తెలిపారు. సమాజంలోనూ మార్పు రావాలని, విద్య ద్వారానే ఉన్నత స్థాయికి వెళ్తామని పేర్కొన్నారు. అనంతరం ప్రభుత్వ పాఠశాలల బలోపేతం కోసం చేపట్టాల్సిన చర్యలపై ఉపాధ్యాయురాలి నుంచి సలహాలు, సూచనలు తీసుకున్నారు. వాటిని ఆచరణలో పెడతామని హామీ ఇచ్చారు.

# ఏపీలో లక్ష ఫామ్ పాండ్స్ నిర్మాణం పూర్తి!

**మొదటిపేజీ తరువాయి**

పవన్ అన్నారు. వ్యవసాయ కుంటల అవసరాన్ని గుర్తించి, తమ పొలాల్లో వీటిని నిర్మించుకోవడానికి ముందుకు వచ్చిన రైతులందరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అలాగే, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రధాన కార్యదర్శి నుంచి క్షేత్రస్థాయి సిబ్బంది వరకు, ఉపాధి హామీ కూలీలకు ఆయన పేరుపేరునా అభినందనలు తెలియజేశారు.

**కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయం**

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద రాష్ట్రంలో పెద్ద ఎత్తున అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు కేంద్ర ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం లభిస్తోందని పవన్ వివరించారు. ఈ సందర్భంగా ఆయన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే, రాష్ట్ర ప్రభుత్వం తరఫున అన్ని విధాలుగా సహకరిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ధన్యవాదాలు తెలియజేశారు.



# జైలు నుంచి వంశీ విడుదల.. పేర్ని నాని ఘాటు వ్యాఖ్యలు

- విజయవాడ సబ్ జైలు నుంచి వల్లభనేని వంశీ విడుదల
- ఇళ్ల పట్టాల కేసులో బెయిల్ మంజూరు చేసిన నూజివీడు కోర్టు
- 140 రోజుల తర్వాత జైలు నుంచి విడుదల

**టీపీఎన్, విజయవాడ :**



సుమారు 140 రోజుల తర్వాత గన్నవరం మాజీ ఎమ్మెల్యే, వైసీపీ నేత వల్లభనేని వంశీ జైలు నుంచి విడుదలయ్యారు. ఇళ్ల పట్టాల కేసులో నూజివీడు కోర్టు ఆయనకు బెయిల్ మంజూరు చేసింది. దీంతో ఆయన విజయవాడ సబ్ జైలు నుంచి బయటకు వచ్చారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక వల్లభనేని వంశీపై మొత్తం 11 కేసులు నమోదయ్యాయి. ఈ కేసుల నేపథ్యంలోనే ఫిబ్రవరి 16న ఏపీ పోలీసులు ఆయన్ను హైదరాబాద్‌లో అరెస్టు చేసి జైలుకు తరలించారు. అప్పటి నుంచి జ్యుడిషియల్ రిమాండ్‌లో ఉన్న వంశీ, తన అరెస్టుపై న్యాయపోరాటం చేస్తూ వచ్చారు. తాజాగా ఇళ్ల పట్టాల కేసులో ఆయన పెట్టుకున్న బెయిల్ పిటిషన్‌పై విచారణ జరిపిన నూజివీడు కోర్టు, షరతులతో కూడిన బెయిల్‌ను మంజూరు చేసింది. ఆయన విడుదలకు మార్గం సుగమమైంది. వంశీ విడుదల సందర్భంగా విజయవాడ జైలు వద్ద సందడి వాతావరణం నెలకొంది. ఆయనకు స్వాగతం పలికేందుకు ఆయన భార్య పంకజ శ్రీతో పాటు వైసీపీ ముఖ్య నేతలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. కృష్ణా జిల్లా వైసీపీ అధ్యక్షుడు, మాజీ మంత్రి పేర్ని నాని, ఎమ్మెల్సీ తలశిల రఘురాం, మాజీ ఎమ్మెల్యేలు సింహాద్రి రమేష్, కైలే అనిల్, పెనమలూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ దేవభక్తుని చక్రవర్తి తదితరులు ఆయనకు స్వాగతం పలికేందుకు జైలు దగ్గరకు వచ్చారు. పార్టీ కార్యకర్తలు, అభిమానులు కూడా భారీగా చేరుకుని ఆయనకు మద్దతుగా నినాదాలు చేశారు.

**వంశీ అరెస్ట్‌తో సునాకానంద పొందారు**

వల్లభనేని వంశీ జైలు నుంచి విడుదలైన సందర్భంగా మీడియాతో మాట్లాడారు మాజీ మంత్రి పేర్ని నాని. వంశీపై అక్రమ కేసులు పెట్టి, జైలులో ఉంచి సునకానందం పొందారు తప్ప ఏమీ సాధించలేదన్నారు పేర్ని నాని. ఎప్పుడో జరిగిన సంఘటనపై ఇప్పుడు కేసులు పెట్టడమేంటి..? అని ప్రశ్నించారు. ఒకే కేసులో బెయిల్ వస్తే.. మరో కేసు పెడుతూ కుట్రలు చేశారని మండిపడ్డారు. లొసుగులు వాడుకుంటూ వాయిదాల మీద వాయిదాలు అడుగుతూ ఎత్తుగడలు వేశారన్నారు. చివరకు ఇవాళ కూడా సుప్రీం కోర్టులో వంశీ బెయిల్‌ను రద్దు చేయించే ప్రయత్నం చేశారన్నారు. కూటమి నాయకులు అణచివేత ధోరణిని వ్యవహరించారని మండిపడ్డారు. వంశీని రాజకీయాల నుంచి పారిపోయేలా చేశారా?.. గన్నవరం ప్రజల నుంచి దూరం చేయగలిగారా?. పైగా ఎన్నికలు జరిగి ఏడాది పూర్తి కాకుండానే ప్రజల్లో సానుభూతిని మూటగట్టి పెట్టారన్నారు. వంశీని జైలులో పెట్టడం ద్వారా గన్నవరం నియోజకవర్గంలో ఆయనకు సానుభూతి పెరిగిందని చెప్పారు. మీ పార్టీకి మీరే గొయ్యి తవ్వుకున్నారని విమర్శించారు. చేతబడి చేసుకున్నారని ఆరోపించారు. వల్లభనేని అరెస్ట్ వెనుక నాలుగేళ్ల తర్వాత ప్రజలు అన్ని తెలుసుకుంటారని తెలిపారు. అక్రమ కేసులు, వేధింపులు, నిర్బంధాలతో వంశీ ఆరోగ్యాన్ని దెబ్బతీశారని ఫైర్ అయ్యారు పేర్ని నాని.



## సత్యసాయి జిల్లాలో సుపరిపాలన తొలి అడుగు

**టీపీఎన్, సత్య సాయి జిల్లా :**

సత్యసాయి జిల్లా, కదిరి రూరల్ మండలంలోని కుమ్మరవాండ్లపల్లిలో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కందికుంట వెంకట ప్రసాద్ ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వం ఏడాది కాలంలో చేసిన అభివృద్ధిని, చేయబోతున్న మంచి పనులు ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెంకట ప్రసాద్ మాట్లాడుతూ కదిరి నియోజకవర్గాన్ని అన్ని విధాల అభివృద్ధి చేయడానికి ప్రయత్నిస్తున్నామన్నారు. ఇది గిట్టనివారు బురదజల్లుతున్నారని మండిపడ్డారు. గత ప్రభుత్వంలో అవినీతి జరిగిందన్నారు. అందుకే కొందరి వైసీపీ నాయకుల ఇళ్లలో సీబీఐ అధికారులు దాడులు చేస్తున్నారని తెలిపారు. వైసీపీ అవినీతిపై ప్రజలు చర్చించుకుంటున్నారని చెప్పారు. అనంతరం గ్రామస్తులు పలు సమస్యలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. సమస్యలను పరిష్కరిస్తామని వెంకట ప్రసాద్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.



## మెప్మాలో డిజిటల్ విధానానికి శ్రీకారం : మంత్రి దుర్గేష్

**టీపీఎన్, నిడదవోలు :**

మెప్మాలో పౌర సేవలు సత్వరం అందించేందుకు డిజిటల్ విధానానికి శ్రీకారం చుట్టామన్నారు మంత్రి కందుల దుర్గేష్. నిడదవోలు పురపాలక సంఘంలో పని చేస్తున్న మెప్మా రిసోర్స్ పర్సన్లకు బుధవారం మంత్రి దుర్గేష్ ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాంకేతికతను అందిపుచ్చుకోవాలని ఆర్పీలకు సూచనలు చేశారు. రిసోర్స్ పర్సన్స్‌కు పని భారం, సమయాభావం తగ్గించాలనే ఉద్దేశంతో ట్యాబ్‌లు అందజేస్తున్నామన్నారు. ప్రతి ఒక్క రిసోర్స్ పర్సన్ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మెప్మా, డ్వాక్రాలు సీఎం చంద్రబాబు మానస పుత్రికలు అని పేర్కొన్నారు. డిజిటల్ విధానంతో మెప్మాలో సేవలు మరింత పారదర్శకంగా అందుతాయని తెలిపారు. పౌరులకు తమకు కావాల్సిన మున్సిపల్, ఇతర సేవలను త్వరితగతిన అందించేందుకు కూటమి ప్రభుత్వం వాట్సాప్ గవర్నెన్స్ తీసుకొచ్చిందన్నారు. త్వరలోనే ఏఐ, క్వాంటమ్ టెక్నాలజీ తీసుకొస్తున్నామని చెప్పారు. మహిళల సంక్షేమానికి, సాధికారతకు కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు.



## కావలిలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన!

**టీపీఎన్, కావలి:**

కూటమి ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధితో పాటు సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తోందని మంత్రులు నారాయణ, రామానాయుడు తెలిపారు. కావలి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కట్టుబడి ఉన్నామని ప్రజలకు హామీ ఇచ్చారు. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలోని కావలి పట్టణంలో బుధవారం మంత్రులు పొంగూరు నారాయణ మరియు నిమ్మలగడ్డ రామానాయుడు పర్యటించారు. పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. స్థానిక పుల్లారెడ్డినగర్‌లో ఆధునీకరించిన పార్కును ప్రారంభించారు. ఐకాన్ సెంటర్: మెప్మా స్టాల్‌ను సందర్శించారు. ఇందిరమ్మ కాలనీలో కోటీ 60 లక్షల రూపాయలతో నిర్మించిన సీసీ రోడ్లను ఆవిష్కరించారు. వెంగళారావునగర్‌లో షాదీమంజిల్‌ను ప్రారంభించి, అక్కడ జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. రైతు బజార్‌లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం మాగుంట రోడ్డు దగ్గర వంగవీటి మోహనరంగా కాంస్య విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమంలో మంత్రులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే కృష్ణారెడ్డి, తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, పట్టణ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## తునిలో సబ్ జైలును ప్రారంభించిన మంత్రి అనిత

**టీపీఎన్, తుని :**

తుని పట్టణంలో పునర్నిర్మాణం చేసిన సబ్ జైలును హోంమంత్రి వంగలపూడి అనిత ప్రారంభించారు. అదే విధంగా నూతనంగా ఏర్పాటు చేసిన పెట్రోల్ బంక్‌ను కూడా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే యనమల దివ్య, ఏపీ జైల్స్ అండ్ కరెక్షన్స్ సేవల డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ అంజనీకుమార్, ఎస్పీ బిందుమాధవ్, జిల్లా పోలీస్ అధికారులు పాల్గొన్నారు.



## తాటిపూడి నీటిని మళ్లించే ఆలోచన లేదు!

**టీపీఎన్, విజయనగరం :**

రైతుల అభివృద్ధికి, సంక్షేమానికి తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని రాష్ట్ర ఎంఎస్ఎంఈ, సెర్ప్, ఎన్నారై వ్యవహారాల శాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. గంట్యాడ మండలంలోని బుచ్చి అప్పారావు తాటిపూడి జలాశయం నుంచి సాగునీటిని మంత్రి శ్రీనివాస్ బుధవారం ఉదయం విడుదల చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. తాటిపూడి నీటిని విశాఖపట్నం తాగునీటి అవసరాలకు, ఆయకట్టు రైతులకు మాత్రమే వినియోగిస్తామని, దారిమళ్లించే ఆలోచన లేదని ఆయన స్పష్టం చేశారు. గతేడాది ముందుగానే వర్షాలు కురవడంతో, పంటలు బాగా పండాయని, రైతులు సంతృప్తిగా ఉన్నారని చెప్పారు. ఈ ఏడాది కూడా అదే అనుకూల పరిస్థితి నెలకొంటుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. మన పూర్వీకులు ఎంతో కష్టపడి చెరువులను తవ్వించి, తాటిపూడి జలాశయానికి అనుసంధానం చేశారని, దానివల్ల పంటలు బాగా పండేవని చెప్పారు. ప్రస్తుతం ఎక్కడైనా నీటికి ఇబ్బంది ఏర్పడినా, చెరువులు దెబ్బతిన్నా, వాటిని పునరుద్ధరించేందుకు ప్రతిపాదనలు చేస్తే, మరమ్మతులు చేయిస్తామని హామీ ఇచ్చారు. వ్యవసాయానికి ప్రయోజనం కల్గించే వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. మంచి పంటలను పండించి సమాజానికి అందించాలని కోరారు. ఎంఎస్ఎంఈ పార్కుకు నీటి సరఫరాకు సంబంధించి గత ప్రభుత్వ హయాంలోనే జీవో వచ్చిందని, అయినప్పటికీ కొంతమంది రాజకీయ లబ్ధికోసం తప్పుడు ప్రచారం చేస్తున్నారని మంత్రి అన్నారు.

## సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమానికి మంచి స్పందన!

**టీపీఎన్, నూజివీడు :**



సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో నూజివీడు మండలం సీతారామపురం గ్రామంలో మంత్రి కొలుసు పార్థసారథి పాల్గొని ఇంటింటి గృహ సందర్శన చేసి ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. వారి సమస్యలను తెలుసుకొని సంబంధిత అధికారులకు పరిష్కారానికి ఆదేశాలు ఇచ్చిన మంత్రి ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం ఎంతో బాధ్యతతో ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తున్నదని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వము ఏర్పడి సంవత్సరం పూర్తయిన సందర్భంగా "సుపరిపాలనలో తొలి అడుగు" కార్యక్రమంలో భాగంగా ప్రజా ప్రతినిధులు, అధికారులతో కలిసి రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి బుధవారం నూజివీడు నియోజకవర్గం నూజివీడు మండలం సీతారామపురం గ్రామంలో పాల్గొని ఇంటింటినీ సందర్శించి వారితో ఆప్యాయంగా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న పలు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు వివరించి వారికి ప్రభుత్వం నుండి అందుతున్న లబ్ది వివరాలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలోని పలువురు ప్రజలు కూటమి ప్రభుత్వం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నారని, ఇది బాధ్యత కలిగిన మంచి ప్రభుత్వం అని మంత్రికి తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి కొలుసు పార్థసారథి మాట్లాడుతూ.. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం పూర్తయిన సందర్భంగా సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమానికి ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తోందని తెలిపారు. సుపరిపాలన తొలి అడుగు పేరుతో ప్రతి పల్లెలోనూ కూడా రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించి ఎమ్మెల్యేలు, మంత్రులు ప్రతి పల్లెల్లో తిరుగుతుంటే అద్భుతమైన స్పందన ప్రజల నుండి వస్తోందని ఎక్కడికి వెళ్లినా కూడా ప్రజలు ఇది మా ప్రభుత్వం సుపరిపాలన అందించే మంచి ప్రభుత్వము వారి ఆశలు, ఆకాంక్షలు తీర్చే ప్రభుత్వమని ప్రజలు సంతోషంగా చెప్పుతున్నారని తెలిపారు. గతంలో అరాచక పాలన ప్రభుత్వం ఉన్నదని, ప్రజలను అనేక విధాలుగా భయభ్రాంతులను గురి చేశారని తెలిపారు. సంక్షేమం అంటే అన్ని పథకాలు ఆపేసి నాలుగు పథకాలు అమలు చేయడం కాదు, సంక్షేమం ఇస్తూ అన్ని పథకాలు అమలు చేయడం నాయకుని లక్ష్యమని, రూ .3 వేలు ఇస్తున్న పెన్షన్ పెద్ద ఎత్తున రూ.4 వేలకు పెంచి పెన్షన్ ఇవ్వడం జరుగుతోందన్నారు. గత ప్రభుత్వం 45 లక్షల మందికి అమ్మఒడి వేస్తే ప్రస్తుత కూటమి ప్రభుత్వం తల్లికి వందనం పేరుతో 67 లక్షల మంది పిల్లలకు రూ.10 వేల కోట్లు ఇవ్వడం జరిగింది. దీపం పథకం, అన్నా క్యాంటీన్లు ప్రారంభించామన్నారు. తాము బాధ్యతతో ప్రజల కోసం పని చేస్తున్నామనీ, ఇంకా చేయలసింది ఎంతో ఉందన్నారు. సీతారామపురం గ్రామానికి సుపారిపాలతో తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొనటానికి చేరుకున్న మంత్రికి గ్రామస్థులు ఘన స్వాగతం పలికారు. మంత్రి ఇంటికి ఇంటికి వెళ్లి కూటమి ప్రభుత్వము అందజేసే సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయా అని, ఇంకా ఏమైనా సమస్యలు ఉన్నాయా అని ప్రజలను అడిగి తెలుసుకొని, వారు చెప్పే సమస్యలు వింటూ వారు అందజేసిన సమస్యల అర్జీలను తీసుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.



## "సుపరిపాలనలో తొలి అడుగు" కార్యక్రమంలో మంత్రి పయ్యావుల

**టీపీఎన్, అనంతపురం :**

ఉరవకొండ నియోజకవర్గం, కూడేరు మండలంలోని జయపురం గ్రామంలో "సుపరిపాలనలో తొలి అడుగు" కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి పయ్యావుల కేశవ్‌కు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. అనంతరం మంత్రి పయ్యావుల గ్రామంలోని ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న పలు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు గురించి ప్రజలకు వివరించారు. అంతేకాకుండా కుటుంబంలో ప్రభుత్వం తరుపున లబ్ధి పొందిన వారి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రమాదేవి, ప్రజా ప్రతినిధులు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

## భారత ఆధ్యాత్మిక విలువల్ని కాపాడాలి!

**టీపీఎన్, విజయవాడ :**



తిరుమల తిరుపతి దేవస్థానాన్ని అంతర్జాతీయ ఆధ్యాత్మిక కేంద్రంగా గుర్తించాలని, భారతీయ అత్యుత్తమ విలువలను ఇప్పటికీ కూడా ప్రపంచంలో 80 శాతం ప్రజలు తెలుసుకో లేకపోతున్నారని శ్రీనివాసనంద సరస్వతీ స్వామీజీ అన్నారు. విజయవాడలోని ఐలాపురం హోటల్లో జాతీయ హిందూ ధార్మిక సదస్సు కార్యక్రమాన్ని ఆయన అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆంధ్రప్రదేశ్ బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్రీనివాసనంద సరస్వతీ స్వామీజీ, పీవీఎన్ మాధవ్ మాట్లాడుతూ.. ప్రధాని మోదీ నాయకత్వంలో ఇటీవల నిర్వహించిన యోగాంధ్ర కార్యక్రమం ద్వారా భారతీయ ఆధ్యాత్మిక విలువలను ప్రపంచానికి చాటి చెప్పిందన్నారు. భారతదేశం విశ్వగురు అయ్యే రోజు దగ్గరలోనే ఉందని అభిప్రాయపడ్డారు. ఈ సదస్సులో సాధు పరిషత్ గౌరవాధ్యక్షులు అట్లూరి నారాయణరావు పలు తీర్మానాలు ప్రవేశపెట్టారు. "దేవాలయాలపై ఇచ్చిన వివాదాస్పద జీవోను వెంటనే రద్దు చేయాలి. దేవాలయాల ట్రస్ట్ బోర్డులలో ధార్మికులను మాత్రమే నియమించాలి. తిరుపతిని ఆధ్యాత్మిక నగరంగా ప్రకటించి, మద్యం, మాంసం రహితంగా చేయాలి. హిందువుల పండుగలు, ఊరేగింపులకు ప్రభుత్వం రక్షణ కల్పించాలి. గోవుని జాతీయ జంతువుగా ప్రకటించాలి. అయోధ్య, కాశీయాత్రలకు వెళ్లే భక్తులకు ఆర్థిక సహాయం చేయాలి. ప్రతి ఆలయ అర్చకుడికి గౌరవ వేతనంగా రూ.10000 ఇవ్వాలి. దేవాలయ భూముల్లో గోశాలలు ప్రతి గ్రామంలో నిర్వహించాలి. బంజరు భూములు గోశాలలోని గోవుల గడ్డి పెంచేందుకే వాడాలి. టీటీడీ ఆధ్వర్యంలో ప్రతి జిల్లాలోనూ నూతన విద్యాలయాలు ఏర్పాటు చేయాలి. దేవాదాయ శాఖ ఆధ్వర్యంలోని ప్రతి దేవాలయము యొక్క ఆదాయ వ్యయాలు, ఆభరణల వివరాలు, భూములు, ఆస్తులు వివరాలు ఆన్‌లైన్‌లో ఉంచాలి. ఆశ్రమాల నిర్వహణకు నిధులు కేటాయించాలి. రిజర్వేషన్ల ఆధారంగా ఉద్యోగాలు పొంది మతం మారిన వారిని ఉద్యోగాల నుంచి తొలగించాలి. 60 సంవత్సరాలు దాటిన ధార్మిక వానప్రస్థ గురువులకు వేతనాలు ఇవ్వాలి. టీటీడీ స్వయంగా గోశాల నిర్వహించి ఆ గోవుల నెయ్యిని లడ్డు తయారీకి ఉపయోగించాలి". ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ సాధు పరిషత్ అధికార ప్రతినిధి తురగా శ్రీరాం, ప్రముఖ గాయకులు గజల్ శ్రీనివాస్, విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర అధ్యక్షులు వెంకటేశ్వర్లు, రవి, 300 మంది సాధువులు పాల్గొన్నారు.



## బనకచర్లపై హరీశ్ రావుది రాజకీయ డ్రామా : మంత్రి పయ్యావుల

- **బీఆర్ఎస్‌లో అంతర్గత పోరు నడుస్తోంది..!**
- **కేసీఆర్ ఇచ్చిన హామీకి ఆపార్టీ నేతలు విరుద్ధంగా మాట్లాడుతున్నారు..!**
- **మాజీ మంత్రి హరీశ్‌రావుపై ఏపీ మంత్రి పయ్యావుల తీవ్ర విమర్శలు**

**టీపీఎన్, అనంతపురం :**

ఉనికి కోసమే బనకచర్ల అంశాన్ని బీఆర్ఎస్ రాజకీయం చేస్తోందని ఏపీ ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ విమర్శించారు. కేటీఆర్, హరీశ్ రావు మధ్య రాజకీయ అస్తిత్వ పోరు నడుస్తోందని విమర్శించారు. బనకచర్ల ప్రాజెక్టుపై బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు చేస్తున్న విమర్శల వెనుక రాజకీయ కారణాలు ఉన్నాయని పయ్యావుల అన్నారు. బీఆర్ఎస్‌లో నెలకొన్న అంతర్గత పోరుతో హరీశ్ రావు తన ఉనికిని కాపాడుకునేందుకు బనకచర్ల ప్రాజెక్టును రాజకీయం చేస్తున్నారని.. అందుకే ప్రాజెక్టును తెరపైకి తీసుకువస్తున్నారని మండిపడ్డారు. ఈమేరకు అనంతపురంలో మీడియాతో మాట్లాడారు పయ్యావుల కేశవ్. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బనకచర్ల అంశంపై ఎక్కడా మాట్లాడటం లేదని ఇదంతా ఓ డ్రామా అని కొట్టిపారేశారు. హరీశ్‌రావు ట్రాప్ లో పడి మిగతా వాళ్లు మాట్లాడుతున్నారని ఆరోపించారు. బనకచర్ల ప్రాజెక్టుతో తెలంగాణకు ఎలాంటి నష్టం లేదని సముద్రంలో కలిసే నీళ్లను మాత్రమే వాడుకుంటున్నామని వారికి తెలిసీ కూడా బనకచర్లపై రాజకీయం చేయడం సరికాదన్నారు పయ్యావుల. బనకచర్ల ప్రాజెక్టు వల్ల తెలంగాణ రాష్ట్రానికి ఎలాంటి నష్టమూ వాటిల్లదని మంత్రి పయ్యావుల కేశవ్ హామీ ఇచ్చారు. కిందకు వృథాగా పోయే నీటిని మాత్రమే వాడుకుంటున్నామని స్పష్టం చేశారు. దీనివల్ల ఎగువ రాష్ట్రాలకు ఏమాత్రం ఇబ్బంది ఉండదన్నారు. రాయలసీమకు గోదావరి జలాలు రావాలని గతంలో తిరుపతికి వచ్చినప్పుడు కేసీఆర్ అనలేదా అని ఆయన సూటిగా ప్రశ్నించారు. ఇప్పుడు ఆయన పార్టీ నేతలే అందుకు విరుద్ధంగా మాట్లాడటం వారి ద్వంద్వ వైఖరికి నిదర్శనమని పయ్యావుల విమర్శించారు. అనవసర వివాదాలు సృష్టించి రెండు రాష్ట్రాల మధ్య అపోహలు పెంచవద్దని ఆయన హితవు పలికారు మంత్రి పయ్యావుల




## వైసీపీ నాయకులు రాష్ట్రాన్ని దోచుకున్నారు : కేశినేని చిన్ని

**టీపీఎన్, విజయవాడ :**

గత ప్రభుత్వ హయంలో రాష్ట్ర ప్రజలు సంక్షేమానికి, అభివృద్ధికి దూరంగా ఉన్నారన్నారు ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని). వించిపేటలోని 50, 55వ డివిజన్లలో బుధవారం "సుపరిపాలనలో తొలి అడుగు" కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కూటమి నాయకులు ఇంటింటికి వెళ్లి ఏడాది కాలంలో ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. అదే విధంగా వారికి అందుతున్న సంక్షేమ పథకాల గురించి ప్రజల అభిప్రాయాలు అడిగి తెలుసుకున్నారు. డివిజన్లలోని పలు సమస్యలను చిన్ని దృష్టికి తీసుకురాగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం కేశినేని చిన్ని మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలో రాగానే సీఎం చంద్రబాబు నాయుడు సంక్షేమం, అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టారని తెలిపారు. రాష్ట్రం లోటు బడ్జెట్‌లో ఉన్నా సంక్షేమం, అభివృద్ధిని ప్రజలకు చేరువ చేయాలనే లక్ష్యంతో అడుగులు వేస్తున్నామన్నారు. ప్రతి నెల ఒకటో తేదీనే అర్హులందరికీ నాలుగు వేల రూపాయల పింఛన్‌ను అందజేస్తున్నామన్నారు. అంతేకాకుండా సూపర్ సిక్స్ పథకాలను జెట్ స్పీడ్‌లో అమలు చేస్తున్నామని తెలిపారు. ప్రతి పక్షంలో ఉన్నప్పుడు ప్రజా సమస్యలపై పోరాడామని, అధికారంలోకి వచ్చాక ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిత్యం ప్రజల్లోనే ఉంటున్నామని చెప్పారు. ఆగస్టు 15వ తేదీ నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలు చేయబోతున్నామని తెలిపారు. వైసీపీ నాయకులు చెప్పే దానికి చేసే దానికి పొంతన ఉండదన్నారు. వైసీపీ పాలనలో ప్రజలను పీడించి, రాష్ట్రాన్ని దోచుకు తిన్నారని విమర్శించారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు ప్రతిపక్షంలో ఉన్నా, అధికారంలో ఉన్నా ప్రజా సమస్యల పరిష్కారానికి, రాష్ట్రాభివృద్ధికి కృషి చేస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బుద్ధా వెంకన్న, రాష్ట్ర టీడీపీ అధికార ప్రతినిధి నాగుల్ మీరా, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర యాదవ్, మాజీ ఎమ్మెల్సీ మంతెన వెంకట సత్యనారాయణ రాజు పాల్గొన్నారు.



## ఇంతేరు గ్రామంలో పర్యటించిన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్..!

**టీపీఎన్, పెడన :**

పెడన నియోజకవర్గంలో కూటమి ప్రభుత్వం చేపట్టిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం బుధవారం ప్రారంభమైంది. ఇందులో భాగంగా శాసనసభ్యులు కాగిత కృష్ణప్రసాద్ కృత్తివెన్ను మండలం ఇంతేరు గ్రామాన్ని సందర్శించారు. పర్యటన సందర్భంగా గ్రామంలోని ప్రతి గృహాన్ని ప్రత్యక్షంగా సందర్శించిన ఎమ్మెల్యే కాగిత, ప్రజలతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరోగ్యశ్రీ, పింఛన్లు, రేషన్, గృహ నిర్మాణాలు, విద్య, సాగునీటి వంటి పథకాలపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "గ్రామంలోని ప్రతి సమస్యను గుర్తించి వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటాం" అని హామీ ఇచ్చారు. గ్రామస్తులు అభివృద్ధి పథంలో తమ ఊరు ముందడుగు వేయాలన్న ఆశతో ఎమ్మెల్యేకు తమ సమస్యలను వివరించారు. ఈ కార్యక్రమంలో పలువురు తహసిల్దార్, ఎంపీడీవో, స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.



## అమరావతి పనుల పురోగతిపై సంతృప్తి!

**టీపీఎన్, అమరావతి :**

ప్రపంచ బ్యాంక్, ఆసియా అభివృద్ధి బ్యాంక్ బృందం(WB/ADB) విజయవాడలోని ఏపీ సిఆర్డిఏ కార్యాలయంలో వరుసగా 3వ రోజు అధికారులతో సమావేశమైంది. ఏపీ సీఆర్డిఏ కమిషనర్ కె.కన్నబాబు ఐఏఎస్, అడిషనల్ కమిషనర్లు జి.సూర్యసాయి ప్రవీణ్ చంద్ ఐఏఎస్, మల్లారపు నవీన్ ఐఏఎస్‌లు "అర్బన్ గవర్నెన్స్" అంశంపై వర్క్ షాప్ నిర్వహించారు. వివిధ దేశాలలో "అర్బన్ గవర్నెన్స్" ప్రక్రియలో అమలవుతున్న అత్యుత్తమ విధానాల గురించి, ఆయా ప్రాంతాలలో పర్యావరణ పరిరక్షణకు పాటిస్తున్న చర్యల గురించి WB/ADB బృంద సభ్యులు CRDA, ADCL అధికారులతో చర్చించారు. అమరావతి నిర్మాణంలో ఆయా ప్రాజెక్టుల పురోగతి గురించి WB/ADB బృందానికి అడిషనల్ కమిషనర్లు జి.సూర్యసాయి ప్రవీణ్ చంద్ ఐఏఎస్, మల్లారపు నవీన్ ఐఏఎస్, ఇతర ముఖ్య అధికారులు వివరించారు. అలాగే రాజధానిలో ల్యాండ్ మోనిటైజేషన్ అంశాల గురించి వర్క్ షాప్‌లో భాగంగా చర్చించారు. రాజధాని అమరావతి నిర్మాణంలో ముఖ్యంశాలతో పాటు ఆర్థికాభివృద్ధి, రవాణా సదుపాయాల కల్పన, హౌసింగ్ ప్రాజెక్టులు, ప్రైవేట్ సెక్టార్ భాగస్వామ్యం, పౌరసేవల కల్పన తదితర అంశాలలో ఏపీ సిఆర్డిఏ ప్రాతినిధ్యం, అలాగే విపత్తు నివారణ కార్యకలాపాలు, సమగ్ర సదుపాయాలతో కూడిన రాజధాని నగర నిర్మాణం గురించి అడిషనల్ కమిషనర్లు జి.సూర్యసాయి ప్రవీణ్ చంద్ ఐఏఎస్, మల్లారపు నవీన్ ఐఏఎస్‌లు WB/ADB బృందానికి వివరించారు. WB/ADB బృంద సభ్యులు ఆయా ప్రాజెక్టులకు సంబంధించి అడిగిన పలు ప్రశ్నలకు సంతృప్తికర రీతిలో సమాధానాలు ఇచ్చారు. వర్క్ షాప్‌లో అమరావతి డెవలప్మెంట్ కార్పొరేషన్(ADCL) CMD శ్రీమతి లక్ష్మి పార్థసారథి, సిఆర్డిఏ, ఏడీసీఎల్‌లోని వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

WB/ADB బృంద సభ్యుల మూడు రోజుల అమరావతి పర్యటన ముగియడంతో బృందంలోని సభ్యులు రాజధాని పనుల పురోగతిపై చర్చించారు. రాజధానిలో నిర్మిస్తున్న భవనాల పనులలో పురోగతి, రాజధాని ప్రాంత నివాసితులకు అమలవుతున్న సామాజిక సంక్షేమ కార్యక్రమాలు, పర్యావరణ పరిరక్షణ, విపత్తు నిర్వహణకై చేపట్టిన కార్యకలాపాలు, కార్మికులు, మహిళల భద్రతకై అమలవుతున్న చర్యల పట్ల పూర్తి స్థాయిలో సంతృప్తి వ్యక్తం చేశారు.



## నిడదవోలులో మంత్రి కందుల దుర్గేష్ పర్యటన

**నిడదవోలు:**

పెరవలి మండలంలోని కానూరు గ్రామంలో మంత్రి కందుల దుర్గేష్ పర్యటించారు. ఈ సందర్భంగా నిడదవోలు నరసాపురం ప్రధాన రహదారిపై జరుగుతున్న కల్వర్టు పనులను స్వయంగా పరిశీలించారు. స్థానిక ప్రజలను అడిగి సమస్యలు తెలుసుకున్నారు. కల్వర్టు పనుల పురోగతిపై ఆరా తీశారు. ప్రయాణికులు, వాహనదారుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని త్వరితగతిన పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కొండాలమ్మ దేవాలయం సమీపంలోని నడిపల్లి నుండి నడిపల్లికోట వెళ్లే రోడ్డు అధ్వాన్న దశకు చేరడంతో తక్షణ చర్యలు చేపట్టాలన్నారు. పనులు శరవేగంగా పూర్తి చేస్తామని, మరికొన్ని రోజులు సహకరించాలని స్థానికులను కోరారు మంత్రి దుర్గేష్. రహదారుల పనుల్లో నాణ్యత పాటించాలని పేర్కొన్నారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో కనీసం ఒక్క రోడ్డు కూడా వేయలేదని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అంతర్గత రహదారులతో పాటు, ప్రధాన రహదారులను అభివృద్ధి చేసి చూపించామన్నారు. ఇటువంటి ప్రభుత్వానికి ప్రజలు మద్దతుగా ఉండాలని ప్రజలను కోరారు.

## బీజేపీలో కొత్త జోష్.. ప్రముఖ న్యాయవాదుల చేరికతో ఉత్సాహం!

- **బలమైన నాయకత్వమే బీజేపీ విజయ రహస్యం.**
- **రాష్ట్రానికి ఆదర్శంగా ధర్మవరం అభివృద్ధి**
- **ప్రముఖులు బీజేపీ వైపు మొగ్గుతుంటే, అది విశ్వాసానికి నిదర్శనం**
- **సత్యకుమార్ గారి చొరవ.. ధర్మవరం అభివృద్ధి వరాలు**

**టీపీఎన్, ధర్మవరం :**

పట్టణం 9వ వార్డుకు చెందిన ప్రముఖ న్యాయవాదులు రామానాయుడు, రంజిత్ బుధవారం వారి అనుచర వర్గంతో కలిసి భారతీయ జనతా పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ధర్మవరం మంత్రి నియోజకవర్గ ఇంచార్జ్ హరీష్ బాబు పార్టీ కండువా కప్పి వీరిని ఘనంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా హరీష్ బాబు మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ బలమైన నాయకత్వంలో ధర్మవరం నియోజకవర్గం వేగంగా అభివృద్ధి చెందుతోంది. ఇంత సమగ్ర అభివృద్ధిని చూచి ఆకర్షితులైన రామానాయుడు, రంజిత్ గార్లు బీజేపీలో చేరుతున్నట్లు తెలిపారు, ధర్మవరం పట్టణంలోని బీసీ విద్యార్థుల కోసం ప్రీమెట్రిక్ హాస్టల్‌ను మంత్రి సత్య కుమార్ చొరవతో మంజూరు చేయించారని, పట్టణానికి దూరంగా ఉన్న గ్రామాల విద్యార్థులకు ఇది ఎంతో ఉపయోగపడనుందని హరీష్ బాబు వివరించారు. అదేవిధంగా, బత్తలపల్లి మండలంలో వ్యవసాయరంగ అభివృద్ధికి కృషి విజ్ఞాన కేంద్రం (KVK) ఏర్పాటు కోసం భూముల పరిశీలన పూర్తయ్యిందని, రైతులకు శాస్త్రీయ పద్ధతులు అందించేందుకు ఇది ఎంతో ఉపయోగపడనుందని చెప్పారు. ధర్మవరం హస్తకళల అభివృద్ధికి దోహదపడే విధంగా, Infrastructure and Technology Support Scheme for Handicraft Sector కింద ముడి పదార్థాల డిపో ఏర్పాటుకు కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్ మే 13, 2025న అధికారికంగా ఉత్తరం రాశారని, దానిని సంబంధిత శాఖలకు చర్యలు తీసుకునేలా పంపినట్లు హరీష్ బాబు వెల్లడించారు. మంత్రి సత్య కుమార్ యాదవ్ ప్రోత్సహిస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు, పారదర్శక పాలన ప్రజల్లో విశ్వాసం పెంచుతున్నాయని, త్వరలో మరెంతో మంది నాయకులు, ప్రజా ప్రతినిధులు బీజేపీలో చేరబోతున్నారని హరీష్ బాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండలాల అధ్యక్షులు, బిజెపి సీనియర్ నాయకులు, మహిళా కార్యకర్తలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.





# సుపరిపాలనలో-తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి లోకేష్

- ఇంటింటికీ తిరిగి అభివృద్ధి, సంక్షేమాన్ని వివరించిన మంత్రి
- రీటైనింగ్ వాల్ నిర్మాణ పనులు త్వరితగతిన ప్రారంభానికి ఆదేశం
- పలు సమస్యలను మంత్రి లోకేష్ దృష్టికి తీసుకువచ్చిన స్థానికులు
- పరిష్కరించి అండగా ఉంటామని మంత్రి లోకేష్ భరోసా

**టీపీఎన్, తాడేపల్లి :**

కూటమి ప్రభుత్వ ఏడాది పాలనను పురస్కరించుకుని మంగళగిరి నియోజకవర్గం తాడేపల్లిలోని మహానాడు కాలనీలో నిర్వహించిన సుపరిపాలనలోతొలి అడుగు కార్యక్రమంలో విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పాల్గొన్నారు. ఇంటింటికీ తిరిగి కరపత్రాల ద్వారా కూటమి ప్రభుత్వం ఏడాది కాలంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. మంత్రి నారా లోకేష్ రాక నేపథ్యంలో ప్రజలు ఆయనకు ఘనస్వాగతం పలికారు. ప్రతి ఒక్కరిని ఆప్యాయంగా పలకరిస్తూ మంత్రి ముందుకు సాగారు. ఈ సందర్భంగా తాము ఎదుర్కొంటున్న పలు సమస్యలను స్థానికులు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ఆయా సమస్యల పరిష్కారానికి కృషిచేస్తామని హామీ ఇచ్చారు. రీటైనింగ్ వాల్ ప్రాంతాన్ని పరిశీలించిన మంత్రి.. నిర్మాణ పనులు త్వరితగతిన ప్రారంభానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అంతకుముందు సుపరిపాలనలోతొలి అడుగు కార్యక్రమంలో పాల్గొనేందుకు మహానాడు కాలనీ ఒకటవ రోడ్డుకు చేరుకున్న మంత్రి నారా లోకేష్ కు స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు ఘన స్వాగతం పలికారు.

**బీసీ సామాజికవర్గం వ్యక్తి ఇంటికి వెళ్లి ఆరా ..!**

కూటమి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై బీసీ సామాజికవర్గానికి చెందిన వెదుళ్ల మధుబాబు ఇంటికి వెళ్లిన మంత్రి నారా లోకేష్ ప్రభుత్వ పథకాలు అందుతున్న తీరుపై ఆరా తీశారు. కుటుంబ సభ్యుల యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పథకాలు అందాయా అని ప్రశ్నించారు. తమ దశాబ్దాల కల అయిన ఇంటి పట్టా అందించారని, రూపాయి ఖర్చు లేకుండా రిజిస్ట్రేషన్ చేసుకున్నామని ఈ సందర్భంగా మధుబాబు కుటుంబ సభ్యులు మంత్రి లోకేష్ కు ధన్యవాదాలు తెలిపారు. ఇంటి పట్టా కోసం తాము ఎక్కడికీ తిరగలేదని, బస్సులు పెట్టి మరీ తమను తీసుకెళ్లారని, భోజనంతో పాటు బట్టలు పెట్టి ఇంటి పట్టా అందించారని చెప్పారు. ఇంటర్ చదువుతున్న తమ కుమార్తెకు తల్లికి వందనం సాయం అందిందని, దీపం పథకం కింద గ్యాస్ సబ్సీడీ నగదు బ్యాక్ అకౌంట్ లో జమ అయిందన్నారు. తమకు చాలా ఆనందంగా ఉందన్నారు. కుమారుడు ఇంటర్ పూర్తిచేశాడని, త్వరలోనే ఇంజనీరింగ్ లో చేరుస్తామని తెలిపారు. పిల్లలు బాగా చదువుకోవాలని ఈ సందర్భంగా మంత్రి లోకేష్ వారికి చెప్పారు.

**1.ఇంటి పట్టాల గురించి గతంలో ఎవరూ పట్టించుకోలేదు**

" నా కుమారుడికి తల్లికి వందనం పథకం కింద సాయం అందింది. మేం నివసిస్తున్న ఇంటికి పట్టా ఇచ్చారు. ఇన్నేళ్లలో ఎప్పుడూ పట్టించుకోలేదు. గ్యాస్ సబ్సీడీ నగదు కూడా అందింది. మా నాన్న గారికి వృద్ధాప్య పెన్షన్ ఇస్తున్నారు. ఈ ప్రాంతంలో గంజాయి నియంత్రణకు చర్యలు తీసుకున్నారు. గతంలో కంటే గంజాయి వినియోగం బాగా తగ్గింది. రిటైనింగ్ వాల్ నిర్మిస్తామని మంత్రి లోకేష్ గారు హామీ ఇచ్చారు."

**యాపతి లక్ష్మి, మహానాడు కాలనీ, తాడేపల్లి**

**2.రిటైనింగ్ వాల్ నిర్మించాలి**

" ఇంటి పట్టా అందించి మా 40 ఏళ్ల కలను నెరవేర్చారు. మా పిల్లలకు తల్లికి వందనం కింద సాయం అందింది. వరదలు వచ్చినప్పుడు మునిగిపోకుండా రిటైనింగ్ వాల్ నిర్మిస్తామని మంత్రి లోకేష్ గారు హామీ ఇచ్చారు. మాకు చాలా ఆనందంగా ఉంది."

**షేక్ మెహబూబా, మహానాడు కాలనీ, తాడేపల్ల**

3. ఇంటికి పట్టా వచ్చింది, రిజిస్టర్ కూడా చేశారు

"నెలనెలా మొదటి తేదీనే ఇంటివద్దకు వచ్చి పెన్షన్ ను అందిస్తున్నారు. గత నెలలో రేషన్ కూడా ఇంటికే తెచ్చి ఇచ్చారు. ఇకపై నెలనెలా ఇంటికే తెచ్చి రేషన్ సరుకులు అందజేస్తామని డీలర్ చెప్పారు. గ్యాస్ సిలిండర్ డబ్బులు పడ్డాయి. మా ఇంటికి పట్టా ఇచ్చారు. చంద్రబాబు గారి పాలన బాగుంది. మళ్ళీ మళ్ళీ నారా లోకేష్ గారే ఎమ్మెల్యేగా గెలవాలని కోరుకుంటున్నాను."

**బొందిలి భాగ్యలక్ష్మి బాయి, మహానాడు కాలనీ, తాడేపల్లి**

# రాష్ట్రంలో వ్యవస్థలను సర్వనాశనం చేసింది వైసీపీనే!

- వ్యవసాయానికి కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తుంది..!
- నా మొదటి సంతకం కూడా వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల మంజూరు పైనే..!
- రాష్ట్రంలో దళారులే లేని ఏకైక మార్కెటింగ్ యార్డు అద్దంకే..!
- ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్

**టీపీఎన్, అద్దంకి :**

రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా వ్యవసాయ ఉత్పత్తులు అమ్ముకునేలా రైతులకు మార్కెటింగ్ కమిటీ సౌకర్యాలు కల్పించిందని మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. అద్దంకి వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కొత్తగా కొలువు తీరిన ఛైర్మన్, వైస్ ఛైర్మన్, కమిటీ సభ్యులకు మంత్రి గొట్టిపాటి అభినందనలు తెలిపారు. రాష్ట్ర విభజన అనంతరం 2014లో ఏర్పడిన అద్దంకి మార్కెటింగ్ కమిటి పని తీరును మంత్రి గొట్టిపాటి కొనియాడారు. రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 220 పైగా వ్యవసాయ మార్కెట్ కమిటీలు ఉంటే రైతులు పండించిన కూరగాయలను, పంటను దళారుల ప్రమేయం లేకుండా నేరుగా అమ్ముకునే సౌకర్యం కల్పించామని అన్నారు. రైతులు పండించిన పంటను అమ్ముకునేందుకు వస్తే వారి నుంచి కూడా అక్రమ వసూళ్లకు పాల్పడినట్లు తెలిపారు. అయితే నేడు కొత్తగా కొలువు తీరిన కమిటీ రైతుల ప్రయోజనాలే లక్ష్యంగా ముందుకు సాగాలని మంత్రి గొట్టిపాటి రవి కుమార్ ఆకాంక్షించారు. అద్దంకి మార్కెటింగ్ యార్డ్ సుమారు 13 ఎకరాల్లో ఉందన్న మంత్రి... మార్కెటింగ్ యార్డుకు కూడా ఆదాయం చేకూరేలా అధికారులు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. గతంలో మాదిరిగానే అద్దంకి మార్కెటింగ్ యార్డుకు పూర్వ వైభవం తీసుకు రావాలని కోరారు. వైసీపీ ప్రభుత్వం అన్నీ వ్యవస్థలను సర్వనాశనం చేసినట్లే.. మార్కెటింగ్ యార్డులను కూడా నాశనం చేసిందని మండిపడ్డారు. జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం రైతులకు సంబంధించిన పనిముట్లను, వ్యవసాయ పరికరాలను,



డ్రిప్ సిస్టమ్ ను అందించలేదని మంత్రి గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వ్యవసాయాన్ని కొత్త పుంతలు తొక్కిస్తుందని తెలిపారు. వ్యవసాయంలో డ్రోన్ల వినియోగాన్ని పరిచయం చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఇందుకోసం ప్రతి మండలానికి రెండు డ్రోన్లను కేటాయించినట్లు మంత్రి గొట్టిపాటి తెలిపారు. రైతుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి గొట్టిపాటి రవి కుమార్ తెలిపారు. ఇందులో భాగంగానే తాను మంత్రిగా బాధ్యతలు చేపట్టేటప్పుడు తొలి సంతకం రైతులకు 45 వేలు వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు మంజూరు పైనే చేసిన విషయాన్ని గుర్తు చేశారు.

కొరిశపాడు మండలం పి. గుడిపాడు గ్రామంలో ఉద్యానవన పంటలను మంత్రి నారా లోకేశ్ కూడా పరిశీలించడం జరిగిందని మంత్రి గొట్టిపాటి రవి కుమార్ తెలిపారు. ఉద్యానవన పంటలకు పెద్ద ఎత్తున సబ్సిడీ ఇచ్చి కూటమి ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని చెప్పారు. అయితే నేడు ఉద్యానవన పంటలకు నిలయమైన పి. గుడిపాడు గ్రామానికి చెందిన వ్యక్తి ఛైర్మన్ కావడం సంతోషమని అన్నారు. త్వరలోనే పి గుడిపాడు గ్రామంలో వ్యవసాయ మార్కెట్ యార్డు ఏర్పాటు చేస్తామని మంత్రి గొట్టిపాటి హామీ ఇచ్చారు. సీఎస్ఆర్ నిధులతో నియోజకవర్గం వ్యాప్తంగా పెద్ద ఎత్తున కమ్యూనిటీ భవనాలు ఏర్పాటు చేస్తున్నామని మంత్రి పేర్కొన్నారు. అద్దంకి ప్రజలకు సురక్షితమైన తాగునీరు అందేలా ఓవర్ ట్యాంకుల ఏర్పాటుకు కృషి చేస్తున్నామని ఈ సందర్భంగా చెప్పారు.



# సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం ప్రారంభం!

**టీపీఎన్, శ్రీకాళహస్తి :**

ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి తొటంబేడు మండలం చిన్నసింగమల గ్రామంలో సుపరిపాలనలో తొలిఅడుగు డోర్ టు డోర్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రజలకు మంచి పాలనను, పారదర్శకతను నేరుగా చేర్చేందుకు ఈ కార్యక్రమం ఒక విశేషమైన ప్రయత్నంగా నిలిచింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సుపరిపాలనను అందించడం కేవలం తెలుగుదేశం పార్టీ ప్రభుత్వంలోనే సాధ్యం అని స్పష్టంగా తెలిపారు. ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారి విజనరీ నేతృత్వం, యువ, ప్రతిభావంతుడైన ఐటి మంత్రి శ్రీ నారా లోకేష్ గారి మార్గదర్శకత్వంలోనే ఇది సాధ్యమవుతుందని అన్నారు.

కార్యక్రమంలో భాగంగా, రాష్ట్రం మరియు శ్రీకాళహస్తి నియోజకవర్గంలో ఒక సంవత్సరం కాలంలో జరిగిన అభివృద్ధి పనులను వివరించే పాంప్లెట్ను సీనియర్ టీడీపీ నాయకుల చేతుల మీదుగా విడుదల చేశారు. ఇప్పటికే 15 రోజుల క్రితం, వైట్ పేపర్ ద్వారా కూడా పూర్తి చేసిన వాగ్దానాలను, ముఖ్యమైన అభివృద్ధి పనులను ప్రజలకు వివరించారు. డోర్ టు డోర్ ప్రచారంలో సుధీర్ రెడ్డి గారు మరియు టీడీపీ కార్యకర్తలు గ్రామ ప్రజలకు గత ఏడాది కాలంలో రాష్ట్రం మరియు నియోజకవర్గంలో జరిగిన ప్రధాన అభివృద్ధి పనులు గురించి వివరించారు. అలాగే, ప్రజల నుండి ఫిర్యాదులు స్వయంగా స్వీకరించి,వాటి పరిష్కారం కోసం అధికారులను ఆదేశించారు.

మీడియాతో మాట్లాడుతూ .. "మన ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారి పిలుపు మేరకు, యువ నాయకుడు మరియు ఐటి మంత్రి శ్రీ నారా లోకేష్ గారి మార్గదర్శకత్వంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నాము. ప్రజలకు మేము ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి, వారి అవసరాలను తీర్చేందుకు కృషి చేస్తాము. " ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత, అనేక సమస్యలు పరిష్కరించబడి, సూపర్ సిక్స్ ప్రణాళికలో భాగంగా అనేక వాగ్దానాలను నెరవేర్చినట్లు తెలిపారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం : సింధూర రెడ్డి

**టీపీఎన్, పుట్టపర్తి :**

పుట్టపర్తి నియోజకవర్గంలో రూ. 477 కోట్లతో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి. కూటమి ప్రభుత్వం ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా అమడ గూరు మండలం కసముద్రం పంచాయతీలో బుధవారం " సుపరిపాలనలో తొలి అడుగు " కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లె సింధురా రెడ్డి గ్రామంలోని ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం ఏడాది కాలంలో చేపట్టిన పనుల గురించి, భవిష్యత్తులో చేపట్టబోయే కార్యక్రమాల గురించి ప్రజలకు వివరించారు. అంతేకాకుండా ప్రతి ఇంటికి వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పలు సమస్యలు ఎమ్మెల్యేకు వివరించగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం సింధూర రెడ్డి మాట్లాడుతూ ఇచ్చిన హామీలను 80 శాతం అమలు చేశామన్నారు. ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ



పథకాలు అందజేస్తామన్నారు. ముఖ్యంగా పుట్టపర్తి నియోజకవర్గంలో 193 చెరువుల తోపాటు రెండు రిజర్వాయర్లను హంద్రీనీవా కాలువ ద్వారా కృష్ణా జలాలతో నింపి సస్యశ్యామలం చేస్తామన్నారు. ఈ ప్రాంతాన్ని మరో కోస్తాంధ్రగా మారుస్తామని పేర్కొన్నారు. అమడగూరు, ఓడి చెరువు, నల్లమాడ ఈ మూడు మండలాల్లో ఏదైనా ఒకచోట ఉపాధి పరిశ్రమ ఏర్పాటుకు కొన్ని కంపెనీలు కూడా ముందుకు వస్తున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు, కూటమి పార్టీల నాయకులు పాల్గొన్నారు

# నెట్‌వర్క్ సమస్యలపై మంత్రి సత్యకుమార్ ఫోకస్..!

- ధర్మవరం నియోజకవర్గానికి జియో మొబైల్ టవర్స్.. మంత్రి సత్యకుమార్ యాదవ్ నుంచి అధికారిక విజ్ఞప్తి.
- ముందుకెళ్తున్న అభివృద్ధి మార్గం – గ్రామాలకు నెట్‌వర్క్ పరిష్కారాలు.
- ధర్మవరం నియోజకవర్గ అభివృద్ధి పట్ల ఒక ప్రత్యేకమైన సంకల్పం



**టీపీఎన్, ధర్మవరం :**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మరియు వైద్య విద్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, గ్రామీణ ప్రాంతాల డిజిటల్ కనెక్టివిటీ మెరుగుపరచడంపై రాష్ట్ర ప్రభుత్వ కట్టుబాట్లను పరిగణనలోకి తీసుకొని, ధర్మవరం నియోజకవర్గంలోని నెట్‌వర్క్ లోపాలున్న గ్రామాల్లో జియో మొబైల్ టవర్లు ఏర్పాటు చేయాలని రిలయన్స్ జియో సీఈఓకి అధికారికంగా లేఖ ద్వారా విజ్ఞప్తి చేశారు. ఈ విజ్ఞప్తిలో, సత్యకుమార్ ముదిగుబ్బ మండలం మరియు ధర్మవరం రూరల్ మండలంలోని మొత్తం 24 గ్రామాలు జాబితా చేశారు. ప్రస్తుతం ఈ గ్రామాలు తీవ్రమైన నెట్‌వర్క్ సమస్యలు ఎదుర్కొంటున్నాయి. ఫలితంగా, విద్య, అత్యవసర వైద్యం, డిజిటల్ సేవలు మరియు ఈగవర్నెన్స్ వంటి ప్రాథమిక అవసరాలకు ప్రజలు బాగా ఇబ్బంది పడుతున్నారు. జియో టవర్స్ ఏర్పాటు కావలసిన గ్రామాల జాబితా: ముదిగుబ్బ మండలంలోని పైపేడు, పెద్దన్న గారి పల్లి, దొరిగిల్లు, కొడవాండ్లపల్లి, మల్లెపల్లి, ముక్తాపురం, ఒడ్డు కింద తండా, చిన్నకోట్ల, ఏపీ పల్లి తండా, కొండగట్టుపల్లి, అలాగే ధర్మవరం రూరల్ మండలంలోని సీసీ కొత్తకోట, దర్శనమల, ధర్మపురి, ఏలుకుంట్ల, మల్లకాలువ, నేలకోట, పోతుకుంట, రాహుల్ చెరువు, తుమ్మల. ఈ గ్రామాల్లో నెట్‌వర్క్ మరమ్మత్తులు తక్షణమే చేపట్టాలని కోరుతూ, ఈ అంశాన్ని రిలయన్స్ జియో సంస్థ సాంకేతిక, ఆపరేషన్ విభాగాల్లో పరిగణించమని మంత్రి కోరారు. గ్రామీణ ప్రాంతాల్లో డిజిటల్ సేవల విస్తరణలో జియో సంస్థ చేస్తున్న కృషిని అభినందిస్తూ, రాష్ట్ర ప్రజలకు మేలు కలిగే విధంగా వెంటనే స్పందించాలని విజ్ఞప్తి చేశారు. లేఖ ప్రతులు ముదిగుబ్బ మరియు ధర్మవరం రూరల్ మండలాలకు సంబంధించిన ఎంపీడీఓలకు కూడా పంపించబడ్డాయి. ఈ లేఖ ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో డిజిటల్ ఇన్‌క్లూజన్‌కు మరింత బలం చేకూరే అవకాశం ఉందని మంత్రి సత్య కుమార్ యాదవ్ అభిప్రాయపడ్డారు.




# ఎక్స్‌పీరియన్స్ సెంటర్ పనులను త్వరితగతిన పూర్తిచేయాలి!

**టీపీఎన్, ఇబ్రహీంపట్నం :**

దేశ, విదేశాలలో ప్రత్యేక గుర్తింపు పొందుతున్న కొండపల్లి బొమ్మ ఔన్నత్యాన్ని నేటి తరానికి చాటిచెప్పేలా, భవిష్యత్తు తరాలకు వారసత్వ సంపదగా అందించేలా చేపట్టిన ఎక్స్‌పీరియన్స్ సెంటర్ పనులను త్వరితగతిన పూర్తిచేసి వీలైనంత త్వరగా పర్యాటకులకు అందుబాటులోకి తేవాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అధికారులను ఆదేశించారు.

బుధవారం కలెక్టర్ లక్ష్మీశ ఇబ్రహీంపట్నం మండలం, కొండపల్లిలో పర్యాటక, మున్సిపల్ శాఖల అధికారులతో కలిసి ఎక్స్‌పీరియన్స్ సెంటర్ పనులను పరిశీలించారు. కళాత్మక సౌందర్యం ఉట్టిపడేలా మ్యూరల్ పెయింటింగ్స్ పనులు పూర్తయ్యాయని.. లోపల భాగంలో కొన్ని పనులు మిగిలియున్నాయని అధికారులు వివరించారు. ఫెన్సింగ్ వంటి పనులను త్వరితగతిన పూర్తిచేయాలని ఈ సందర్భంగా కలెక్టర్ ఆదేశించారు. చారిత్రక, సాంస్కృతిక ఔన్నత్యమున్న జిల్లాను పర్యాటక హబ్‌గా తీర్చిదిద్దేందుకు కృషిచేస్తున్నామని, ఇందులో భాగంగా శతాబ్దాల చారిత్రక వారసత్వానికి సజీవ సాక్ష్యంగా ఉన్న కొండపల్లి బొమ్మ విశిష్టతను పర్యాటకులకు చాటిచెప్పేలా ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌ను అభివృద్ధి చేయడం జరుగుతుందన్నారు. కొండపల్లి బొమ్మ చారిత్రక వైభవం, బొమ్మల తయారీకి ఉపయోగించే తెల్ల పొణికి చెక్క ప్రాచుర్యాన్ని, బొమ్మలకు సంబంధించిన విశేషాలను పర్యాటకులకు కళ్లకు కట్టినట్లుగా తెలియజేసి ప్రత్యక్ష అనుభూతి పొందేలా ఎక్స్‌పీరియన్స్ సెంటర్ ఎంతో దోహదపడుతుందని కలెక్టర్ అన్నారు. కలెక్టర్ వెంట విజయవాడ ఆర్‌డీవో కావూరి చైతన్య, జిల్లా పర్యాటక అధికారి ఎ.శిల్ప, కొండపల్లి మునిసిపల్ కమిషనర్ రమ్యకీర్తన తదితరులు ఉన్నారు.

# పేద తల్లిదండ్రులను వంచించడమే!

**టీపీఎన్, నిడదవోలు :**



రాష్ట్ర ప్రభుత్వమే నాణ్యమైన విద్యను అందించాల్సింది పోయి ప్రైవేటు విద్యా సంస్తలను ప్రోతహించడం మోస పూరితమనీ సీపీఎం తూర్పు గోదావరి జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జువ్వల రాంబాబు విమర్శింశారు. విద్యా హక్కు చట్టం ప్రకారం ప్రైవేట్ పాఠశాలల్లో 25 శాతం సీట్లు పేద విద్యార్థులకు కేటాయించాలన్నారు. కానీ ప్రవేట్ పాఠశాలల యాజమన్యాలు ఈ నిబంధనను పట్టించుకోవడం లేదన్నారు. ఫలితంగా పేద విద్యార్థుల తల్లిదండ్రులు తీవ్రంగా నస్తాపోతున్నరన్నారు. అయా సంస్తలకు ప్రభుత్వం చెల్లింపులు చేయకపోవడం వల్ల పేద విద్యార్థులు, వారి తల్లిదండ్రులు మానసిక వేదన చెందుతున్నారన్నారు. ప్రవేట్ పాఠశాలల్లో పుస్తకాలూ, ఇతర మెటీరియల్ పేరుతో దోపిడీ జరుగుతోందన్నారు. ప్రైవేట్ విద్యా సంస్థలకు చెల్లించ వలసిన బకాయిలు చెల్లించకుండా ఉచిత సీట్లు కేటాయింపులు అంటూ ప్రకటనలు చెయ్యటం ప్రజల్ని మోసం చేయడమే అని రాంబాబు విమర్శించారు. ప్రైవేట్ విద్యా సంస్థల్లో దోపిడీకి వ్యతిరేకంగా ప్రభుత్వ మోసపూరిత ప్రకటనలకు వ్యతిరేకంగా పోరాడతామని జువ్వల రాంబాబు హెచ్చరించారు.



# ఆంధ్రా పేపర్ మిల్‌లో హైడ్రోజన్ ఫెరాక్సైడ్ లీక్!

**టీపీఎన్, రాజమండ్రి :**

ఆంధ్రా పేపర్ మిలhలో హైడ్రోజన్ ఫెరాక్సైడ్‌ను తీసుకొచ్చిన వాహనము నుంచి రసాయనం లీక్ అయింది. కలెక్టర్ ఆదేశాల మేరకు, ఆర్డీవో ఆర్. కృష్ణనాయక్ సంఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. రాజమహేంద్రవరం అగ్నిమాపక కేంద్రం నుండి రెండు వాహనాలు మరియు కొవ్వూరు అగ్నిమాపక కేంద్రం నుండి మరో వాహనము, అలాగే ఆంధ్రా పేపర్ మిల్ వారి సొంత అగ్నిమాపక వాహనాలతో కలిసి సంఘటనా స్థలానికి చేరుకొని రసాయనాన్ని తక్షణమే డైల్యూట్ చేయడం జరిగిందనీ అధికారులు తెలియ చేయడం జరిగింది. సదరు వాహనంలో మొత్తం 26 టన్నుల హైడ్రోజన్ ఫెరాక్సైడ్ ఉన్నట్లుగా అంచనా వెయ్యడం జరిగిందన్నారు. ఈ ఘటనలో ఎవరికీ ఎటువంటి అస్వస్థత లేదా హానీ కలగలేదని చెప్పారు. పరిసర ప్రాంతాల్లో పరిస్థితి పూర్తిగా నియంత్రణలో ఉందని తెలిపారు. అలాగే, ప్రాంతీయ అగ్ని మాపక అధికారి ఈ.స్వామి, ఆర్డీవో ఆర్ కృష్ణ నాయక్, ఫ్యాక్టరీస్ డిప్యూటీ ఇన్స్పెక్టర్ కె. కృష్ణమూర్తి కూడా ఘటన సమయానికి సంఘటనా స్థలంలో ఉండి పర్యవేక్షణ చేయడం జరిగిందనీ, పరిస్థితి సాధారణ స్థితి కి చేరుకోవడం కోసం ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరిగిందని తెలిపారు. ఈ ఘటనలో ఎటువంటి ప్రమాదం చోటుచేసుకోలేదు. సాధారణ స్థితిలోనే రసాయనాన్ని నిర్వీర్యం చేయడం జరిగిందనీ, భయాందోళనలు అవసరం లేదనీ సంబంధిత శాఖల అధికారులు తెలియజేశారు. ఈ ఘటనకు సంబంధించి ప్రాంతీయ అగ్నిమాపక అధికారి మార్టిన్ లూథర్ కింగ్, జిల్లా విపత్తు స్పందన మరియు అగ్నిమాపక అధికారి, సహాయ జిల్లా అగ్నిమాపక అధికారి (రాజమహేంద్రవరం) , జిల్లా పరిశ్రమల అధికారి వాణిధర్ రామన్ హాజరై పర్యవేక్షణ చేపట్టారు.



# స్వర్ణ నారావారిపల్లె 2029 అభివృద్ధికి సమగ్ర ప్రణాళిక!

**టీపీఎన్, తిరుపతి :**

స్వర్ణ నారావారిపల్లె 2029 అభివృద్ధికి సమగ్ర ప్రణాళికలను త్వరితగతిన సిద్ధం చేసి పనులు చేపట్టాలని కలెక్టర్ వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు. అన్ని గ్రామాల్లో ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలు పూర్తి కావాలని తెలిపారు. స్థానిక కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నందు స్వర్ణ నారావారిపల్లె 2029 అభివృద్ధి కార్యక్రమాలపై ప్రత్యేక అధికారిని శ్రీమతి సుశీల దేవి మరియు సంబంధిత అధికారులతో కలిసి సమీక్ష నిర్వహించి దిశా నిర్దేశం చేశారు.

స్వర్ణ నారావారి పల్లె 2029 లో భాగంగా జరగనున్న అభివృద్ధి కార్యక్రమాలపై అన్ని శాఖల అధికారులతో సమగ్ర సమీక్ష సమావేశం నిర్వహించి, నారావారిపల్లి అభివృద్ధిని త్వరితగతిన పనులు పూర్తి అయ్యేటట్లు ప్రణాళికను సిద్ధం చేసుకొని, అనుమతులు కావాల్సిన శాఖల ద్వారా పరిపాలనా ఉత్తర్వులను పొంది పనులను పూర్తి చేయాలని తెలిపారు. వివిధ శాఖాధికారులతో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. బ్యాంక్ లింకేజ్ ద్వారా స్వయం సహాయ సంఘాలకు రుణాలు మంజూరు చేయాలని, ఈజీమార్ట్ సహకారంతో రిటైల్ అవుట్‌లెట్‌ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని, వ్యవసాయ రంగానికి సంబంధించి కిచెన్ గార్డెనింగ్, టెర్రస్ గార్డెనింగ్‌పై గుర్తించబడిన కుటుంబాలకు శిక్షణ ఇవ్వాలని సూచించారు. వరి పొలాల్లో ద్రవ జీవామృతం సుమారు 1000 ఎకరాలలో పిచికారి చేయాలనీ, రైతుల పొలాల్లో PMDS కిట్ల ఏర్పాటు, శిక్షణా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. 100% సోలరైజేషన్ సంబంధించిన పంచాయతీల్లో సర్వీసులను త్వరగా సోలరైజ్ చేయాలని, విద్యా రంగానికి సంబంధించి అన్ని పాఠశాల భవనాలను, డిజిటల్ లైబ్రరీ, మైదానం లెవలింగ్ వంటి వసతుల కల్పన ఏర్పాటు చేయాలన్నారు. మహిళా సంక్షేమం ద్వారా మహిళా పోలీసులకు ఆన్‌సైట్ స్క్రీనింగ్ అప్లికేషన్‌లపై శిక్షణ, 8 అంగన్‌వాడీ కేంద్రాల్లో AI ఆధారిత స్క్రీనింగ్‌ను 100% పూర్తి చేయాలని తెలిపారు. గ్రామీణ అభివృద్ధి ద్వారా CC రోడ్లను, త్రాగునీటి ట్యాంక్లు, 33/11 కె వి ఇండోర్ విద్యుత్ సబ్ స్టేషన్లు పూర్తి చేయాలని తెలిపారు. నారావారిపల్లి CHC, CSC యూనిట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని, IHHL (వ్యక్తిగత మరుగుదొడ్లు) పనులు మరియు ఇతర అభివృద్ధి కార్యక్రమాలు పూర్తి చేయాలని, స్వచ్ఛత కోసం హోం కంపోస్టింగ్ లబ్ధిదారుల జాబితా సిద్ధం చేయాలని సంబందిత శాఖల అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం ఎస్.సి, ఎస్.టి లకు అందించిన ఈ ఆటోల వలన రోజు వారి ఆదాయం గతంతో పోలిస్తే ఎంత ఆదాయ రాబడి వస్తుందో తెలుసుకోవాలని అన్నారు. స్కిల్ డెవలప్మెంట్ ద్వారా ఎంత మందికి శిక్షణ ఇచ్చారో, ఎంత మందికి ఉపాది కల్పించారని అడిగి తెలుసుకున్నారు. పాఠశాల ఆవరణలో ఎటువంటి అసాంఘీక కార్యక్రమాలు చోటు చేసుకోకుండా చూడాలని సంబందిత స్కూల్ ప్రధాన ఉపాధ్యాయులను ఆదేశించారు. పల్లె వనం లు ఏర్పాటు చేయాలనీ, క్యాటిల్ షెడ్ లు అన్ని 100 శాతం పూర్తి చేయాలనీ, విద్యా శక్తి కార్యక్రమాన్ని నిర్వహించాలని సూచించారు. అలాగే మిగిలిన శాఖల వారు కావలసిన పరిపాలన అనుమతులను పొంది స్వర్ణ నారావారిపల్లి 2029 అభివృద్ది పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సంబందిత అధికారులను ఆదేశించారు.



# జీజీహెచ్, ఘోషాసుపత్రులలో ఎస్టీ సెల్ ఏర్పాటు చేయాలి!

**టీపీఎన్, విజయనగరం :**

ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి , ఘోషాసుపత్రులలో షెడ్యూల్ తెగల ప్రజలకు సహాయం కోసం ప్రత్యేకంగా ఎస్.టి. సెల్ ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎస్టీ కమిషన్ ఛైర్మన్ డాక్టర్ శంకర్రావు అధికారులను ఆదేశించారు.

ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి, ఘోషాసుపత్రులలో ఆయన తనిఖీలు నిర్వహించారు. ముందుగా ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి చేరుకొని ఆసుపత్రిలో అవుట్ పేషెంట్ విభాగం, జనరల్ వార్డు, సర్జరీ విభాగం, ఐసీయూ, రేడియాలజీ, సీటీ స్కాన్ విభాగాలను తనిఖీ చేశారు. రోగులతో మాట్లాడి ఆసుపత్రిలో అందిస్తున్న వైద్య సేవలు, భోజన నాణ్యత గూర్చి మరియు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఘోషాసుపత్రిని సందర్శించి ఆసుపత్రిలోని ప్రసూతి విభాగం, పిల్లలు వార్డు, ఐసీయూ, చిన్నారులకు పోషకాహారం అందించే వార్డులను తనిఖీ చేశారు. గర్భిణులు, బాలింతలతో మాట్లాడి ఆసుపత్రిలో అందుతున్న సేవలు గూర్చి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో అందిస్తున్న వైద్య సేవలు, ఆసుపత్రికి కావలసిన మౌలిక సదుపాయాలు కల్పన, సిబ్బంది వివరాలు, రోజూ ఆసుపత్రులకు వస్తున్న రోగుల సంఖ్య, వారికి అందిస్తున్న సేవలు తదితర అంశాలను గూర్చి ఎస్‌టి కమిషన్ ఛైర్మన్ వైద్యాధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రి తనిఖీ అనంతరం ఛైర్మన్ డాక్టర్ శంకరరావు విలేకరులతో మాట్లాడుతూ.. ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి , ఘోషాసుపత్రులలో ప్రజలకు అందుతున్న వైద్య సేవలు, ప్రజల అభిప్రాయాలు, సమస్యలు తెలుసుకుని అవసరమైన సేవలు ఏర్పాటు గురించ ప్రభుత్వానికి తెలియజేయుటకు ఆసుపత్రి సందర్శించడం జరిగిందని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రి బోధన ఆసుపత్రిగా మారిన తర్వాత అనేక వైద్య సేవలు ప్రజలకు అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. గతంలో ప్రతి కేసు విశాఖపట్నం కేజీహెచ్‌కు పంపించడం జరిగేదని, ప్రస్తుతం ఆధునిక వైద్య సేవలు ఇక్కడే అందుబాటులో రావడం వల్ల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించగలుగుతున్నట్లు తెలిపారు. వైద్యులు అందరూ అందుబాటులో ఉన్నప్పటికీ, పారామెడికల్, నర్సింగ్ సిబ్బంది తగినంత మంది లేకపోవడం వల్ల వైద్య సేవలు అందించడంలో ఇబ్బందులు తలెత్తుతున్నట్లు గమనించినట్లు తెలిపారు. ప్రతిరోజు సుమారు 1500 మంది ఔట్ పేషెంట్ విభాగంలో సేవలు పొందుతున్నారని, 4,800 మందికి వివిధ రకాలైన వైద్య పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని, అందుకు తగిన పారామెడికల్ సిబ్బందిని నియమించవలసిందిగా ప్రభుత్వాన్ని కోరతామన్నారు. ముఖ్యంగా గిరిజన ప్రాంతాల నుంచి వచ్చే రోగులకు సత్వరమే వైద్య సేవలు అందించేందుకు ఎస్టీ సెల్ ఏర్పాటు చేయవలసిందిగా కలెక్టర్‌ను కోరనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రిలో పార్కింగ్ సమస్య ఏర్పడుతుందని, సమస్యను పరిష్కరించుటకు తగు చర్యలు తీసుకోవాల్సిందిగా ఆసుపత్రి సూపరిండెంట్ ను ఆదేశించినట్లు ఆయన తెలిపారు. ఆసుపత్రిలో అందుతున్న సేవలు పట్ల ప్రజలు సంతృప్తి వ్యక్తం చేశారన్నారు. ప్రసూతి ఆసుపత్రిలో పిల్లల వార్డులో పేషెంట్ల సంఖ్యకు అనుగుణంగా అదనంగా వెంటిలేటర్లు ఏర్పాటు చేయవలసిన అవసరం ఉందని తెలిపారు.



# నేను స్వచ్ఛందంగా రాజీనామా చేశా : సిద్ధార్థ్ కౌశల్

**టీపీఎన్, విజయవాడ :**

తన ఐపీఎస్ ఉద్యోగానికి స్వచ్ఛందంగా రాజీనామా చేశానన్నారు సిద్ధార్థ్ కౌశల్. ఇది పూర్తిగా వ్యక్తిగత కారణాలతో, దీర్ఘకాలిక ఆలోచన తరువాత తీసుకున్న నిర్ణయం అని తెలిపారు. ఇందులో ఎవరి బలవంతం లేదన్నారు. తన జీవన లక్ష్యాలు, కుటుంబ సభ్యుల అభిప్రాయాలను దృష్టిలో పెట్టుకుని ఈ నిర్ణయం తీసుకున్నానన్నారు. ఒత్తిళ్లు, వేధింపులు వలనే రాజీనామా చేస్తున్నట్లు తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. ఆ ఆరోపణలన్నీ పూర్తిగా నిరాధారమైనవని చెప్పారు. ఐపీఎస్ సేవలో పని చేయడం తన జీవితంలో అత్యంత గౌరవప్రదమైన, తృప్తికరమైన అనుభవం అని అన్నారు. ఇక నుంచి జీవితాన్ని కొత్త దారిలో, కొత్త లక్ష్యాలతో ముందుకు తీసుకెళ్లేందుకు సిద్ధమవుతానని చెప్పారు. సమాజానికి మరో విధంగా సేవ చేయాలనే సంకల్పంతో ముందుకు సాగుతానన్నారు. అనంతరం ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వానికి, సహచర అధికారులకు, తనను ఆదరించిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.




# చాగల్లులో టీడీపీ నేతల సమావేశం!

**టీపీఎన్, చాగల్లు :**

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయిన సందర్భంగా సీఎం నారా చంద్రబాబు నాయుడు గారి ఆదేశాల మేరకు డోర్ టు డోర్ కార్యక్రమం మొదలు పెట్టామని కొవ్వూరు నియోజకవర్గం శాసనసభ్యులు ముప్పిడి వెంకటేశ్వరరావు తెలిపారు. నెలటూరు కళ్యాణ మండపంలో జరిగిన చాగల్లు మండల తెలుగుదేశం పార్టీ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ.. ఇప్పటి వరకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కార్యక్రమాలు, సాధించిన విజయాలు త్వరలో కూటమి చేపట్టబోయే కార్యక్రమాలు డోర్ టు డోర్ సందర్శించి ప్రభుత్వం చేపట్టిన సుపరి పాలనలో తొలి అడుగు కార్యక్రమం విజయ వంతం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో AMC చైర్మన్ నాదెళ్ల శ్రీరామ్, ఆళ్ల హరిబాబు, తాళ్లూరు హరిశ్చంద్రప్రసాద్ తదితర టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



# ఎస్సీ, ఎస్టీల సమస్యలను చైర్మన్ దృష్టికి తీసుకురావాలని విజ్ఞప్తి!

**టీపీఎన్, సూళ్లూరుపేట:**

తిరుపతి జిల్లా సూళ్లూరుపేట రెవెన్యూ డివిజన్ పరిధిలో ఎస్సీ, ఎస్టీలకు ఎటువంటి సమస్యలు ఉన్నా అవి డివిజన్ స్థాయి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ చైర్మన్ దృష్టికి తీసుకురావాలని ఆ కమిటీ చైర్మన్ మరియు డివిజనల్ అధికారి కిరణ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "కుల వివక్షత, అంటరానితనం, బానిస తత్వం, భూ సమస్యలు, రెవెన్యూకు సంబంధించిన సమస్యలు వంటి ఏ విధమైన సమస్యలు ఉన్నా బాధితులు నేరుగా తమ వద్దకు వచ్చి తెలియజేయవచ్చు. గతంలో జరిగిన సమీక్ష సమావేశాల్లో వచ్చిన పలు అంశాలకు పరిష్కారం కల్పించాం. ఇప్పటికీ ప్రజలు తమ సమస్యలను నేరుగా మా దృష్టికి తీసుకురావాలి" అని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా కమిటీ సభ్యుడు పార్వతయ్య, నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు, డివిజన్‌లోని తొమ్మిది మండలాల తహసీల్దార్లు, ఎంపీడీవోలు, మండల సభ్యులు నల్లజామ్ రాము, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

# పెనుగంచిప్రోలు అమ్మవారికి ఆషాడం సారె సమర్పణ!

**టీపీఎన్, పెనుగంచిప్రోలు :**

స్థానిక రంగుల మండపం(పెద్ద వేప చెట్టు) దగ్గర నుంచి మహిళలు భారీగా పాల్గొని ర్యాలీగా వెళ్లి అమ్మవారికి మరియు సహ దేవతలకు ఆషాడం సారె సమర్పించారు. అమ్మవారి దేవస్థానంలోని నిత్య కళ్యాణ మండపం వద్ద ఆషాడం సారెను ఉంచి వేద పండితుల మంత్రోచ్ఛర్ణ చేసిన అనంతరం సమర్పించారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన ఈవో బి.హెచ్.వి.యస్ కిషోర్ కుమార్, ధర్మకర్తల మండల చైర్మన్ జంగాల శ్రీనివాసరావు(వాసు), ధర్మకర్తల మండల సభ్యులు, గ్రామంలోని మహిళలు పాల్గొన్నారు. అనంతరం అమ్మవారి దేవస్థానం వారు ఏర్పాటుచేసిన అన్న ప్రసాదాన్ని అందరూ స్వీకరించారు.





# పరిటాలలో రైతుల నిరసన

**టీపీఎన్, ఎన్టీఆర్ జిల్లా :**

కంచికచర్ల మండలం పరిటాల గ్రామంలో రైతులు నిరసన వ్యక్తం చేశారు. ఎన్ఎస్పీ కాలువలోకి క్రషర్ల ద్వారా రాళ్లు వస్తున్నాయని దీంతో పంటలకు నీళ్లు రావడం లేదని మండిపడ్డారు. పండించిన పంటలు సరిగ్గా పండక దిగుబడులు తగ్గుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం రైతు సంఘం నాయకులు మాట్లాడుతూ.. క్రషర్ల నుంచి వచ్చే ధూళి, దుమ్ముతో పంటలు పండక రైతులు లక్షల రూపాయలు నష్టపోతున్నారని తెలిపారు. క్వారీల యజమానులు నియమ నిబంధనలు పాటించకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు. కాలువలు మట్టితో, రాళ్ళతో నిండిపోయాయని, ఇప్పుడు పొలాలకు నీళ్లు వచ్చే అవకాశం లేకుండా పోయిందన్నారు. సంబంధిత అధికారులు, క్రషర్ల యాజమానులు ఒక్కటై రైతులను ఇబ్బందులను గురి చేస్తున్నారని మండిపడ్డారు.



# ఆర్జీయూకేటీలో అడ్మిషన్స్ ప్రారంభం

**టీపీఎన్, నూజివీడు :**

ఆర్జీయూకేటీ పరిధిలోని నూజివీడు, ఇడుపుల పాయ, శ్రీకాకుళం, ఒంగోలు క్యాంపస్‌లకు సంబంధించి 2025 26 సంవత్సరానికి గాను జూన్ 30 నుంచి జూలై 5వ తేదీ వరకు అడ్మిషన్లు జరుగుతున్న సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా శ్రీకాకుళం క్యాంపస్‌లో విద్యనభ్యసించే విద్యార్థుల కోసం బుధవారం నూజివీడు ఎస్ఏసీ ఆడిటోరియంలో అడ్మిషన్ల ప్రక్రియను చేపట్టారు. 516 మందికి కాల్ లెటర్స్ పంపించగా 444 మంది రిపోర్ట్ చేశారు. రాత్రి నుంచి వర్షం పడుతున్ననేపథ్యంలో విద్యార్థులు ఏ విధమైన ఇబ్బందులు ఎదుర్కోకుండా క్యాంపస్‌కు చేరుకోవడానికి అధికారులు తగిన ఏర్పాట్లు చేశారు. ఉదయం 8 గంటల నుంచి అడ్మిషన్ ప్రక్రియ మొదలైంది. విద్యార్థులను ఉద్దేశించి శ్రీకాకుళం డైరెక్టర్ ఆచార్య కేవీజీడీ బాలాజీ మాట్లాడుతూ శ్రీకాకుళం క్యాంపస్‌లో అడ్మిషన్లు పొందడం అభినందనీయమన్నారు. విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలని పేర్కొన్నారు. ఈ రోజు (గురువారం) కూడా అడ్మిషన్స్ ఉంటాయని తెలిపారు. అనంతరం శ్రీకాకుళం క్యాంపస్‌లో సీటు పొందిన జాహ్నవి, ప్రవీణ్, కావ్య శ్రీ, కావ్య అనే విద్యార్థులను అభినందించి ధ్రువీకరణ పత్రాలు అందజేశారు.

# అవనిగడ్డ సబ్ డివిజన్‌లో కార్డెన్ అండ్ సెర్చ్–1



టీపీఎన్, అవనిగడ్డ : కృష్ణా జిల్లా పోలీసులు జిల్లావ్యాప్తంగా నేర నియంత్రణకు ప్రత్యేక కృషి చేస్తున్నారు. ఈ క్రమంలో జిల్లా ఎస్పీ శ్రీ ఆర్. గంగాధరరావు, ఐపీఎస్ ఆదేశాల మేరకు, అవనిగడ్డ డీఎస్పీ టి. విద్యాశ్రీ ఆధ్వర్యంలో అవనిగడ్డ మరియు చల్లపల్లి సర్కిల్ పోలీసు అధికారులు, సిబ్బంది అవనిగడ్డ పోలీస్ స్టేషన్ పరిధిలోని పులిగడ్డ గ్రామంలో కార్డెన్ అండ్ సెర్చ్ ఆపరేషన్‌ను విస్తృతంగా నిర్వహించారు.ఈ ఆపరేషన్‌లో మద్యం అక్రమ రవాణా నివారణ, మాదక ద్రవ్యాలు మరియు గంజాయి నియంత్రణ, సరైన ధ్రువపత్రాలు లేని ద్విచక్ర వాహనాల తనిఖీ, పాత కేసుల్లో నిందితుల ఇళ్లలో తనిఖీలు మొదలైన కార్యకలాపాలు చేపట్టారు. అనుమానితులు, పాత నేరస్థులు, రౌడీ షీటర్ల కదలికలపై ప్రత్యేక నిఘా ఉంచి, చట్టవిరుద్ధ కార్యకలాపాలను నిరోధించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. అనుమానాస్పదంగా ఎవరైనా తారసపడితే, వారి వివరాలను సేకరించి, గత నేర చరిత్ర ఉన్నదీ లేనిదీ విచారణ చేస్తున్నారు. ఈ ఆపరేషన్‌లో సరైన ధ్రువపత్రాలు లేని 27 ద్విచక్ర వాహనాలు మరియు ఒక ఆటోను స్వాధీనం చేసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ కార్యక్రమంలో సుమారు 100 మంది పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. ఎవరైనా సమస్యలు సృష్టించినా, గొడవలను ప్రేరేపించినా, వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు. ప్రజలు సామరస్యంగా, ప్రశాంతంగా జీవించాలని, అనుమానితుల గురించి సమాచారం ఉంటే పోలీసులకు అందించాలని కోరారు.



# బై బై సిలికాన్ వ్యాలీ! హలో క్వాంటం వ్యాలీ!

హైదరాబాద్‌లో 1990ల చివరలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బై బై బెంగళూరు, హలో హైదరాబాద్ అనే నినాదంతో హైటెక్ పార్క్‌ను నిర్మించారు. ఇప్పుడు, ఈ దార్శనిక నాయకుడు హైటెక్ నగరాల నుంచి ఒక ముందడుగు వేసి, సాధారణ కంప్యూటర్ల నుంచి క్వాంటం సాంకేతికతపై దృష్టి సారించారు. ఈ అత్యాధునిక క్వాంటం సాంకేతికత చిన్న కణాల వింత నియమాలను ఉపయోగించి సమస్యలను ఇప్పటి వరకు ఉన్న కంప్యూటర్ల కంటే చాలా వేగంగా పరిష్కరిస్తుంది. ఆంధ్రప్రదేశ్‌లోని క్వాంటం వ్యాలీ అనేది తెలివైన మనసులు, అత్యాధునిక ప్రయోగశాలలు, పెద్ద సంస్థలను ఒకచోట చేర్చి కొత్త క్వాంటం కంప్యూటర్లను తయారు చేయడం, అత్యంత సురక్షితమైన సమాచార వ్యవస్థలను అభివృద్ధి చేయడం, అద్భుతమైన లక్షణాలతో కూడిన కొత్త పదార్థాలను ఆవిష్కరించడం లక్ష్యంగా పెట్టుకుంది. ఇది ఒకే చోట సాంకేతిక భవిష్యత్తును నిర్మించడం లాంటిది, ఇది అధిక వేతన ఉద్యోగాలను సృష్టిస్తుంది, వ్యాపారాలను ఆకర్షిస్తుంది మరియు భారతదేశాన్ని ఈ విప్లవాత్మక రంగంలో అగ్రగామిగా నిలబెట్టనుంది. చంద్రబాబు నాయుడు మరియు ఆయన ప్రభుత్వం ఇప్పుడు కొత్త నినాదం బై బై సిలికాన్ వ్యాలీ, హలో క్వాంటం వ్యాలీ అని రాస్తోంది.

**ఆంధ్రప్రదేశ్‌లో క్వాంటం వ్యాలీ**

ఆంధ్రప్రదేశ్‌లో ప్రతిపాదిత క్వాంటం వ్యాలీ 2026 జనవరిలో అమరావతిలో ప్రారంభం కానుంది. ఇది భారతదేశంలో మొదటి పూర్తి సమగ్ర క్వాంటం సాంకేతిక ఇకోసిస్టమ్‌గా 50 ఎకరాల విస్తీర్ణంలలో రూపొందనుంది. ఇందులో క్వాంటం కంప్యూటింగ్, కృత్రిమ మేధస్సు, సెమీకండక్టర్ పరిశోధన, రక్షణ ఆవిష్కరణలను ఏకీకృతం చేస్తుంది. ఈ క్వాంటం వ్యాలీ ఆంధ్రప్రదేశ్‌ను మార్చడమే కాకుండా భారతదేశాన్ని ప్రపంచ క్వాంటం సాంకేతిక రంగంలో ముందంజలో నిలబెట్టడానికి ఒక శక్తివంతమైన శక్తిగా ఉంటుంది.

**రాష్ట్రంలో ప్రభావం**

ఆసియాలో అగ్రగామి కేంద్రం: క్వాంటం వ్యాలీ ఆసియాలో క్వాంటం మరియు డీప్‌టెక్ అభివృద్ధికి నాయకత్వం వహిస్తుంది. ఇది అగ్రశ్రేణి పరిశోధకులు, ఇంజనీర్లు, శాస్త్రవేత్తలను ఆకర్షిస్తుంది.

**ఉద్యోగ సృష్టి:**

పూర్తిగా పనిచేసిన తర్వాత 90,000 నుంచి 1,00,000 అధిక వేతన ఉద్యోగాలు సృష్టించబడతాయి.

**స్టార్టప్ ఇకోసిస్టమ్:**

రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్, ₹1,000 కోట్ల క్వాంటం ఫండ్ వంటి కార్యక్రమాల ద్వారా స్టార్టప్‌లకు మద్దతు లభిస్తుంది.

**విద్య:**

ఆంధ్రప్రదేశ్ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో విశ్వవిద్యాయాలు క్వాంటం కంప్యూటింగ్ పాఠ్యాంశాలను ప్రవేశపెడతాయి. ఆంధ్ర విశ్వవిద్యాయం 202526 నుంచి డిగ్రీ కోర్సులను అందిస్తుంది. అమరావతి క్వాంటం అకాడమీ భారతదేశంలో మొదటి ఇంటిగ్రేటెడ్ క్వాంటం స్కిల్లింగ్ ఇకోసిస్టమ్‌ను ప్రారంభిస్తుంది.

**సుస్థిరత:**

అమరావతి యొక్క సుస్థిర అభివృద్ధి దృష్టితో, ఈ వ్యాలీ పునరుత్పాదక శక్తి వనరులు, హరిత మౌలిక సదుపాయాలను కలిగి ఉంటుంది.

**పాలన:**

భారతదేశంలో మొదటి క్వాంటం గవర్నెన్స్ ఫ్రేమ్‌వర్క్‌ను రూపొందించి, పారదర్శకత, సైబర్ భద్రత, సామర్థ్యాన్ని పెంచుతుంది.

**జాతీయ స్థాయిలో ప్రభావం**

గ్లోబల్ నాయకత్వం: దేశీయ హార్డ్‌వేర్ అభివృద్ధి, నైపుణ్య పెంపొందింపు, సురక్షిత మౌల proud infrastructure ద్వారా భారతదేశాన్ని ప్రపంచ క్వాంటం విప్లవంలో ముందంజలో నిలిపేందుకు ఈ వ్యాలీ కీలకం.

**ఆర్థిక లాభాలు:**

పరిశోధన, ప్రోటోటైపింగ్, మేధో సంపత్తి సృష్టి ద్వారా దీర్ఘకాల ఆర్థిక లాభాలను అందిస్తుంది.

**జాతీయ భద్రత:**

పోస్ట్‌క్వాంటం క్రిప్టోగ్రఫీ, హైపెర్ఫార్మెన్స్ కంప్యూటింగ్, ఫోటోనిక్స్, క్వాంటంసంబంధిత ఏరోస్పేస్, రక్షణ సాంకేతికతలలో పురోగతిని సాధిస్తుంది.

**సహకారం:**

IBM, TCS, L&T వంటి పరిశ్రమ దిగ్గజాలతో సహకారం ద్వారా జీవ శాస్త్రాలు, పదార్థ శాస్త్రం,



సప్లై చైన్, ఎనర్జీ ఆప్టిమైజేషన్, క్రిప్టోగ్రఫీ వంటి రంగాలలో క్వాంటంఏకీకృత అనువర్తనాలను అభివృద్ధి చేస్తుంది.

**జాతీయ కార్యక్రమాలు:**

ఆత్మనిర్భర్ భారత్, డిజిటల్ ఇండియా కార్యక్రమాలకు స్వదేశీ హార్డ్‌వేర్, నైపుణ్య అభివృద్ధి ద్వారా మద్దతు ఇస్తుంది.

**అంతర్జాతీయ సహకారం:**

పర్డ్యూ విశ్వవిద్యాయం (అమెరికా), టోక్యో విశ్వవిద్యాయం (జపాన్) వంటి సంస్థలతో అంతర్జాతీయ పరిశోధన భాగస్వామ్యాలను పెంపొందిస్తుంది.

**భవిష్యత్ ఉద్యోగ అవకాశాలు**

క్వాంటం వ్యాలీలో భవిష్యత్ ఉద్యోగాలు విభిన్నంగా ఉంటాయి:

**క్వాంటం హార్డ్‌వేర్ ఇంజనీర్లు:**

క్వాంటం ప్రాసెసర్లు, క్యూబిట్ నియంత్రణ, క్రయోజెనిక్స్, మైక్రోవేవ్ ఇంజనీరింగ్, పదార్థ శాస్త్రంలో నిపుణులు.

**క్వాంటం అల్గారిథమ్ డెవలపర్లు:**

క్వాంటం ప్రాసెసర్లపై రన్ అయ్యే సాఫ్ట్‌వేర్‌ను Qiskit, Cirq వంటి ఫ్రేమ్‌వర్క్‌లతో అభివృద్ధి చేస్తారు.

**క్వాంటం ఎర్రర్ కరెక్షన్ స్పెషలిస్ట్‌లు:**

క్యూబిట్‌ల స్థిరత్వం, విశ్వసనీయతను మెరుగుపరుస్తారు.

**పోస్ట్-క్వాంటం క్రిప్టోగ్రఫీ నిపుణులు:**

సురక్షిత సమాచార వ్యవస్థలను రూపొందిస్తారు. అప్లికేషన్ సైంటిస్ట్‌లు: రసాయన శాస్త్రం, ఆర్థికం, లాజిస్టిక్స్, జీవ శాస్త్రాలు, శక్తి ఆప్టిమైజేషన్ వంటి రంగాలకు క్వాంటం సాంకేతికతలను అనువర్తిస్తారు.

AI & సెమీకండక్టర్ రీసెర్చ్ ఇంజనీర్లు: కృత్రిమ మేధస్సు, సెమీకండక్టర్ పరిశోధనలో నిపుణులకు డిమాండ్ ఉంటుంది.

**విద్యా సన్నాహాలు**

ఈ ఉద్యోగాలకు గణితం (లీనియర్ ఆల్జెబ్రా, సంభావ్యత, సంకీర్ణ సంఖ్యలు), క్వాంటం మెకానిక్స్, ప్రోగ్రామింగ్ (పైథాన్, క్వాంటం ఫ్రేమ్‌వర్క్‌లు), కంప్యూటర్ సైన్స్ ఆధారాలు అవసరం. ప్రస్తుత పాఠశాల పాఠ్యాంశంలో మార్పులు, కంప్యూటర్ సైన్స్, AIలో ఉపాధ్యాయుల సామర్థ్యాన్ని పెంపొందించడం ద్వారా స్థానిక విద్యార్థులకు క్వాంటం వ్యాలీలో అవకాశాలు అందుతాయి.

**రచయిత గురించి**

రామ్ కమల్ 20 సంవత్సరాలకు పైగా అంతర్జాతీయ దినపత్రికలు, వార్తా సంస్థలలో పనిచేసిన పాత్రికేయుడు. ప్రస్తుతం ఆయన విద్యను అందరికీ సమగ్రంగా, డిజిటల్‌గా అందుబాటులోకి తీసుకురావడానికి సామాజిక ఇంజనీరింగ్‌లో పనిచేస్తున్నారు. ఆయన రాష్ట్ర పాఠశాల విద్యా శాఖకు సమగ్ర విద్య, డిజిటల్ అందుబాటు బోధనలపై సలహా ఇస్తున్నారు.

**రామ్ కమల్**

**సోషల్ ఇంజినీర్, ఏపీ సమగ్ర విద్య**



# NHAI మూలధన వ్యయం పై ఆరోపణలు!

20242025లో, భారత ప్రభుత్వం జాతీయ రహదారుల అభివృద్ధికి జాతీయ రహదారుల అథారిటీ ఆఫ్ ఇండియా (NHAI) ₹2.5 లక్షల కోట్ల రికార్డు మూలధన వ్యయాన్ని (క్యాపెక్స్) సాధించినందుకు ప్రశంసించింది, ఇది ₹2.4 లక్షల కోట్ల లక్ష్యాన్ని అధిగమించింది. అయితే, ఎన్‌హెచ్‌ఏఐ యొక్క ఆడిట్ కాని ఆర్థిక నివేదికలు ₹1.45 లక్షల కోట్ల తక్కువ క్యాపెక్స్‌ను నమోదు చేయడంతో ఈ వాదనలపై సందేహాలు తలెత్తాయి.

**ఆర్థిక అస్పష్టత**

ఎన్‌హెచ్‌ఏఐ యొక్క 20242025 ఆడిట్ కాని ఖాతాల ప్రకారం, ప్రభుత్వం ₹2.5 లక్షల కోట్ల మౌలిక సదుపాయాల వ్యయాన్ని సాధించినట్లు పేర్కొన్నప్పటికీ, ఈ నిధులలో గణనీయమైన భాగం రహదారి నిర్మాణానికి కాకుండా నీటిపారుదల శాఖ రుణ చెల్లింపులకు ఉపయోగించబడింది. ప్రత్యేకంగా, నేషనల్ స్మాల్ సేవింగ్స్ ఫండ్ (ఎన్‌ఎస్‌ఎస్‌ఎఫ్) నుంచి ₹50,000 కోట్ల రుణ చెల్లింపు మరియు పబ్లిక్ సెక్టర్ బ్యాంకు రుణాల తగ్గింపు, ప్రభుత్వం పేర్కొన్న క్యాపెక్స్ లెక్కలలో చేర్చబడ్డాయి, దీనివల్ల నిజమైన అభివృద్ధి వ్యయం అతిశయోక్తిగా చూపబడింది. వాస్తవంగా, మౌలిక సదుపాయాల పనుల కోసం నికర క్యాపెక్స్ కేవలం ₹1.45 లక్షల కోట్లు మాత్రమే—ఇది ఎన్‌హెచ్‌ఏఐ ఖాతాలలో ప్రతిబింబిస్తుంది.

ఈ తేడా, ప్రభుత్వం పేర్కొన్న ₹2.5 లక్షల కోట్లలో గణనీయమైన రుణ చెల్లింపులు ఉన్నాయని, కొత్త రహదారి మౌలిక సదుపాయాలలో పెట్టుబడిని అతిశయోక్తిగా చూపిస్తుందని సూచిస్తుంది. ఎన్‌ఎస్‌ఎస్‌ఎఫ్‌కు ₹50,000 కోట్ల చెల్లింపు, ఇది కేవలం ప్రభుత్వానికి తిరిగి చేరే డబ్బు, పారదర్శకత లోపాన్ని మరింత స్పష్టం చేస్తుంది. అందువల్ల, ఎన్‌హెచ్‌ఏఐకి అందిన నిజమైన మద్దతు సుమారు ₹2 లక్షల కోట్లుగా ఉంది, ఇది పేర్కొన్న గణాంకాల కంటే చాలా తక్కువ.

**నిధుల సేకరణలో ఆటంకాలు**

ఎన్‌హెచ్‌ఏఐ యొక్క ఆస్తుల నిధుల సేకరణ (అసెట్ మానిటైజేషన్) ప్రయత్నాలు కూడా విఫలమవుతున్నాయి. నేషనహైవేస్ ఇన్‌ఫ్రా ట్రస్ట్ (ఎన్‌హెచ్‌ఐటీ) తన నాలుగో నిధుల సేకరణ రౌండ్‌లో ₹18,380 కోట్లు సమీకరించినందుకు ప్రభుత్వం ప్రశంసించింది. అయితే, ఎన్‌హెచ్‌ఐటీ దగ్గరగా పరిశీలిస్తే, ఇశ్రామం ఇప్పటికీ ప్రభుత్వ నియంత్రణలో ఉందని, ప్రాజెక్ట్ నిర్వహణ మరియు పెట్టుబడి పర్యవేక్షణ ఎన్‌హెచ్‌ఏఐ యొక్క పూర్తి యాజమాన్య సంస్థల ద్వారా జరుగుతుందని తెలుస్తోంది. 2,345 కిలోమీటర్ల రహదారుల బదిలీ ద్వారా నామమాత్రంగా ₹43,648 కోట్లు సమీకరించినప్పటికీ, నిజమైన ప్రైవేటు రంగ భాగస్వామ్యం పరిమితంగా ఉంది, ఎక్కువ నిధులు ఈక్విటీ పెట్టుబడి కాకుండా రుణాల ద్వారా సమీకరించబడ్డాయి. టోల్, ఆపరేట్, అండ్ ట్రాన్స్‌ఫర్ (టీఓటీ) వంటి ఇతర నిధుల సేకరణ మోడళ్లు పక్కన పెట్టబడ్డాయి. కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ టీఓటీ మోడల్‌ను నిలిపివేసిన ప్రభుత్వ నిర్ణయంపై అసంతృప్తి వ్యక్తం చేశారు, ఇది గతంలో సమర్థవంతమైన నిధుల సేకరణ సాధనంగా ఉండేది. అదేవిధంగా, కొత్త ఎక్స్‌ప్రెస్‌వేల నిధుల కోసం ప్రభుత్వం యొక్క స్పెషల్ పర్పస్ వెహికల్ (ఎస్‌పీవీ) మోడల్‌కు తక్కువ ఆదరణ లభించింది, దిల్లీవడోదర ఎక్స్‌ప్రెస్‌వే ఒక్కటే ప్రస్తుతం పురోగతిలో ఉంది, అయితే గణనీయమైన ఆలస్యాలతో.

**భారత్‌మాల పరియోజన ఆగకుండా..**

ఎన్‌హెచ్‌ఏఐ సవాళ్లను పెంచుతూ, 2017 2018లో 34,800 కిలోమీటర్ల లక్ష్యంతో ₹6.92 లక్షల కోట్ల అంచనా వ్యయంతో ప్రారంభించిన భారత్‌మాల పరియోజన అనిశ్చిత కాలం పాటు స్తంభించింది. ఖర్చు అధికరణ, భూసేకరణ, కాంట్రాక్టు అమలులో సమస్యలతో ప్రభుత్వం సమీక్షను ఆదేశించింది, ఇది 2024 సాధారణ ఎన్నికల తర్వాత కూడా పూర్తి కాలేదు.

**ముగింపు**

ఈ అభివృద్ధులు ఎన్‌హెచ్‌ఏఐ వద్ద ఆర్థిక బిగింపును సూచిస్తాయి మరియు ప్రభుత్వం యొక్క మౌలిక సదుపాయాల వ్యయం వివరణపై తీవ్రమైన ఆందోళనలను లేవనెత్తుతాయి. అతిశయోక్తి క్యాపెక్స్ వాదనలు, విఫలమవుతున్న నిధుల సేకరణ, స్తంభించిన ప్రాజెక్టులు ప్రభుత్వం యొక్క ఆశాజనక సందేశాల కంటే సంక్లిష్ట చిత్రాన్ని చిత్రిస్తాయి.





## నేరాలు చేస్తే అమెరికా పౌరులను బహిష్కరిస్తాం..!

అమెరికా అధ్యక్షుడు రెండోసారి అధ్యక్షుడైన తర్వాత దూకుడు పెంచారు. సంచలనాత్మక నిర్ణయాలు తీసుకుంటూ పాలనలో తనదైన ముద్ర వేస్తున్నారు. తప్పు చేసిన వారి తాట తీస్తున్నారు. దీంతో ట్రంప్ కు ఎదురుచెప్పే ధైర్యమే ఎవరూ చేయలేకపోతున్నారు. నేరాలపై ఉక్కుపాదం మోపుతున్నారు. తప్పు చేస్తే ఎవరిని వదిలిపెట్టేది లేదని వార్నింగ్స్ ఇస్తున్నారు. తీవ్రమైన నేరాలకు పాల్పడే అమెరికా పౌరులను కూడా దేశం నుంచి బహిష్కరిస్తామని సంచలన వ్యాఖ్యలు చేస్తారు. అయితే ఈ ప్రతిపాదన రాజ్యాంగ విరుద్ధమయ్యే అవకాశం ఉందని న్యాయ నిపుణులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు.



## హసీనాకు ఆరు నెలల జైలు శిక్ష..!

బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనాకు కోర్టు ధిక్కరణ కేసులో ఎదురుదెబ్బ తగిలింది. ఈ కేసులో ఆమెను దోషిగా తేల్చిన బంగ్లాదేశ్ అంతర్జాతీయ నేరాల ట్రైబ్యునల్ (ఐసీటీ), ఆమెకు ఆరు నెలల జైలు శిక్ష విధించింది. దాదాపు ఏడాది క్రితం దేశంలో తీవ్ర నిరసనల మధ్య ఆమె ప్రభుత్వం కూలిపోయి, దేశం విడిచి వెళ్లిన తర్వాత ఒక కేసులో ఆమెకు శిక్ష పడటం ఇదే తొలిసారి. జస్టిస్ ఎండీ గోలాం మొర్తజా మొజుందర్ నేతృత్వంలోని అంతర్జాతీయ నేరాల ట్రైబ్యునల్ 1కు చెందిన ముగ్గురు సభ్యుల ధర్మాసనం ఈ సంచలన తీర్పును వెలువరించింది. ఇదే కేసులో సంబంధం ఉన్న గైబంధా ప్రాంతానికి చెందిన షకీల్ ఆకంద్ బుల్బుల్‌కు కూడా రెండు నెలల జైలు శిక్ష విధించినట్లు ట్రైబ్యునల్ స్పష్టం చేసింది.



## చైనా కొత్త అధ్యక్షుడిగా వాంగ్ యాంగ్?

చైనాలో జీ జిన్ పింగ్ శకం ముగిసినట్టు తెలుస్తోంది. ఆయన దాదాపు 15 రోజుల ప్రజలకు మీడియాకు కనిపించడం లేదు. పాలనా పగ్గాలు ఎవరు చేపడతారనే విషయంపై సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. చైనా కమ్యూనిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి జనరల్ జాంగ్ యూక్సియా చేతిలో ప్రస్తుత దేశ పాలనా పగ్గాలు ఉన్నట్టు సమాచారం. చైనాలో కీలక ఆర్థిక, సైనిక రంగాలపై జిన్ పింగ్ ప్రభావం సన్నగిల్లుతోంది. ఆయన నాయకత్వంపై ప్రజల్లో అసంతృప్తి పెరిగింది. మరోవైపు ఆర్థిక రంగం ఒడుదొడుకులు ఎదుర్కొంటోంది. నిరుద్యోగం బాగా ప్రబలుతోంది. రియల్ ఎస్టేట్ రంగం కుదేలైంది. అందుకే జిన్ పింగ్ రాజకీయ వారసుడిగా వాంగ్ యాంగ్ పేరు తెరపైకి తెస్తున్నారు.



## నేనే సీఎం.. ఎవరికీ అనుమానాలొద్దు : సిద్ధరామయ్య

కర్నాటక సీఎం మార్పుపై విపక్షాలు చేస్తున్న ప్రచారంపై క్లారిటీ ఇచ్చారు సీఎం సిద్ధరామయ్య. ఐదేళ్లు ముఖ్యమంత్రిగా తానే కొనసాగుతానని చెప్పారు. అందులో ఎవరికీ ఎలాంటి అనుమానాలు అవసరం లేదని తెలిపారు. దానికి డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. నాకు ఇంకేం ఆప్షన్ ఉంది చెప్పండి.. ఆయనకు మద్దతుగా నిలవడం తప్ప అంటూ సమాధానం ఇచ్చారు. నన్ను సీఎంగా చేయాలని ఎవరినీ కొరలేదని.. తనకు మద్దతుగా వ్యాఖ్యలు చేయమని ఎవరినీ పురామాయించలేదని చెప్పారు. అధిష్టానం నిర్ణయమే శిరోధార్యం అంటూ బదులిచ్చారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఘన విజయం సాధించింది. సిద్ధరామయ్య సీఎంగా, డీకే శివకుమార్ ఉప ముఖ్యమంత్రిగా నియమితులయ్యారు. అప్పట్లో ఇద్దరూ రెండున్నరేళ్లు చొప్పున ముఖ్యమంత్రి పదవిని పంచుకుంటారని ప్రచారం జరిగింది. ఇప్పుడు ఆ ప్రచారాన్ని తోసిపుచ్చారు.

# చైనా కొత్త బ్లాక్ అవుట్ బాంబ్

- విద్యుత్‌ను నాశనం చేయగలిగే ఆయుధం



టీపీఎన్ : చైనా రక్షణ రంగంలో దూసుకుపోతుంది. అగ్రరాజ్యంకు సవాల్ విసురుతోంది. ఇటీవల ఇరాన్ పై అమెరికా ప్రయోగించిన శక్తివంతమైన బాంబులను మించి అత్యంత ప్రమాదకరమైన మిస్సైల్ ను రెడీ చేస్తోంది. దానిపేరే బ్లాకౌట్ బాంబ్ అని నామకరణం చేసింది. ఇది ఎంత ప్రమాదకరమైనదంటే..ఒక నగరంలో విద్యుత్ సరఫరాను మొత్తం నాశనం చేయగలదు.

చైనా ఇటీవల ఒక కొత్త ప్రమాదకరమైన ఆయుధాన్ని ఆవిష్కరించింది. దీనిని 'బ్లాకౌట్ బాంబు' అని పిలుస్తారు. ఈ ఆయుధం శత్రు దేశాల విద్యుత్ సరఫరాను పూర్తిగా నిలిపివేసే సామర్థ్యాన్ని కలిగి ఉంది. ఈ బాంబును చైనా వీడియో ద్వారా ప్రపంచానికి తెలియజేసింది.

**బ్లాక్ అవుట్ బాంబు అంటే ఏమిటి?**

బ్లాక్‌అవుట్ బాంబును గ్రాఫైట్ బాంబు అని కూడా పిలుస్తారు. ఇది ప్రాణాంతకం కాని ఆయుధం. ఇది పేలుడు జరగకుండానే శత్రువు యొక్క విద్యుత్ వ్యవస్థను నిలిపివేయగలదు. ఈ బాంబు అధికవోల్టేజ్ విద్యుత్ లైన్లు, ట్రాన్స్ఫార్మర్లు , సబ్‌స్టేషన్‌లను లక్ష్యంగా చేసుకుంటుంది. ఈ బాంబు ప్రత్యేకంగా కార్బన్ ఫిలమెంట్‌లను ఉపయోగిస్తుంది. ఇవి విద్యుత్ వ్యవస్థలో షార్ట్‌సర్క్యూట్‌కు కారణమవుతాయి. మొత్తం ప్రాంతం యొక్క విద్యుత్ సరఫరాను నిలిపివేస్తాయి.ఈ బాంబు 10,000 చదరపు మీటర్ల (సుమారు 2.5 ఎకరాలు) విస్తీర్ణంలో విద్యుత్ సరఫరాను పూర్తిగా నిలిపివేస్తుంది. ఇది భవనాలకు లేదా ప్రజలకు నేరుగా హాని కలిగించదు. కానీ విద్యుత్ వ్యవస్థను లక్ష్యంగా చేసుకుంటుంది కాబట్టి దీనిని 'సాఫ్ట్ బాంబ్' అని కూడా పిలుస్తారు.

**ఈ బాంబు ఎలా పనిచేస్తుంది?**

బ్లాకౌట్ బాంబు భూమి నుండి ప్రయోగించే క్షిపణిలా పనిచేస్తుంది. భూమిపైన వాహనం నుండి ప్రయోగిస్తారు. క్షిపణి గాల్లో ఎగిరి దాని లక్ష్యాన్ని చేరుకుంటుంది. ఈ క్షిపణి తన లక్ష్యాన్ని చేరుకున్నప్పుడు 90 చిన్న సిలిండర్ లాంటి సబ్‌మ్యూనిషన్‌లను విడుదల చేస్తుంది. ఈ సిలిండర్లు నేలపై పడే ముందు గాలిలోనే పగిలిపోతాయి. అవి వేలాది సూక్ష్మ కార్బన్ తంతువులను విడుదల చేస్తాయి. ఈ దారాలను ప్రత్యేక రసాయన ప్రక్రియ ద్వారా తయారు చేస్తారు.

**షార్ట్ సర్క్యూట్**

ఈ కార్బన్ థ్రెడ్‌లు అధికవోల్టేజ్ విద్యుత్ లైన్లు , పరికరాలపై పడటం వలన షార్ట్ సర్క్యూట్ ఏర్పడుతుంది. దీని వలన విద్యుత్ వ్యవస్థ పూర్తిగా ఆగిపోతుంది. ఈ బాంబు పరిధి 290 కిలోమీటర్లు మాత్రమే. దీని వార్‌హెడ్ బరువు 490 కిలోగ్రాములు. ఇది సైనిక సబ్‌స్టేషన్లు , ఇతర ముఖ్యమైన విద్యుత్ మౌలిక సదుపాయాలను లక్ష్యంగా చేసుకోవడానికి అనువైనదిగా చేస్తుంది.

**ఈ ఆయుధం యొక్క ప్రాముఖ్యత**

ఈ బ్లాక్‌అవుట్ బాంబు ఆధునిక యుద్ధ వ్యూహాన్ని మార్చగలదు. నేటి యుద్ధంలో విద్యుత్ , కమ్యూనికేషన్ వ్యవస్థలు చాలా ముఖ్యమైనవి. ఒక దేశం యొక్క విద్యుత్ సరఫరా ఆగిపోతే, దాని సైనిక కార్యకలాపాలు, కమ్యూనికేషన్ , కమాండ్ వ్యవస్థ పూర్తిగా ప్రభావితమవుతాయి. ఈ బాంబును ఉపయోగించడం ద్వారా ఎటువంటి పెద్ద పేలుడు లేకుండా శత్రువు సైన్యాన్ని బలహీనపరచవచ్చు. చైనా ఆయుధం తైవాన్, అమెరికా, ఇతర ప్రత్యర్థి దేశాలకు పెద్ద ముప్పుగా పరిగణించబడుతోంది. ముఖ్యంగా తైవాన్‌తో పెరుగుతున్న ఉద్రిక్తత మధ్య ఈ బాంబును తైవాన్ విద్యుత్ సరఫరాను లక్ష్యంగా చేసుకోవడానికి ఉపయోగించవచ్చనే భయం ఉంది.

**ఈ టెక్నాలజీ కొత్తదా?**

చైనా దీనిని కొత్త ఆయుధం అని పిలుస్తున్నప్పటికీ, గ్రాఫైట్ బాంబుల సాంకేతికత ఇప్పటికే ఉంది. అమెరికా 1991లో గల్ఫ్ యుద్ధంలో ఇరాక్‌లో అమెరికా BLU114/B గ్రాఫైట్ బాంబును ఉపయోగించింది. దీని వలన ఇరాక్ విద్యుత్ సరఫరాలో 85% నిలిచిపోయింది. 1999లో యుగోస్లేవియాపై నాటో దాడిలో కూడా దీనిని ఉపయోగించారు.

దక్షిణ కొరియా : 2017లో ఉత్తర కొరియాపై గ్రాఫైట్ బాంబును అభివృద్ధి చేసినట్లు దక్షిణ కొరియా తెలిపింది. సోషల్ మీడియాలో కొంతమంది ఈ టెక్నాలజీ కొత్తది కాదని అంటున్నారు. చాలా దేశాలు ఇప్పటికే అలాంటి సామర్థ్యాన్ని కలిగి ఉన్నాయి. అయినప్పటికీ ఈ ఆయుధం చాలా ప్రభావవంతంగా.. ఖచ్చితమైనదిగా ఉన్నందున చైనా వాదన ఆందోళన కలిగించే విషయం.

**ప్రపంచ దేశాల అభిప్రాయాలు.**

చైనా ఈ కొత్త ఆయుధాన్ని ప్రకటించిన తర్వాత, సోషల్ మీడియాలో భిన్నమైన వాదనలు వినిపిస్తున్నాయి.కొంతమంది దీనిని ఆధునిక యుద్ధం వైపు ఒక పెద్ద అడుగుగా భావిస్తున్నారు, మరికొందరు దీనిని ప్రమాదకరమైనదిగా.. భయానకమైనదిగా పిలుస్తున్నారు. సాంకేతిక ,సైనిక రంగంలో చైనా వేగంగా అభివృద్ధి చెందుతోందని కొందరు నమ్ముతారు.

# ఇజ్రాయెల్‌తో అమెరికా ఆయుధ ఒప్పందం

- పవర్ ఫుల్ వెపన్ ఎందుకిస్తోంది?
- రూ.4300 కోట్ల విలువైన ఆయుధ ఒప్పందం

ఇజ్రాయెల్ కు అమెరికా అన్ని విధాలా అండగా నిలుస్తోంది. పశ్చిమాసియాలో తన పట్టును నిలుపుకునేందుకు ట్రంప్ తెగ ఆరాట పడుతున్నారు. అందుకు ఇజ్రాయెల్ సహకారంతో రెచ్చిపోతున్నాడు. మిత్రదేశానికి శత్రువుల బెడత ఎక్కువ కావడంతో దాన్ని నుంచి రక్షించుకునేందుకు అత్యాధునిక ఆయుధాలు సరఫరా చేయాలని నిర్ణయించుకున్నారు. అందుకే నెతన్యాహుతో బిగ్ ఆయుధ డీల్ కుదిరింది. 510 మిలియన్ల ఆయుధ ఒప్పందంలో భాగంగా ఇజ్రాయెల్‌కు JDAM కిట్‌లను సరఫరా చేయడానికి అమెరికా ఆమోదం తెలిపింది. JDAM సాధారణ బాంబులను GPSగైడెడ్ స్మార్ట్ బాంబులుగా మారుస్తుంది, ఇవి ఖచ్చితమైన దాడులను నిర్వహిస్తాయి. ఈ ఒప్పందం ఇజ్రాయెల్ సైనిక బలాన్ని పెంచుతుంది. కానీ గాజాలో మానవ హక్కుల ఆందోళనలను కూడా లేవనెత్తుతోంది. ఇది మధ్య ప్రాచ్యంలో అధికార సమతుల్యతను ప్రభావితం చేస్తుంది.

ఇజ్రాయెల్‌తో 510 మిలియన్ డాలర్ల (సుమారు రూ. 4300 కోట్లు) విలువైన ఆయుధ ఒప్పందానికి అమెరికా గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇందులో జాయింట్ డైరెక్ట్ అటాక్ మ్యూనిషన్ (JDAM) కిట్‌లు కూడా ఉన్నాయి. మధ్యప్రాచ్యంలో కొనసాగుతున్న ఉద్రిక్తతలు... ఇజ్రాయెల్ సైనిక అవసరాల మధ్య ఈ ఒప్పందం చాలా ప్రాధాన్యం సంతరించుకుంది.

**JDAM ఆయుధం అంటే ఏమిటి?**

జాయింట్ డైరెక్ట్ అటాక్ మ్యూనిషన్ (JDAM) అనేది ఒక మార్గదర్శక కిట్. ఇది సాధారణ బాంబులను లక్ష్యాలను ఖచ్చితంగా ఛేదించే స్మార్ట్ బాంబులుగా మారుస్తుంది. ఈ సాంకేతికతను అమెరికా బోయింగ్ కంపెనీ అభివృద్ధి చేసింది. ఇది ఆయుధ ప్రపంచంలో విప్లవాత్మకంగా పరిగణించబడుతుంది.

**JDAM ఎలా పని చేస్తుంది?**

JDAM కిట్ ప్రామాణిక బాంబులపై (500 పౌండ్ల MK82 లేదా 2000పౌండ్ల BLU109 వంటివి) అమర్చబడి ఉంటుంది. ఇది GPS , ఇనర్షియల్ నావిగేషన్ సిస్టమ్ (INS)లను కలిగి ఉంటుంది, ఇది బాంబును లక్ష్యానికి ఖచ్చితంగా మార్గనిర్దేశం చేస్తుంది. వాతావరణ పరిస్థితులు లేదా దూరంతో సంబంధం లేకుండా బాంబు లక్ష్యాన్ని ఖచ్చితంగా ఛేదించడానికి ఈ కిట్ వీలు కల్పిస్తుంది. ఇది 510 మీటర్ల ఖచ్చితత్వంతో లక్ష్యాన్ని నాశనం చేయగలదు ఖర్చుతో కూడుకున్నది: JDAM కిట్లు ఖరీదైన క్షిపణి వ్యవస్థల కంటే చౌకైనవి. కానీ అంతే ప్రభావవంతంగా ఉంటాయి. ఒక కిట్ ధర దాదాపు $20,000 నుండి $30,000 (రూ. 17 లక్షల నుండి రూ. 25 లక్షలు). దీనిని యుద్ధ విమానాల నుండి (F 15, F16 వంటివి) ప్రయోగిస్తారు. దీని వలన ఈ బాంబులు బంకర్లను, సైనిక స్థావరాలను లేదా ఇతర ముఖ్యమైన లక్ష్యాలను నాశనం చేయడానికి అనుకూలంగా ఉంటాయి.

**ఇజ్రాయెల్ సైనిక బలం పెరుగుదల**

JDAM కిట్‌లు ఇజ్రాయెల్ వైమానిక దళం మరింత బలోపేతంగా మారుతుంది. ఈ కిట్‌లు హమాస్, హిజ్బుల్లా లేదా ఇతర ప్రాంతీయ ముప్పులపై అయినా, ఖచ్చితమైన న దాడులను ప్రారంభించే సామర్థ్యాన్ని ఇజ్రాయెల్ సొంతం చేసుకుంది. ఇవి బ్రహ్మోస్ కంటే ప్రాణాంతకం, 9200 KMPH వేగం, 8000 కి.మీ పరిధి... రాడార్లను కూడా ఢీకొడుతుంది. భారతదేశం K6 క్షిపణిని పరీక్షించబోతోంది.

**అమెరికా-ఇజ్రాయెల్ సంబంధాలు**

అమెరికా ఇజ్రాయెల్‌కు అతిపెద్ద ఆయుధ సరఫరాదారు. 20192023 మధ్య దాని ఆయుధాలలో 69% సరఫరా చేస్తుంది. ఈ ఒప్పందం రెండు దేశాల మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేస్తుంది. ఇజ్రాయెల్ తన పొరుగువారి కంటే సైనిక సాంకేతికతలో ముందంజలో ఉండాలనేది అమెరికా విధానం.

**మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలు**

ఇజ్రాయెల్ గాజా, లెబనాన్ , సిరియాలో హమాస్, హిజ్బుల్లా ఇతర గ్రూపులపై సైనిక కార్యకలాపాలను నిర్వహిస్తోంది. అక్టోబర్ 7, 2023న హమాస్ దాడి తర్వాత ఇజ్రాయెల్ US నుండి $17.9 బిలియన్లకు పైగా సైనిక సహాయాన్ని పొందింది. ఇరాన్ దాని మద్దతు ఉన్న గ్రూపులతో పెరుగుతున్న ఉద్రిక్తతల మధ్య, ఈ ఒప్పందం ఇజ్రాయెల్‌కు మరింత శక్తిని ఇస్తుంది. కానీ ప్రాంతీయ యుద్ధం జరిగే అవకాశాన్ని కూడా పెంచుతుంది.

# జిన్ పింగ్ శకం ముగిసినట్టేనా..?

- రెండు వారాల నుంచి అదృశ్యం
- అసలు చైనాలో ఏం జరుగుతోంది?
- అధికార మార్పు ఖాయమేనా?

ప్రస్తుత రోజుల్లో ప్రపంచం నిప్పులు చెరుగుతున్న జ్యోతిలా ఉంది. దానిలో ఏదో ఒకటి నిరంతరం మండుతూనే ఉంటుంది. కొన్ని దేశాలు పోరాటంలో బిజీగా ఉన్నాయి. మరికొన్ని వీటన్నిటి నుంచి తప్పించుకోవడానికి సైనిక బలాన్ని పెంచుకుంటున్నాయి. కానీ వీటన్నిటి మధ్య సూపర్ పవర్‌గా ఎదగడానికి దగ్గరగా ఉన్నట్లు కనిపిస్తున్న చైనా మౌనంగా ఉంది. ముఖ్యంగా డ్రాగన్ దేశం అధ్యక్షుడు జి జిన్‌పింగ్ దాదాపు రెండు వారాల నుంచి కనిపించడం లేదు. చైనాలో అధికారం మారుతుందా అనే సంకేతాలు కనిపిస్తున్నాయి. బీజింగ్ లో రాజకీయాలు హీటెక్కుతున్నాయి. చైనా ప్రెసిడెంట్ జీ జిన్ పింగ్ (72) అదృశ్యం కలకలం రేపుతోంది. మే 21 నుంచి జూన్ 5 వరకు ఆయన ప్రజలకు కనిపించలేదు. దీంతో ఎన్నో ప్రశ్నలు..మరెన్నో అనుమానాలు తలెత్తుతున్నాయి. ఈ పరిణామం చైనా కమ్యూనిస్టు పార్టీలో నాయకత్వ మార్పు సంకేతంగా కనిపిస్తోంది. 2013 ప్రారంభంలో చైనా కమ్యూనిస్ట్ పార్టీ పగ్గాలు చేపట్టినప్పటి నుండి జిన్‌పింగ్ నిరంతరం చర్చల్లో ఉన్నారు. కొన్నిసార్లు ఆయన తన అధికారాన్ని నిలబెట్టుకునేందుకు పొరుగు గిల్లిగజ్జాలు పెట్టుకున్నారు. సమస్యలను డైవర్ట్ చేయడంలో జిన్ పింగ్ దిట్ట. పాలిటిక్స్ ను అవపోసన పట్టారు. ప్రపంచంలోనే చైనాను సూపర్ పవర్ గా మారుస్తామని చెప్పినా దేశాధినేత కనిపించకపోవడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. దశాబ్ద కాలం తర్వాత తొలిసారిగా జిన్‌పింగ్ అదృశ్యమయ్యారు. మధ్యలో కొన్ని సార్లు వచ్చారు .కానీ ఏ బహిరంగ కార్యక్రమంలోనూ ఆయన కనిపించలేదు. ఈనెల 6, 7 తేదీల్లో బ్రెజిల్‌లో జరగనున్న బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశానికి కూడా ఆయన గైర్హాజరు అవుతారని భావిస్తున్నారు. జిన్ పింగ్ అధికారంలోకి వచ్చాక బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సుకు హాజరుకాకపోవడం ఇదే తొలిసారి అవుతుంది. మే నెల చివరి నుంచి జిన్‌పింగ్ ఉనికి పూర్తిగా కనుమరుగైంది. ఆయన ఏ కవాతుకు హాజరు కావడం లేదు. ఆయన ఎలాంటి ప్రసంగం చేయడం లేదు. ప్రభుత్వ మీడియాలో కూడా కనిపించడం లేదు. జిన్‌పింగ్ కనిపించకపోవడం అసాధారణమైనది ఏమీ లేదని ఉన్నత నిఘా అధికారులు చెబుతున్నారు. చైనాలో రాజకీయాలు ఎప్పుడు ఎలా మారతాయో తెలియదు. అక్కడ పెద్ద నాయకులను పక్కన పెట్టే చరిత్ర ఉంది. పత్రాలపై పేర్లు ఉండవచ్చు, కానీ అధికారం రహస్యంగా వేరే చోటికి వెళుతుంది.

**మధ్యలో ఒక చిన్న ప్రదర్శన కనిపించింది**

జిన్ పింగ్ జూన్‌లో రెండు వారాలు అదృశ్యమయారు. తర్వాత బెలారస్ అధ్యక్షుడితో కనిపించారు. కానీ ఈ సమావేశం చాలా తక్కువ సమయం మాత్రమే. ఆ సమయంలో జిన్‌పింగ్ అలసిపోయి అనారోగ్యంతో ఉన్నట్లు కనిపించారని, ఆయన దృష్టి మరెక్కడో ఉన్నట్లు బెలారస్ మీడియా స్వయంగా అంగీకరించింది. కొంతకాలం క్రితం చైనా మీడియాలో ఆయన బిరుదును తొలగించి, ఆయనను నేరుగా పేరుతో సంబోధించారు. ఈ తప్పును తరువాత సరిదిద్దినప్పటికీ అనుమానం తలెత్తింది. ఎక్కడో ఏదో తప్పు జరిగిందని ప్రజలు గమనించడం ప్రారంభించారు.

**అధికార బదిలీ ఎక్కడ జరుగుతోంది?**

అధికారం జి జిన్‌పింగ్ చేతిలో ఉన్నప్పటికీ, నిర్ణయాలు తీసుకునే అధికారం వేరే చోటికి వెళుతుందనే బలమైన ఊహాగానాలు ఉన్నాయి. సెంట్రల్ మిలిటరీ కమిషన్ మొదటి వైస్ చైర్మన్ జనరల్ జాంగ్ యూక్సియా పేరు ఒకటి తెరపైకి వస్తుంది. ఆయన మద్దతుదారులు జి జిన్‌పింగ్ కంటే తక్కువ కఠినంగా ఉంటారని నమ్ముతారు. గతంలో జి జిన్‌పింగ్ తన ఆలోచనలను పాఠశాలకళాశాల పుస్తకాలలో చేర్చారని, తద్వారా పిల్లలలో కూడా అదే భావజాలాన్ని నాటారని ఆరోపించారు. ప్రస్తుతం అధ్యక్షుడిగా మరో పేరు ప్రచారంలో ఉంది. మాజీ టెక్నోక్రాట్ అయిన వాంగ్ యాంగ్‌ను కూడా జి జిన్‌పింగ్ స్థానంలో ముందుకు తీసుకురావచ్చని వార్తలు వస్తున్నాయి. ఇటీవలే యాంగ్‌ను కమ్యూనిస్ట్ పార్టీ అధిపతిగా నియమించినట్లు సమాచారం. ఈ యువ నాయకుడు చైనాలో సంస్కరణలు తీసుకువస్తారనే నమ్ముతున్నారు.ప్రస్తుత పోటీ ప్రపంచంలో అమెరికాను ఢీకొట్టే సమర్థవంతమైన నాయకుడు చైనాకు చాలా అవసరం.

**ఎప్పుడైనా అధ్యక్షుడు అకస్మాత్తుగా అదృశ్యమయ్యారా?**

అవును. చాలా సార్లు పెద్ద నాయకులు అకస్మాత్తుగా కనిపించడం మానేస్తారు. ఇందులో ఒక పేరు హు జింటావో, ఆయన జి జిన్‌పింగ్ కంటే ముందు అధ్యక్షుడు. 2022 సంవత్సరంలో, కమ్యూనిస్ట్ పార్టీ 20వ వేడుకలు జరుపుకుంటున్నప్పుడు, హును అకస్మాత్తుగా అందరి ముందు హాలు నుండి బయటకు తీసుకెళ్లారు. జిన్‌పింగ్ పక్కన కూర్చున్నాడు. కానీ అతను అడ్డుకునే ప్రయత్నం చేయలేదు. ఇదంతా సీసీ కెమెరాల్లో రికార్డైంది. మాజీ అధ్యక్షుడిని తీసుకెళ్లేటప్పుడు ఆయన ఆరోగ్యం క్షీణించిందని తప్ప మరే వివరణ ఇవ్వలేదు.

గత రెండు మూడు సంవత్సరాలలో రక్షణ మంత్రి, విదేశాంగ మంత్రి , సైనిక అధికారులు కూడా బీజింగ్‌లో అదృశ్యమయ్యారు. తరువాత వారిపై అవినీతి లేదా ద్రోహం ఆరోపణలు ఉన్నాయని ప్రజలను నమ్మించారు. కానీ పార్టీ ఎటువంటి బహిరంగ దర్యాప్తు లేదా విచారణ జరిపినట్టు చూపించలేదు. చైనాలో ప్రతిదీ రహస్యంగా కొనసాగింది.

అలీబాబా కంపెనీ వ్యవస్థాపకుడు జాక్ మా కూడా ప్రభుత్వాన్ని విమర్శించిన తర్వాత కొంతకాలం కనిపించకుండా పోయాడు. చాలా నెలల తర్వాత తిరిగి వచ్చినప్పుడు.. అతను ఎక్కువగా మౌనంగా ఉండేవాడు. చైనాలో, పెద్ద నాయకులను లేదా అధికారులను నిశ్శబ్దంగా పక్కన పెట్టవచ్చు. ప్రజల ఆమోదంతో సంబంధం ఉండదు.

**అధ్యక్షుడు ఎలా ఎన్నికవుతారు?**

అధ్యక్షుడు రెండు పర్యాయాలకు మించి పదవిలో ఉండకూడదనే నియమం ఉండేది. కానీ కోవిడ్ రాకముందు, జిన్‌పింగ్ దానిని మార్చారు. రాజ్యాంగంలో వచ్చిన మార్పు నుంచి ఆయన జీవితాంతం పాలించాలని కోరుకున్నారని స్పష్టమైంది. రష్యాలో వ్లాదిమిర్ పుతిన్ కూడా రాజ్యాంగాన్ని మార్చడం ద్వారా శాశ్వత పదవి కోసం నిబంధన చేసినట్లే. ఇక్కడ ఏమైనప్పటికీ అధ్యక్షుడి ఎన్నికలో ప్రజలు నేరుగా పాల్గొన్నారు.




# సూచీలను పడేసిన ప్రతికూల సంకేతాలు..!



మూర్తి నాయుడు పాదం
నిఫ్ట్ మాస్టర్
స్టాక్ మార్కెట్ అనలిస్ట్
+91 988 555 9709

దేశీయ స్టాక్ మార్కెట్లు బుధవారం నష్టపోయాయి. గ్లోబల్ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలు రాకపోవడం, మళ్లీ డాలర్ కాస్త పుంజుకోవడం, అమెరికా ఎకానమీ డేటా నిరాశాజనకంగా ఉండటం, లాభాల స్వీకరణ, ముడిచమురు ధరలు పెరగడమే ఇందుకు కారణాలు. పీఎస్‌యూ బ్యాంకింగ్, ఫైనాన్స్ కంపెనీల షేర్లు పతనమవ్వడంతో బెంచ్‌మార్క్ సూచీలు భారీగా పతనమయ్యాయి. మెటల్స్, హెల్త్‌కేర్ షేర్లు రాణించడంతో ఆఖర్లో కాస్త పుంజుకొని సగం మేర నష్టాలను పూడ్చుకున్నాయి. మరో వారం రోజుల్లో అమెరికా, భారత్ వాణిజ్య ఒప్పందపై స్పష్టత రావాల్సి ఉండటం, ట్రంప్ టారిఫ్స్ నేపథ్యంలో సూచీలు ఒత్తిడికి లోనయ్యే అవకాశం కనిపిస్తోంది. మొత్తంగా నిఫ్టీ 88, సెన్సెక్స్ 287 పాయింట్ల మేర తగ్గాయి. క్రితం సెషన్లో 83,697 వద్ద ముగిసిన బీఎస్ఈ సెన్సెక్స్ బుధవారం 83,790 వద్ద మొదలైంది. 83,150 వద్ద ఇంట్రాడే కనిష్ఠాన్ని తాకింది. 83,935 వద్ద ఇంట్రాడే గరిష్ఠాన్ని అందుకుంది. చివరికి 287 పాయింట్ల లాభంతో 83,409 వద్ద ముగిసింది. 25,588 వద్ద ఓపెనైన ఎన్ఎస్ఈ నిఫ్టీ 25,378 వద్ద కనిష్ఠ, 25,608 వద్ద గరిష్ఠ స్థాయుల్ని అందుకుంది. మొత్తంగా 88 పాయింట్లు ఎరుపెక్కి 25,453 వద్ద క్లోజైంది. నిఫ్టీ బ్యాంకు 460 పాయింట్లు తగ్గి 56,999 వద్ద స్థిరపడింది. నిఫ్టీ50లో 23 కంపెనీలు లాభపడగా 27 నష్టపోయాయి. టాటా స్టీల్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, ఏసియన్ పెయింట్స్, అల్ట్రాటెక్ సిమెంటు, మారుతీ టాప్ గెయినర్స్. శ్రీరామ్ ఫైనాన్స్, హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్, ఇండస్ఇండ్ బ్యాంకు, బజాజ్ ఫిన్‌సర్వ్, ఎల్‌టీ అత్యధికంగా నష్టపోయాయి. నేడు మెటల్, కన్జూమర్ డ్యూరబుల్స్, హెల్త్‌కేర్, ఆటో, ఫార్మా, టెలికం సూచీలు రాణించాయి. రియాల్టి, ఫైనాన్స్, పీఎస్‌యూ బ్యాంకు, ప్రైవేటు బ్యాంకు, మీడియా, చమురు, ఎఫ్ఎంసీజీ సూచీలు ఎరుపెక్కాయి. ఎన్ఎస్ఈలో నేడు మార్కెట్ బ్రెడ్త్ సెల్లర్లకు అనుకూలంగా మారింది. 3028 స్టాక్స్ ట్రేడవ్వగా 1205 లాభపడ్డాయి. 1723 నష్టపోయాయి. 52వారాల గరిష్ఠాన్ని 65 షేర్లు, 52వారాల కనిష్ఠాన్ని 36 షేర్లు తాకాయి. అప్పర్ సర్క్యూటును 93, లోయర్ సర్క్యూటును 48 చేరాయి. డాలరుతో పోలిస్తే రూపాయి 18 పైసలు బలహీనపడి 85.71 వద్ద స్థిరపడింది. ఆఫ్రికన్ రైల్వే కంపెనీ నుంచి రయిట్స్ 3.6 మిలియన్ డాలర్ల విలువైన ఆర్డర్ పొందింది. జీఎస్‌టీ నుంచి ట్రైడెంటుకు షోకాజ్ నోటీసు వచ్చింది. రూ.1966 టార్గెట్ ధరతో ఏసియన్ పెయింట్స్‌కు సీఎల్ఎస్ఏ అండర్ పర్ఫామ్ రేటింగ్ ఇచ్చింది. 2025 జూన్‌లో హ్యూందాయ్ క్రెటా బెస్ట్ సెల్లింగ్ కారుగా నిలిచింది. రూ.3765 టార్గెట్ ధరతో హీరోమోటోకు మోర్గాన్ స్టాన్లీ అండర్ వెయిట్ రేటింగ్ ఇచ్చింది. నిఫ్టీ రియాల్టీ సూచీ వరుసగా ఐదో సెషన్లోనూ నష్టపోయింది. రేమండ్, ప్రెస్టీజ్, డీఎల్ఎఫ్ వంటి కంపెనీలు 5 శాతం మేర పతనమయ్యాయి. ఎన్టీపీసీలో 25లక్షల షేర్లు చేతులు మారాయి. ఐదేళ్లలో రిటైల్ ఫోలియోల్లో ఈటీఎఫ్‌ల ఫోలియోలు 11 రెట్లు పెరిగాయని జెరోదా అంచనా వేసింది. రూ.722 టార్గెట్ ధరతో ఇండస్ ఇండ్ బ్యాంకుకు గోల్డ్‌మన్ సాచెస్‌కు సెల్ రేటింగ్ ఇచ్చింది. ఏఎఫ్‌కే గేమింగులో నజారా టెక్ 92.30% వాటాను తీసుకుంది. రూ.550 టార్గెట్ ధరతో భారత్ ఎలక్ట్రానిక్స్‌కు ఏసియన్ మార్కెట్స్ సెక్యూరిటీస్ బయ్ రేటింగ్ ఇచ్చింది.




## 3. 3 మిలియన్ షేర్ల విక్రయం

జెఫ్ బెజోస్ తన కంపెనీ షేర్లను భారీగా విక్రయించారు. దాదాపు 737 మిలియన్ అమెరికన్ డాలర్ల విలువ చేసే 3. 3 మిలియన్ షేర్లను విక్రయించారు. ఈ షేర్లు అమ్మేసినా బెజోస్ కు ఇంకా 905 మిలియన్ల అమెజాన్ షేర్లు మిగిలే ఉన్నాయి. ఈ అమ్మకాల వచ్చే నగదును అంతరిక్ష సంస్థ బ్లూ ఆరిజన్, అలాగే ఫిలాంత్రోపిక్ ప్రాజెక్టులకు వినియోగించే ఛాన్స్ ఉంది. భారీగా షేర్లు విక్రయించినప్పటికీ బెజోస్ 214.4 బిలియన్ డాలర్ల నికర సంపత్తితో ప్రపంచంలో మూడో అత్యంత ధనవంతుడిగా కొనసాగుతున్నారు.




## ఉబర్, ఓలా, ర్యాపిడో ప్రయాణికులకు షాక్
### పీక్ అవర్స్‌లో ఛార్జీలు 200 శాతం

ఉబర్, ఓలా, ర్యాపిడో వంటి సంస్థలకు కేంద్రం గుడ్ న్యూస్ చెప్పింది. పీక్స్ అవర్స్ లో రేట్స్ పెంచుకునేందుకు అనుమతి ఇచ్చింది. రద్దీ నామమాత్రంగా ఉన్న సమయంలో బేస్ ఛార్జీల్లో సగం సర్ ఛార్జీ కింద పెంచుకునేందుకు...రష్ ఎక్కువగా ఉంటే 200శాతం పెంచుకునేందుకు అవకాశం కల్పించింది. ఈ మేరకు మార్గదర్శకాలు జారీ చేసింది. అయితే కొన్ని షరతులు విధించింది. మూడు కిలోమీటర్ల లోపు ప్రయాణానికి మాత్రం ఎలాంటి అదనపు ఛార్జీలు విధించకూడదని కండీషన్ పెట్టింది. ఒకవేళ ఎలాంటి రీజన్ లేకుండా డ్రైవర్ రైడ్ క్యాన్సిల్ చేస్తే అదనపు ఛార్జీలు విధించకూడదని కండీషన్ పెట్టింది.

# హెచ్‌డీబీ లిస్టింగ్ అదుర్స్..!

హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ అనుబంధ సంస్థ హెచ్‌డీబీ ఫైనాన్షియల్ సర్వీసెస్ బుధవారం బీఎస్ఈ, ఎన్ఎస్ఈ స్టాక్ ఎక్స్ఛేంజీల్లో నమోదైంది. ఐపీవో ధర రూ.740తో పోలిస్తే 12.84% ప్రీమియంతో రూ.835 వద్ద లిస్టయ్యాయి. రోజు ముగిసే సమయానికి షేర్ ధర 0.71% పెరిగి రూ.840.90కి చేరుకుంది. ఇంట్రాడేలో రూ.849.85 వద్ద గరిష్ఠ స్థాయిని తాకింది. ఈ లిస్టింగ్‌తో సంస్థ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.70,198 కోట్లకు చేరుకుంది. భారతదేశంలోని NBFCలలో 8వ అతిపెద్ద సంస్థగా అవతరించింది.

**ఐపీవో వివరాలు :**

హెచ్‌డీబీ ఫైనాన్షియల్ సర్వీసెస్ ఐపీవో విలువ $1.5 బిలియన్లు. రూ.700740 ధరల శ్రేణిలో షేర్లు జారీ చేశారు. ఈ ఐపీవోకు 16.69 రెట్ల స్పందన లభించింది. ఇందులో క్యూఐబీ విభాగం 55 రెట్లు, రిటైల్ విభాగం 1.4 రెట్లు బిడ్స్‌ను ఆకర్షించింది. మొత్తం బిడ్స్ రూ.1.61 లక్ష కోట్ల ($19 బిలియన్) విలువైనవి. యాంకర్ ఇన్వెస్టర్లు రూ.3,369 కోట్లు సమీకరించారు.

**ఫైనాన్షియల్ పర్ఫామెన్స్ :**




FY25లో సంస్థ రూ.16,300 కోట్ల ఆదాయం, రూ.2,175 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. ఆస్తుల నిర్వహణ (AUM) లక్ష కోట్ల రూపాయాలు దాటేసింది. తదుపరి మూడేళ్లలో 20% CAGRతో వృద్ధి చెందే అవకాశం ఉంది. FY28 నాటికి ROA 2.7%, ROE 17%కి చేరుకుంటుందని అంచనా. సంస్థ కస్టమర్ బేస్ 19 మిలియన్లకు పైగా ఉంది. 70% బ్రాంచ్‌లు టైర్4 పట్టణాల్లో దిగువమధ్యతరగతి వర్గాలను లక్ష్యంగా చేసుకున్నాయి.




## మైక్రోసాఫ్ట్‌లో ఉద్యోగాల కోత

ఏఐ అందుబాటులోకి వచ్చాక ఐటీ ఉద్యోగులకు కష్టాలు ప్రారంభమయ్యాయి. టెక్ దిగ్గజ సంస్థ మైక్రోసాఫ్ట్ మరోసారి ఉద్యోగాల్లో కోతలు పెట్టేందుకు రెడీ అయినట్టు తెలుస్తోంది. ఈసారి వేలాది మందికి లే ఆఫ్ నోటీసులు జారీ చేస్తున్నట్టు సమాచారం. దాదాపు 9వేల మందికి లే ఆఫ్ లు ఇచ్చినట్టు సమాచారం. ఈ ఏడాది మే నెలలో 6 వేల మందికి లే ఆఫ్ లు ప్రకటించింది. తాజాగా మరోసారి భారీ సంఖ్యలో ఉద్యోగులను తొలగించేందుకు రెడీ అవుతోంది.

# త్వరలో మిడిల్ క్లాస్‌కు కేంద్రం గుడ్‌న్యూస్!

కేంద్ర ప్రభుత్వం మధ్యతరగతి, అల్ప ఆదాయ వర్గాలకు ఊరట కల్పించేందుకు సిద్ధమైనట్టు తెలిసింది. వస్తు, సేవల పన్ను జీఎస్టీ స్లాబ్‌లలో సవరణలు చేయాలని యోచిస్తోంది. రోజువారీ వినియోగ వస్తువులైన చెప్పులు, టూత్‌పేస్ట్, సబ్బులు, షాంపూలు, గోధుమ పిండి, బియ్యం, బీన్స్, కిచెన్ ఉపకరణాలు, ఎలక్ట్రిక్ ఐరన్‌లు, గీజర్‌లు, కొన్ని రకాల వాషింగ్ మెషీన్‌లు, సైకిళ్లు, రెడీమేడ్ దుస్తులు, వ్యవసాయ ఉపకరణాలు, వ్యాక్సిన్‌ల వంటి వస్తువులపై GST రేట్లను తగ్గించే అవకాశం ఉందని ఎన్డీటీవీ ఓ కథనం ప్రచురించింది. ప్రస్తుతం ఈ వస్తువుల్లో కొన్నింటిపై 12% నుంచి 28% వరకు పన్ను విధిస్తున్నారు. ఉపశమనం కల్పించేందుకు మొత్తం 12% స్లాబును తొలగించడం లేదా వస్తువులను 5% స్లాబ్‌లో చేర్చొచ్చని సమాచారం. జులై చివరిలో జరిగే 56వ జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో ఈ సవరణలపై చర్చించే అవకాశముంది. ఒకవేళ ఇందుకు కౌన్సిల్ ఆమోదిస్తే ప్రభుత్వ ఖజానాపై సుమారు 50,000 కోట్ల రూపాయల ఆర్థిక భారం పడొచ్చని అంచనా. దాన్ని భరించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిసింది. ఈ ఏడాది బడ్జెట్‌లో ఆదాయపు పన్ను రిబేట్‌ను 12 లక్షల రూపాయల వరకు పెంచిన తర్వాత మధ్యతరగతి వర్గానికి ఇది రెండవ పన్ను ఉపశమనం కానుంది. ఈ సవరణలు వినియోగదారులకు ఆర్థిక ఉపశమనం కల్పించడమే కాకుండా ఆయా వస్తువుల డిమాండ్‌ను పెంచుతాయి. దీంతో ఆర్థిక వ్యవస్థ మరింత పుంజుకుంటుందని నిపుణులు అంచనా వేస్తున్నాయి. ఏదేమైనా ఈ ప్రతిపాదనలు ఇంకా చర్చల దశలో ఉన్నాయి. GST కౌన్సిల్‌లో ఏకాభిప్రాయం తర్వాతే అమలులోకి వస్తాయి.






## నేడు యూపీఐ సేవలు బంద్..?

బ్యాంకు ఖాతాదారులకు షాక్. నేడు, రేపు యూపీఐ సేవలు పనిచేయవని..ఓ న్యూస్ సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. ఈ రెండు రోజులపాటు యూపీఐ కాకుండా ఇతర సేవలు వాడుకోవాలని సూచనలు చేస్తున్నారు కొందరు. అయితే ఇది కేవలం HDFC ఖాతాదారులకు మాత్రమే. ఇతర బ్యాంకు వినియోగదారులకు కాదని తెలుస్తోంది. రేపే డెబిట్ కార్డు అధారిత లావాదేవీలు, నెట్ బ్యాంకింగ్ సేవలు ప్రభావితం అవుతాయని తెలుస్తోంది.




# 39 ఏళ్ల బౌలింగ్ రికార్డు బ్రేక్ అవ్వనుందా?

ఇంగ్లాండ్, టీమిండియా టీమ్స్ మధ్య రెండో టెస్టుకు వేదిక బర్మింగ్‌హామ్‌లోని ఎడ్జ్‌బాస్టన్ మైదానం. ఇప్పటి వరకు టీమిండియా ఇక్కడ ఒక్క టెస్టులోనూ గెలవలేదు. అసలే తొలి టెస్టు ఓటమితో ఇబ్బంది పడుతోన్న భారత్ కు పెద్ద సవాల్ తప్పదు. ఇలాంటి కఠినమైన పిచ్ పైనా సెంచరీలు చేసిన ఇండియన్ బ్యాటర్లూ ఉన్నారు. వారిలో ఇద్దరు రిటైర్ మెంట్ కాగా.. మరో ఇద్దరు ప్రస్తుత టీమ్ లో సభ్యులుగా ఉన్నారు. అలాగే ఇక్కడ అత్యధిక వికెట్లు తీసిన భారత బౌలర్ గా దాదాపు 30 ఏళ్ల నుంచి ఒకరి పేరే కొనసాగుతుండటం గమనార్హం. మరి ఆ ఆటగాళ్లు ఎవరు? ఆ రికార్డులు ఏంటో క్లియర్ గా తెలుసుకుందాం. ఎడ్జ్‌బాస్టన్ వేదికగా టెస్టు చరిత్రలో 86 సెంచరీలు నమోదు కాగా.. భారత్ నుంచి నలుగురు మాత్రమే ఉన్నారు. ఇంగ్లాండ్‌పై క్రికెట్ దిగ్గజం సచిన్ తెందుల్కర్, విరాట్ కోహ్లీ, రిషభ్ పంత్, రవీంద్ర జడేజా ఈ లిస్ట్ లో ఉన్నారు. సచిన్, విరాట్ కోహ్లీ, రిషభ్ పంత్, రవీంద్ర జడేజా శతకాలు చేశారు. అయితే అన్ని మ్యాచుల్లోనూ భారత్ ఓడిపోయింది. కోహ్లీ రికార్డును అధిగమించాలంటే గత టెస్టులో సెంచరీలు చేసిన బ్యాటర్లకు ఛాన్స్ ఉంది. ఎడ్జ్‌బాస్టన్‌లో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్ ఇంగ్లాండ్‌కు చెందిన జేమ్స్ అండర్సన్. ఈ మాజీ పేసర్ 14 మ్యాచుల్లో 52 వికెట్లు తీశాడు. ఇక భారత్ తరఫున ఎవరంటే.. చేతన్ శర్మ అనే మాజీ బౌలర్ 10 వికెట్లతో టాపర్‌గా కొనసాగుతున్నాడు. ఇవన్నీ ఒకే మ్యాచ్‌లో తీయడం ఇప్పటికీ భారత్ తరఫున ఘనతే. దాదాపు 39 ఏళ్ల కిందట.. 1986లో.. ఈ మ్యాచ్‌లో ఆ రికార్డును చెరిపేయడం చాలా కష్టమే. బుమ్రా ఫైనల్ టీమ్ లో ఉంటే ఏమైనా సాధ్యపడేదేమో కానీ.. అతడు ఆడటంపై అనుమానాల నేపథ్యంలో ఇతర బౌలర్లపై ఆశలు తక్కువే. ఎడ్జ్‌బాస్టన్‌లో 56 టెస్టులు జరిగాయి. ఇందులో ఫస్ట్ బ్యాటింగ్ చేసిన టీమ్ 29 మ్యాచుల్లో గెలిచింది. మరో 12 సార్లు మొదట బౌలింగ్ తీసుకున్న టీమ్ విజయం సాధించింది. 15 మ్యాచులు డ్రాగా క్లోజ్ అయ్యాయి. ఇక్కడ అత్యధిక స్కోరు ఇంగ్లాండ్‌దే. భారత్‌పై 2011లో 710/7 స్కోరు చేసింది. ఇక పాకిస్థాన్ అత్యల్ప స్కోరు చేసిన టీమ్ గా నిలిచింది. 2010లో ఇంగ్లాండ్‌పై 72 పరుగులకే పరిమితమైంది. ఎడ్జ్‌బాస్టన్‌లో అత్యధికంగా భారత్ 416 పరుగులు చేసింది. లేటెస్ట్ గా అంటే 2018లో 274 పరుగులు చేసింది. రెండు మ్యాచుల్లోనూ టీమిండియా ఓడింది. ఈ మైదానంలో భారత్‌పై ఇంగ్లాండ్ 2022లో 378 పరుగులను ఛేదించి విజయం సాధించింది. జానీ బెయిర్ స్టో సెంచరీతో తన టీమ్ ను గెలిపించాడు.

# దూసుకుపోతున్న రిషబ్ పంత్

టెస్ట్ ర్యాంకింగ్స్ లో టీమిండియా వికెట్ కీపర్ బ్యాటర్ రిషబ్ పంత్ శరవేగంగా దూసుకుపోతున్నాడు. లేటెస్ట్ గా రిలీజ్ చేసిన ర్యాంకింగ్స్ లో ఓ స్థానం మెరుగుపర్చుకొని ఆరో ప్లేస్ కు ఎదిగారు. లీడ్స్ వేదికగా ఇంగ్లండ్‌తో జరిగిన ఫస్ట్ టెస్ట్‌లో ట్విన్ సెంచరీస్ చేసిన పంత్.. లాస్ట్ వీక్ ర్యాంకింగ్స్ లోనే ఓ ర్యాంక్ మెరుగుపర్చుకున్నాడు. తాజాగా మరో ర్యాంక్ మెరుగుపర్చుకొని తన కెరీర్ అత్యుత్తమ ఐదో ర్యాంక్ కు అత్యంత చేరువయ్యాడు. లాస్ట్ వీక్ ర్యాంకింగ్స్ తర్వాత పంత్ సరికొత్త చరిత్ర సృష్టించాడు. ఐసీసీ టెస్ట్ ర్యాంకింగ్స్ లో 800 రేటింగ్ పాయింట్లు సాధించిన ఫస్ట్ భారత వికెట్ కీపర్ బ్యాటర్‌గా రికార్డు క్రియేట్ చేశారు. భారత టెస్ట్ క్రికెట్ చరిత్రలో ఇప్పటివరకు ఏ వికెట్‌కీపర్ బ్యాటర్ 800 రేటింగ్ పాయింట్లు సాధించలేదు. టీమిండియా దిగ్గజ వికెట్‌కీపర్ బ్యాటర్ మహేంద్ర సింగ్ ధోనికి కూడా ఇది సాధ్యపడలేదు. ప్రస్తుతం పంత్ 801 రేటింగ్ పాయింట్లు ఖాతాలో కలిగి ఉన్నాడు. ఇంగ్లండ్ తో ప్రస్తుతం జరుగుతున్న ఐదు మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్‌లో పంత్ ఇదే జోరును కొనసాగిస్తే.. త్వరలోనే నంబర్ వన్ టెస్ట్ బ్యాటర్ అయ్యే అవకాశం ఉంది. ప్రస్తుతం టాప్ ర్యాంక్‌లో ఉన్న జో రూట్‌కు పంత్‌కు 88 రేటింగ్ పాయింట్ల తేడా ఉంది. పంత్ నెక్స్ట్ టార్గెట్ స్టీవ్ స్మిత్. స్మిత్ తాజా ర్యాంకింగ్స్‌లో ఐదో స్థానంలో ఉన్నాడు. ఇంగ్లండ్ పరిమిత ఓవర్ల కెప్టెన్ హ్యారీ బ్రూక్, న్యూజిలాండ్ స్టార్ ఆటగాడు కేన్ విలియమ్సన్, టీమిండియా యువ ఓపెనర్ యశస్వి జైస్వాల్ వరుసగా 2 నుంచి 4 స్థానాల్లో ఉన్నారు. ఈ వారం ర్యాంకింగ్స్‌లో పంత్‌తో పాటు మరిన్ని చెప్పుకోదగ్గ మార్పులు జరిగాయి. ఆసీస్ ఆటగాడు ట్రవిస్ హెడ్ 3, శ్రీలంక ఓపెనర్ పథుమ్ నిస్సంక 14, ఆసీస్ ఆల్‌రౌండర్ బ్యూ వెబ్‌స్టర్ 11, సౌతాఫ్రికా ఆల్‌రౌండర్ 17, మరో సౌతాఫ్రికా ఆల్‌రౌండర్ కార్బిన్ బాష్ 15, వెస్టిండీస్ ప్లేయర్ జస్టిన్ గ్రీవ్స్ 15 స్థానాలు మెరుగుపర్చుకొని 10, 17, 53, 56, 59, 86 స్థానాలకు ఎగబాకారు. బౌలర్ల ర్యాంకింగ్స్‌లో బుమ్రా, రబాడ, కమిన్స్ టాప్3లో కొనసాగుతుండగా.. విండీస్ పేసర్ షమార్ జోసఫ్ 14, ముల్డర్ 6, కార్బిన్ బాష్ 45, చివంగ 35 స్థానాలు మెరుగుపర్చుకొని 36, 52, 57, 88 స్థానాలకు ఎదిగారు. ఆల్‌రౌండర్ల ర్యాంకింగ్స్ విషయానికొస్తే.. రవీంద్ర జడేజా, మెహిది హసన్, జన్సెన్ మొదటి మూడు స్థానాల్లో కంటిన్యూ అవుతున్నారు.




# మహ్మద్ షమీపై మొదటి భార్య హసిన్ కామెంట్స్

కలకత్తా హైకోర్టు తనకు ఫేవర్ గా తీర్పు ఇవ్వడంపై క్రికెటర్ మహ్మద్ షమీ ఫస్ట్ భార్య హసిన్ జహాన్ హర్షం వ్యక్తంచేశారు. మన దేశంలో న్యాయం, ధర్మం ఇంకా బతికే ఉన్నాయని, అందుకు ఆ భగవంతుడికి కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నానని ఆమె అన్నారు. ఎవరి బాధ్యతలు వాళ్లు నిర్వహించాలనే విషయాన్ని కోర్టు తీర్పు స్పష్టం చేసిందని చెప్పారు. మనం ఎవరితోనైనా సంబంధం పెట్టుకునేటప్పుడు అతను మంచివాడు కాదని, మోసగాడని, నీ భవిష్యత్తుతో ఆడుకుంటాడని అతడు ముఖంపై రాసి ఉండదని, అందుకే చాలామందిలాగే తాను కూడా బాధితురాలిని అయ్యానని హసిన్ జహాన్ అన్నారు. పెళ్లికి ముందు తాను మోడల్‌గా చేసేదాన్నని, కానీ పెళ్లి తర్వాత షమీ బలవంతంగా తనను తన వృత్తి నుంచి మాన్పించాడని ఆమె చెప్పారు. తనను వంటింటికే పరిమితం చేశాడని తెలిపారు. తాను షమీని ఎంతగానో ప్రేమించానని, ఈ విషయాన్ని తాను సంతోషంగా ఒప్పుకుంటానని హసిన్ జహాన్ చెప్పారు. కానీ అతను తనను, తన కుమార్తెను వదిలేశాడని, ఇప్పుడు నాకు నేను సొంతంగా సంపాదించుకునే పరిస్థితి లేదని, అందుకే తాము కోర్టును ఆశ్రయించాల్సి వచ్చిందని తెలిపారు. మహమ్మద్ షమీ తనను నాశనం చేయలేదని, ఎందుకంటే తాను న్యాయ మార్గంలో ఉంటే అతను అన్యాయ మార్గంలో ఉన్నాడని అన్నారు. కాగా షమీపై హిసిన్ కలకత్తా హైకోర్టులో మెయింటెనెన్స్ కేసు వేశారు. దాంతో కలకత్తా హైకోర్టు.. హిసిన్‌కు, ఆమె కుమార్తెకు మెయింటెనెన్స్ కోసం నెలకు రూ.4 లక్షలు చెల్లించాలని షమీని ఆదేశిస్తూ ఇవాళ తీర్పు చెప్పింది. కాగా ప్రజంట్ షమీ పై చేసిన కామెంట్స్ సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.



# రాజస్థాన్ నుండి సంజూ శాంసన్ ఔట్.. బిగ్ స్కెచ్!

ఐపీఎల్‌లో ఫ్రాంచైజీలు తమ టీమ్స్ ని ఛేంజ్ చేయడం సహజమే. ముంబై ఇండియన్స్, చెన్నై సూపర్ కింగ్స్ లాంటి పెద్ద సక్సెస్ ఫుల్ టీమ్స్ తప్పితే.. మిగతా అన్ని టీమ్స్ లోనూ ఇది చూస్తూనే ఉంటాం. సీజన్‌లో ప్లేయర్స్ ఆడిన తీరు, లీడర్ షిప్, ఫ్యూచర్ ప్లాన్స్ ను బట్టి ఈ విషయంలో ఫ్రాంచైజీలు ముందుకెళ్తుంటాయి. రాజస్థాన్ రాయల్స్ కూడా ఇదే తోవలో అడుగులు వేస్తున్నట్లు తెలుస్తోంది. కనీసం ఆరుగురు ఆటగాళ్లను వదులుకోవడానికి ఆ జట్టు రెడీ అవుతున్నట్లు టాక్. ఇందులో భాగంగానే కెప్టెన్, వికెట్ కీపర్ సంజూ శాంసన్‌కు గుడ్‌బై చెప్పాలని నిర్ణయించుకున్నట్లు వినిపిస్తోంది. రాజస్థాన్ ను వదిలి సంజూ శాంసన్ అందుబాటులోకి వస్తాడేమోనని రెండు ఫ్రాంచైజీలు ఎదురు చూస్తున్నాయని తెలుస్తోంది. ఈ వికెట్ కీపర్ బ్యాటర్ తమ టీమ్‌లోకి వస్తే ఎదురుండదని అనుకుంటున్నాయట. అందులో ఒకటి కోల్‌కతా నైట్ రైడర్స్ అయితే.. మరొకటి చెన్నై సూపర్ కింగ్స్ అని సమాచారం. కేకేఆర్ కంటే కూడా సీఎస్‌కే సంజూ రాక కోసం తీవ్రంగా ఎదురు చూస్తున్నట్లు తెలుస్తోంది. వచ్చే ఐపీఎల్‌తో ఎంఎస్ ధోని 45లోకి అడుగుపెడతాడు. కాబట్టి కీపర్ బ్యాటర్ అయిన ధోనీకి ఆల్టర్ నేట్ గా శాంసన్‌ను తీసుకోవాలని సీఎస్‌కే సమాలోచనలు చేస్తున్నట్లు టాక్. అందుకోసం తెర వెనుక బిగ్ స్కెచ్ వేసినట్లు వినిపిస్తోంది. ఎంత ధరకైనా సరే అతడ్ని దక్కించుకోవాలని ఫిక్స్ అయ్యిందట ఎల్లో ఆర్మీ. సంజూ శాంసన్ కోసం మేం ఎదురు చూస్తున్నాం. అతడు భారత బ్యాటర్. కీపింగ్‌తో పాటు ఓపెనింగ్ కూడా చేస్తాడు. కాబట్టి అతడు అందుబాటులో ఉంటే దక్కించుకునేందుకు ప్రయత్నిస్తాం. అయితే ఎవర్ని ట్రేడ్ చేసి సంజూను తీసుకోవాలనేది ఇంకా ఖరారు కాలేదు. ఎందుకంటే వచ్చే సీజన్‌కు ఇంకా చాలా సమయం ఉంది. సంజూ విషయంలో ఎంతో ఆసక్తితో ఉన్నామని మాత్రం చెప్పగలను అని ఓ మీడియా ఛానెల్ తో సీఎస్‌కే ఫ్రాంచైజీ అధికారి చెప్పాడు. ఇది చూసిన నెటిజన్స్.. సంజూను చెన్నైలోకి తీసుకొచ్చేందుకు గట్టిగానే ప్రయత్నాలు జరుగుతున్నాయని కామెంట్ చేస్తున్నారు.



# స్పోర్ట్స్ కు సరికొత్త జోష్



కొత్త నేషనల్ స్పోర్ట్స్ పాలసీకి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర మంత్రిమండలి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. తాజాగా జరిగిన కేబినెట్ మీటింగ్ లో కొత్త క్రీడా పాలసీకి ఖేలో భారత్ నీతి అని పేరు పెట్టారు. 2047 నాటికి ప్రపంచంలో టాప్ 5 క్రీడా దేశాల్లో భారత్ ఒకటిగా నిలబడాలనే లక్ష్యంతో ఈ పాలసీని రూపొందించినట్టు ప్రధాని మోదీ తెలిపారు. కొత్త పాలసీలో ఐదు ప్రధాన అంశాలను పొందుపరిచారు. ప్రపంచ వేదికలపై సత్తా చాటడం, ఆర్థిక అభివృద్ధిలో క్రీడారంగం భాగస్వామ్యం, సామాజిక అభివృద్ధిలో క్రీడల పాత్ర, ప్రజా ఉద్యమంగా క్రీడలు, జాతీయ విద్యా విధానంలో క్రీడలకు చోటు అనే ఐదు అంశాలకు కొత్త పాలసీలో ప్రాధాన్యత ఇచ్చారు. ఒలింపిక్స్ సహా అంతర్జాతీయ పోటీల్లో పతకాలు సాధించడం, క్రీడా సంబంధిత పర్యాటకం, మౌలిక సదుపాయాల కల్పన, ఆర్థిక అభివృద్ధికి దోహదం, ఆదివాసీ, వెనుకబడిన వర్గాలు, మహిళలను క్రీడారంగంలో రాణించేందుకు ప్రోత్సహించడం, జాతీయ విద్యా విధానంలో క్రీడలను తప్పనిసరి సబ్జెక్ట్ గా యాడ్ చేయడం, ఇవన్నీ అమలయ్యేందుకు ప్రత్యేక పరిపాలన వ్యవస్థను రూపొందించాలనే అంశాలకు పాలసీలో ప్రాముఖ్యత ఇచ్చారు. స్పోర్ట్స్ పాలసీ 1984లో ఫస్ట్ టైమ్ అమల్లోకి రాగా 2001లో చివరిసారిగా మోడరేట్ చేశారు. 2014 తర్వాత బీజేపీ ప్రభుత్వం వచ్చాక ఖేలో ఇండియా, టాప్స్ వంటి పథకాలను ప్రవేశపెట్టారు. 2028లో జరిగే నెక్స్ట్ ఒలింపిక్స్‌లో భారత పతకాల సంఖ్య రెండు అంకెలకు చేరాలని కేంద్ర క్రీడాశాఖ లక్ష్యంగా పెట్టుకుంది. 2036 ఒలింపిక్స్ ఆతిథ్య హక్కుల కోసం కూడా భారత్ ప్రయత్నాలు చేస్తోంది. భారత ఒలింపిక్ సంఘం అధ్యక్షురాలు పీటీ ఉష బృందం లాసన్నేలోని ఇంటర్నేషనల్ ఒలింపిక్ సంఘం ప్రధాన కార్యాలయానికి వెళ్లింది. 2036 ఒలింపిక్స్ ఆతిథ్యానికి ఇప్పటికే సన్నద్ధత లెటర్ ను ఇచ్చిన ఐఓఏ, భారత్‌లో విశ్వ క్రీడల నిర్వహణకు ఉన్న వనరుల గురించి ఐఓసీ ప్రతినిధులకు ఉష బృందం వివరించింది. అహ్మదాబాద్ వేదికగా ఒలింపిక్స్ నిర్వహణ ప్రతిపాదనల గురించి చర్చలు జరిపారు.




# అప్ కమింగ్ మూవీస్.. కిక్ ఇవ్వనున్నాయా?

తెలుగు సినిమా ఇండస్ట్రీలో ఈ ఇయర్ ఫస్ట్ ఆరు నెలలు బాక్సాఫీస్ దగ్గర భారీ కలెక్షన్స్ ఏం రాలేదు. ఈ క్రమంలో కొన్ని సినిమా అట్రాక్టివ్ గా ఉన్నా.. చాలా వరకు సినిమాలు డిజప్పాయింట్ చేశాయి. అందులోనూ వీటిల్లో ఎక్కడా పెద్ద సినిమాలు కనిపించలేదు. ఇప్పుడు టాలీవుడ్ ఫోకస్ మొత్తం సెకండ్ ఆరు నెలలపైనే ఉంది. అసలు సిసలు బాక్సాఫీస్ గేమ్ ఇప్పుడు స్టార్ట్ కానుంది. జనవరిలో సంక్రాంతికి వస్తున్నాం డాకు మహారాజ్ సినిమాలు మంచి వసూళ్లు సాధించాయి. ఫిబ్రవరిలో మాత్రం తండేల్ ఒక్కటే నిలిచింది. మార్చిలో కోర్ట్ అండ్ మ్యాడ్ స్క్వేర్ ఆకట్టుకున్నా.. మిగతా సినిమాలన్నీ తేలిపోయాయి. ఏప్రిల్‌లో హిట్ ఏదీ లేదు. మే నెలలో హిట్ 3: ది థర్డ్ కేస్, సింగిల్ సినిమాలు ఓకే అనిపించాయి. జూన్‌లో మాత్రం కుబేర, కన్నప్ప సినిమాలు ఓ రేంజ్‌లో కలెక్షన్ల దూకుడు చూపించాయి. అయితే ఫస్ట్ హాఫ్‌లో పెద్ద సినిమాలు తక్కువగా ఉండడం గమనార్హం. ఈ స్థితిలో నేటి నుండి మొదలుకానున్న సెకండాఫ్ పై ఎగ్జిబిటర్లు, ట్రేడ్ వర్గాలు భారీ ఆశలు పెట్టుకున్నారు. ఎందుకంటే భారీ స్టార్లతో రూపొందుతున్న పలు పాన్ ఇండియా సినిమాలు జూలై నుంచి రిలీజ్ కు రెడీ అవుతన్నాయి. హరి హర వీర మల్లు సినిమాను జూలై 24న రిలీజ్ చేయనున్నట్టు అఫిషియల్ గా అనౌన్స్ చేశారు. అదే సమయంలో విజయ్ దేవరకొండ నటించిన కింగ్‌డమ్ మూవీ జూలైలో రిలీజ్ చేయాలన్న ఉద్దేశంతో ఉండగా.. ఇప్పుడు అది ఆగస్టుకు పోస్ట్ పోన్ అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. అంతేకాకుండా, నితిన్ వేణు శ్రీరామ్ కాంబినేషన్‌లో వస్తున్న తమ్ముడు సినిమా జూలై 4న రిలీజ్ కానుంది. ఈ సినిమాలతో పాటు.. ఓజీ, అఖండ 2, మిరాయ్, విశ్వంభర, ద రాజా సాబ్ లాంటి భారీ సినిమాలు కూడా రెండో భాగంలో విడుదలకు సిద్ధంగా ఉన్నాయి. వీటిలో కొన్ని చారిత్రక అంశాలతో, మరికొన్ని పవర్‌ఫుల్ మాస్ ఎంటర్‌టైనర్లుగా ఉండడం విశేషం. ప్రేక్షకులు ఇప్పటికే ఈ సినిమాలపై భారీ అంచనాలు పెట్టుకున్నారు. పోస్టర్లు, టీజర్‌లు కూడా హైప్‌ను పెంచుతున్నాయి. ఇక మొత్తంగా చూస్తే.. టాలీవుడ్‌కు 2025లో నిజమైన పరీక్ష ఇప్పుడు మొదలవుతోంది. మొదటి ఆరు నెలలు నిదానంగా సాగినా.. రెండో భాగం దూసుకెళ్తుందని ఆశిస్తున్నారు. నిజానికి ఇండస్ట్రీ ఉత్సాహంగా ఉండాలంటే.. ఒక్కటి కాదు, వరుస విజయాలు అవసరం. అందుకు అవసరమైన కంటెంట్ ఈ సెకండ్ పార్ట్ లో కనిపిస్తోంది. మరి ఈసారి టాలీవుడ్ ఎలాంటి విజయాలను అందుకుంటుందో చూడాలి.




# అఫిషియల్.. ఫైనల్ గా రామయణ అనౌన్స్ మెంట్

వరల్డ్ వైడ్ గా ఇండియన్ ఆడియన్స్ ఎంతగానో వెయిట్ చేస్తున్న సినిమాల్లో నితేష్ తివారీ తెరకెక్కిస్తున్న రామాయణ కూడా ఒకటి. బాలీవుడ్ స్టార్ హీరో రణబీర్ కపూర్ రాముడి పాత్రలో యాక్ట్ చేస్తున్నారు. సాయిపల్లవి సీత క్యారెక్టర్ లో యాక్ట్ చేస్తున్నారు. కేజీఎఫ్ ఫేమ్ యశ్ రావణుడిగా నటిస్తున్నారు. పైగా ఈ సినిమా దాదాపు వెయ్యి కోట్ల రూపాయల బడ్జెట్ తో తెరకెక్కడం. ఇలా ఎన్నో ఇంట్రెస్టింగ్ ఎలిమెంట్స్ ఉన్న ప్రాజెక్ట్ కావడంతో భారీ హైప్ క్రియేట్ అయ్యింది. అయితే ఈ సినిమా గురించి లాస్ట్ రెండేళ్లుగా రూమర్స్ వినిపించడమే తప్ప మేకర్స్ దగ్గర్నుండి ఎలాంటి అఫిషియల్ ఇన్ఫర్మేషన్ లేదు. ఫైనల్ గా మేకర్స్ దగ్గర్నుండి అఫిషియల్ గా అనౌన్స్ మెంట్ వచ్చింది. దీంతో ఫైనల్ గా రామాయణ నుంచి అఫిషియల్ అనౌన్స్‌మెంట్, అంతే కాకుండా గ్లిమ్స్ రాబోతున్నాయి. అది కూడా మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. రామాయణ టైటిల్ గ్లిమ్స్‌ను అధికారికంగా విడుదల చేయబోతున్నారు. దేశంలోని ప్రధానమైన 9 నగరాల్లో ఈ సినిమా టైటిల్ గ్లిమ్స్ ను బిగ్ స్క్రీన్ పై స్క్రీనింగ్ చేసేందుకు గాను ఏర్పాట్లు చేశారు. జులై 3వ తారీకు అంటే నేడు ఉదయం 11.30 గంటలకు 9 స్క్రీన్స్‌లో గ్లిమ్స్ స్క్రీనింగ్ కానున్నట్లు మేకర్స్ ప్రకటించారు. హైదరాబాద్ ప్రేక్షకుల కోసం ఈ గ్లిమ్స్‌ను ప్రసాద్ మల్టీప్లెక్స్‌లో స్క్రీనింగ్ చేయబోతున్నారు. అభిమానులు, ప్రేక్షకులు పెద్ద ఎత్తున హాజరు కావాలని మేకర్స్ ఒక పోస్టర్‌ను విడుదల చేసి అందులో పేర్కొన్నారు. హైదరాబాద్‌తో పాటు బెంగళూరు, చెన్నై, ఢిల్లీ, అహ్మదాబాద్, కోల్‌కత్తా, పూణే, కొచ్చి, ముంబై ల్లో ఈ స్క్రీనింగ్ ఉండబోతుంది. దేశవ్యాప్తంగా సినీ ప్రేమికులు రామాయణ సినిమా ను వెండి తెరపై చూడటం కోసం ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. రెండు మూడు పార్ట్‌లుగా ఈ సినిమాను తీసుకు రాబోతున్నట్లు సమాచారం అందుతోంది. వచ్చే ఏడాదిలో ప్రేక్షకుల ముందుకు తీసుకు వచ్చేందుకు గాను ఏర్పాట్లు చేస్తున్నారు. అలాగే సినిమా ప్రమోషన్స్ మొదలు పెట్టడంలో భాగంగానే రామాయణ గ్లిమ్స్ ను విడుదల చేయబోతున్నారని తెలుస్తోంది. ఈ సినిమా నిర్మాణ భాగస్వామిగా యశ్ కూడా ఉండటం విశేషం. ఈ సినిమాలో ఇంకా ఎంతో మంది బాలీవుడ్, సౌత్ స్టార్స్ నటిస్తున్నారు. త్వరలోనే రామాయణకు సంబంధించిన రిలీజ్ డేట్‌ను సైతం ప్రకటిస్తారని సమాచారం అందుతోంది.

# కొరటాల.. వెయిటింగ్ తప్పదా?



టాలీవుడ్ స్టార్ డైరెక్టర్ కొరటాల శివ.. రైటర్ గా కెరీర్ స్టార్ట్ చేసిన ఆయన.. ఎన్నో సూపర్ హిట్ సినిమాలకు కథ, మాటలు అందించి మెప్పించారు. ఆ తర్వాత మెగా ఫోన్ పట్టి.. తక్కువ టైమ్ లోనే స్టార్ డైరెక్టర్స్ లిస్ట్ లోకి చేరారు. మిర్చి, శ్రీమంతుడు, భరత్ అనే నేను, జనతా గ్యారేజ్ వంటి సినిమాలతో ఆడియన్స్ ను రేంజ్ లో మెప్పించారు. తన రేంజ్ ఏంటో ప్రూవ్ చేసుకున్నారు. కమర్షియల్ సినిమాలకు తన స్టైల్ లో మెసేజ్ యాడ్ చేస్తూ ఎంతో మందికి ఫేవరెట్ డైరెక్టర్ గా మారారు. కెరీర్ పీక్స్ లో ఉన్న టైమ్ లో ఆచార్యతో డిజప్పాయింట్ చేశారు. కానీ ఆ తర్వాత జూనియర్ ఎన్టీఆర్ నటించిన దేవర మూవీతో హిట్ ను అందుకున్నారు. కెరీర్ లోనే బిగ్గెస్ట్ హిట్ అందుకుని కమ్ బ్యాక్ ఇచ్చారు. 2024లో రిలీజ్ అయిన మూవీల్లో దేవర అతిపెద్ద హిట్స్ లో ఒకటిగా నిలిచింది. ఆ తర్వాత నుండి మళ్లీ ఇప్పటి వరకు కొత్త సినిమాను ఇంకా స్టార్ట్ చేయలేక పోయారు. దేవర వచ్చి చాలా నెలలు అవుతున్నా అనౌన్స్మెంట్ కూడా ఇవ్వలేదు. నిజానికి కొరటాల ఇప్పుడు దేవర2పై వర్క్ చేస్తున్నారు. స్క్రిప్ట్ వర్క్ పూర్తి చేస్తున్నట్లు తెలుస్తోంది. కానీ తారక్ మాత్రం ఫుల్ బిజీగా ఉన్నారు. బాలీవుడ్ డెబ్యూ వార్ 2, తర్వాత ప్రశాంత్ నీల్ ప్రాజెక్ట్.. ఆ తర్వాత త్రివిక్రమ్ తో మైథలాజికల్ సినిమా.. ఇలా వరుస సినిమాలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. అందుకే ఆయన దేవర2ను మొదలుపెట్టడానికి చాలా సమయం పడుతుందని క్లియర్ గా తెలుస్తోంది. దీంతో దేవర సీక్వెల్ ఆలస్యమవుతుందని, కొరటాలకు ఇంకా వెయిటింగ్ తప్పదని అర్థమవుతుంది. అలా అని కొరటాల.. వేరే హీరోతో సినిమా చేద్దామనుకున్నా ఎవరూ ఖాళీగా లేరు. తమ తమ లైనప్స్ లోని సినిమాలతో ఫుల్ బిజీగా ఉన్నారు. బడా హీరోల నుంచి మీడియం రేంజ్ హీరోల వరకు అంతా ఇతర కమిట్మెంట్స్ తో ఉన్నారు. కాబట్టి కొరటాల మరో హీరోతో తీద్దామనుకున్నా కష్టమే. మరి కొరటాల తన నెక్స్ట్ ప్రాజెక్ట్ గురించి ఎలాంటి డెసిషన్ తీసుకుంటారో చూడాలి.




# మోస్ట్ ప్రామిసింగ్ గా తమ్ముడు మరో ట్రైలర్

మన టాలీవుడ్ యూత్ స్టార్ నితిన్ హీరోగా దర్శకుడు శ్రీరామ్ వేణు కాంబోలో చేసిన మోస్ట్ అవైటెడ్ సినిమానే తమ్ముడు. ఫ్యాన్స్ ఎప్పుడు నుంచో ఆసక్తిగా ఎదురు చూస్తున్న ఈ సినిమా ఈ శుక్రవారం థియేటర్స్ లో సందడి చేసేందుకు సిద్ధం కాగా ఈ లోపే మేకర్స్ రిలీజ్ ట్రైలర్ గా మరొకటి వదిలారు. అయితే ఈ ట్రైలర్ మాత్రం మరింత ప్రామిసింగ్ గా ఉందని చెప్పాలి. ఇంటెన్స్ ఎమోషన్స్ సహా యాక్షన్ ఎలిమెంట్స్ తో ట్రైలర్ అదిరింది. తన అక్క కోసం ఎంత దూరమైనా వెళ్లగలిగే తమ్ముడుగా నితిన్ తన అక్క ఆపదలో ఉందని తెలిసాక ఏం చేసాడు అన్న విజువల్స్ ని సాలిడ్ గా ప్రెజెంట్ చేశారు. అలాగే విలన్ రోల్ లో యానిమల్ నటుడు సౌరబ్ సచ్ దేవా క్రూరంగా కనిపిస్తున్నాడు. ఇక మరో మేజర్ హైలైట్ ట్రైలర్ లో అజనీష్ లోకనాథ్ ఇచ్చిన స్కోర్ అని చెప్పాలి. ఇది థియేటర్స్ లో ట్రాన్స్ లోకి తీసుకెళ్తుంది అనిపిస్తుంది. ఇలా మొత్తానికి మాత్రం ఒక ప్రామిసింగ్ రిలీజ్ ట్రైలర్ తో మేకర్స్ ట్రీట్ ఇచ్చారని చెప్పొచ్చు. ఇక దిల్ రాజు బ్యానర్ లో నిర్మాణం వహించిన ఈ సినిమా జూలై 4న గ్రాండ్ గా రిలీజ్ కి రాబోతుంది. ఇక బ్యాక్ టు బ్యాక్ సినిమాలు ఫ్లాప్ అవ్వడంతో ఈ సినిమాపైనే నితిన్ భారీగా అంచనాలు పెట్టుకున్నారు. దీంతో ఈ సినిమాపై మంచి ఇంట్రెస్ట్ క్రియేట్ అయ్యింది. మరి ఈ సినిమా ఎలాంటి సక్సెస్ ను అందుకుంటుందో చూడాలి.




# వావ్ అనిపించేలా హిరణ్యాకశిపుడి ప్రోమో

సౌత్ ఇండియాలో మోస్ట్ పాపులర్ ప్రొడక్షన్ హౌస్ హోంబలే ఫిల్మ్స్ గురించి అందరికీ తెలిసిందే. కేజీఎఫ్, కాంతార, సలార్ వంటి పలు సినిమాలతో పాన్ ఇండియా లెవెల్ లో మంచి గుర్తింపు సంపాదించుకుంది. ఇప్పుడు వరుస సినిమాలతో అలరించేందుకు సిద్ధమైంది. అందులో భాగంగా మహావతార్ సినిమాటిక్ యూనివర్స్ ను అనౌన్స్ చేసింది. యూనివర్స్ లో భాగంగా ఏకంగా ఏడు సినిమాలు తీసుకురానున్నట్లు తెలిపింది. విష్ణుమూర్తి పది అవతారాలపై సినిమాలు ప్లాన్ చేస్తున్నట్లు అధికారికంగా తెలిపింది. అందులో భాగంగా ఇప్పుడు ఫస్ట్ సినిమా మహావతార్: నరసింహను ప్లాన్ చేస్తుంది. జూలై 25న ఆ సినిమా రిలీజ్ చేయనున్నట్లు ఇప్పటికే తెలిపింది. అశ్విన్ కుమార్ దర్శకత్వం వహిస్తున్న మహావతార్ నరసింహ మూవీని శిల్పా ధవాన్, కుశల్ దేశాయ్, చైతన్య దేశాయ్ నిర్మిస్తున్నారు. ఇప్పటికే మేకర్స్ రిలీజ్ చేసిన టీజర్.. భారీ రెస్పాన్స్ అందుకుంది. సినిమాపై ఓ రేంజ్ లో అంచనాలను నెలకొల్పింది. మేకర్స్ విజన్ పై బజ్ క్రియేట్ చేసి వారిలో జోష్ నింపింది. ఇప్పుడు అదే జోష్ తో రాక్షస రాజు హిరణ్యకశిపుడి పాత్రను మేకర్స్ తాజాగా పరిచయం చేశారు. ఆ సమయంలో వీడియో కూడా రిలీజ్ చేశారు. అధర్మానికి రూపం.. దేవతలనే సవాలు చేసే తత్వం అంటూ షేర్ చేశారు. ప్రస్తుతం ఆ వీడియో సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. ఆడియన్స్ ను విపరీతమైన రెస్పాన్స్ అందుకుంటోంది. అన్నీ నాశనమైపోయాయి అంటూ బ్యాక్ గ్రౌండ్ డైలాగ్ తో గ్లింప్స్ స్టార్ట్ అయింది. ఆ తర్వాత విష్ణువును పూజిస్తున్నావా అంటూ రాక్షస రాజు అందరినీ చంపేస్తుంటాడు. ఇకపై మీరందరికీ ఏకైక భగవంతుడిని నేనే.. దేవాలయాల్లో నా విగ్రహాలు ఉండాలి.. కాచుకో విష్ణు.. భక్తులందరినీ వెతికి చంపుతూ.. నీవు ఎప్పుడైనా నా ముందుకు రాక తప్పదు అంటూ హిరణ్యకశిపుడిని పరిచయం చేశారు. అయితే వీడియో వేరే లెవెల్ లో ఉందని చెప్పాలి. అద్భుతమైన సినిమాటిక్ అనుభవం మూవీ అందించనున్నట్లు క్లియర్ గా అర్థమవుతోంది. ప్రతి ఒక్క విజువల్ కూడా రిచ్ గా ఉంది. యానిమేషన్ ఓ రేంజ్ లో ఉందని నెటిజన్లు, సినీ ప్రియులు కామెంట్లు పెడుతున్నారు. ఓవరాల్ గా గ్లింప్స్.. అంచనాలు పెంచుతుందని అంటున్నారు.